
# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19, సంచిక: 1, జనవరి 2026

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19 సంచిక: 1


**సలహాదారులు, స్ఫూర్తిదాత, కర్త, కర్మ, క్రియ మా ప్రభు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**


ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: **పత్తి సుబ్రమణ్యం,**
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| పల్లీయుల పర్వం–సంక్రాంతి పర్వం | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 9 |
| సంక్రాంతి సంబరాలు | 22 |
| మార్గదర్శకులు – మహర్షులు (సీరియల్) | 25 |
| విష్ణుప్రియం–తిరుప్పావై | 29 |
| హరే శ్రీనివాసా.. పుస్తక సమీక్ష | 32 |
| రామాయణ రత్నాకరం (సీరియల్) | 36 |
| అంబరీషోపాఖ్యానం | 40 |
| ముకుందమాల (సీరియల్) | 43 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం (సీరియల్) | 49 |
| తిరుమల సర్వస్వం (సీరియల్) | 55 |
| నవవిధ భక్తిమార్గాలు– నామస్మరణభక్తి | 60 |
| పుష్యమాసం విశిష్టత | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# స్వామి ఋణం

'శ్రీవేంకటేశం' పాఠకులకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ 2026 నూతన సంవత్సరంలో మనమందరం తిరుమల వేంకటేశ్వరుని కృపాకటాక్షాలు మరింతగా పొంది, ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లగలమని ఆశిస్తున్నాము.

'శ్రీవేంకటేశం' మాసపత్రిక నేటితో 17 సంవత్సరాలు పూర్తి చేసుకుని 18వ సంవత్సరంలోకి అడుగిడింది. ఏప్రిల్ 2007 లో 'నమో వేంకటేశాయ' గా ప్రారంభించిన ఈ పత్రిక, జనవరి 2008 నుండి 'శ్రీవేంకటేశం' అని పేరు మార్చుకుని మీ ముందుకు వస్తోంది.

కలియుగ మానవుడు తరించాలంటే కేవలం శ్రీవేంకటేశ్వరుని నామస్మరణ మాత్రమే ఏకైక మార్గమని నమ్మి, జనులందరూ ఆయన నామాన్ని స్మరించి, కీర్తించి ధన్యులు కావాలన్నదే ఈ పత్రిక ముఖ్య ఉద్దేశ్యము. భగవంతుడు భక్తికి మాత్రమే వశుడు. కాబట్టి పాఠకులలో భక్తిభావాన్ని పెంపొందించుటకు, పెంపొందిన భక్తి స్థిరంగా నిలుపుటకు మా శక్తిమేర ప్రయత్నిస్తున్నాము. వీలైనంత ఎక్కువమంది భక్తులకు స్వామి కృప లభించేటట్లు చేయుట మా సేవక ధర్మానికి నిదర్శనంగా భావించాము. కాబట్టి ఈ పత్రికలో ఎలాంటి ప్రకటనలకు తావివ్వకుండా, భక్తిపరమైనవి, స్వామికి సంబంధించినవి మరియు పాజిటివ్ ఆలోచనలు కలిగినవి మాత్రమే ప్రచురిస్తున్నాము. ఈ పత్రికను వెలువరించుటకు తిరుమల వేంకటేశ్వరుడు ఎన్నో లీలలను చూపాడు. వాటిని "తిరుమల వేంకటేశ్వరుని దిశా నిర్దేశం" లో ప్రచురించాము. పాఠకులు వాటిని చదివి, మనకోసం స్వామి శ్రమను గుర్తించారని భావిస్తున్నాము. నిజానికి భగవంతుడు సర్వశక్తిమంతుడు కాబట్టి ఆయన మరే కష్టమును పడవలసిన అవసరము లేదు. కాని మనమీద ఉన్న ప్రేమతో మరియు మనకు ఆదర్శంగా ఉండుటకు మాత్రమే వదలకుండా భక్తుల ఉద్ధరణకై ప్రాకులాడుచున్నాడు. కృతయుగము మొదలు కలియుగము వరకు ఇలా ఎన్నో యుగాలలో సృష్టి ప్రారంభం నుండి తీరిక లేకుండా శ్రమిస్తూనే ఉన్నాడు. నేటి జన్మకే కాకుండా గతంలోని మన ఎన్నో జన్మలకు ఆయనే మార్గదర్శకుడు. మనపైన ప్రేమ చూపుతున్న అంతటి మహోన్నతునికి మనమేమి ఇవ్వగలము. పత్రం, పుష్పం, ఫలం, తోయం తప్ప నాకేమీ అవసరం లేదని స్వామివారే స్వయంగా భగవద్గీతలో చెప్పారు. కాని వారిని సంతృప్తి పరచుట లేదా ఋణం తీర్చుకొనుట మన ధర్మంగా భావించినప్పుడు తప్పక స్వామివారు తృప్తి చెందుదురు. అయితే భగవంతుణ్ణి ఎలా తృప్తి పరచాలి? మనం ఏం చేయాలి? ఎలా చేయాలి? అనే ప్రశ్నలు మనకి మనము వేసుకుని ప్రయత్నించాలి. పిల్లలు సన్మార్గంలో పయనిస్తే తల్లితండ్రులు సంతోషించినట్లు, మనం సన్మార్గంలో పయనిస్తూ, సదా ఆయన స్మరణలో కాలం గడపడం ద్వారా భగవంతుడు తృప్తి చెందగలడు. మనిషి సత్వగుణాన్ని అలవరచుకుని మనలోని అరిషడ్వర్గాలనే వికారాలను సమూలంగా తృంచివేయాలి. భగవంతుణ్ణి తృప్తి పరచేందుకే మనకు ఈ జన్మ లభించిందనే దృఢమైన భావం కలిగి ఉండాలి. మనం జన్మించక మునుపే మనకు ప్రేమను పంచుటకు, తల్లితండ్రులను, సోదరులను, బంధుమిత్రులను ప్రసాదించి మన బాగోగులు చూచువాణ్ణి ఎలా మరువగలమనే భావం కలిగి ఉండాలి. ఈ భావాలతో మనం ఒక్క అడుగు ఆయన వైపు వేస్తే, మనవైపు స్వామివారు నాలుగు అడుగులు వేసి మనలను మరింత ముదుకు తీసుకెళతారు. భగవంతునికి శరణాగతి చేసి మన సర్వసంపద, వ్యక్తిత్వం సహితం అర్పించి జీవించుట ఉత్తమము. అహంకారము, మానావమానముల యందు రుచిని పూర్తిగా వదిలివేయాలి. సద్గ్రంథ పఠనము, పెద్దల ప్రవచనములు వినుట ఉపయుక్తములు. కాని వీటిని ఆచరణలో పెట్టినవాడే విజయుడౌతాడు. సదా స్వామి స్మరణ అన్నింటికంటే ముఖ్యం! అప్పుడప్పుడు మన ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంటుంది. కాని స్వామివారిపై నమ్మకం చెదరక ఉండుట మన కర్తవ్యం! మనకు ఎదురయ్యే ప్రతి పరిస్థితిని స్వామివారు మనకు ప్రసాదించిన పరీక్ష లాగా భావిస్తూ, సంతృప్తికరంగా నిర్వహించుట మన బాధ్యత. ఇలా ఆదర్శవంతంగా జీవితము గడపాలి. వారి ఋణం తీర్చుకొనుటకు తపనతో సదా స్వామివారిని ప్రార్థిస్తూ ఉండాలి. రోజు రోజుకూ మన ఆయుష్షు క్షీణించిపోవుచుండును. కాబట్టి స్వామివారిని ఈ జీవితంతో తృప్తి పరచుటకు కావలసిన యోగ్యతను త్వరగా సాధించుటకు తీవ్రయత్నం చేయుచు జీవించువాడు ధన్యుడు. శ్రీవేంకటేశ్వరునికి ప్రియుడు. నమో వేంకటేశాయ.

నమో వేంకటేశాయ

**వినా వేంకటేశం న నాథో న నాథః।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు: ____________________

____________________

చిరునామా: ____________________

____________________

____________________

____________________


____________________

పిన్‌కోడ్: ____________________

చందా వివరాలు: ____________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

**చందాదారులకు**
**స్వామివారి పవిత్ర పాదాలు**
**(10"x8") ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

**శ్లో ॥ సత్తోత్తరైః సతత సేవ్య పదాంబుజేన**
**సంసార తారక దయార్ద్ర దృగంచలేన**
**సౌమ్యోపయంతృ మునినా మమ దర్శితౌ తే**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే**

తాత్పర్యం – శ్రీవేంకటేశ్వరా! సత్వగుణ సంపన్నులు, ఎల్లప్పుడు పూజింపదగిన పాదపద్మములు గలవారు, సంసారమును తరింపచేయు కరుణా కటాక్షములు గలవారు అగు నా ఆచార్యులైన మణవాళ మహామునులచే చూపబడిన నీ పాదపద్మములను రక్షకముగా ఆశ్రయించుచున్నాను.

**శ్లో॥ శ్రీశ శ్రియా ఘటికయా త్వదుపాయభావే**
**ప్రాప్యే త్వయి స్వయ ముపేయతయా స్ఫురంత్యా**
**నిత్యాశ్రితాయ నిరవద్య గుణాయ తుభ్యం**
**స్యాం కింకరో వృష గిరీశ న జాతు మహ్యామ్**

తాత్పర్యము – లక్ష్మీనాథుడవగు వేంకటాచలపతీ! నీవు మాకు ఉపాయముగా నున్నపుడు (మేము చేయు సేవలను స్వీకరించువాడవై యున్నపుడు) తాను కూడా ప్రాప్యయై (మా సేవలను స్వీకరించునదియై) ప్రకాశించుచుండెడి లక్ష్మీదేవికి (అలమేల్మంగ) నివాస స్థానమైన, దోషరహితమైన సద్గుణములు కలవాడవు అగు నీకు (వేంకటేశ్వరునకు) నేను సేవకుడనగుదును. నాకు మరొక సేవకుడు ఎప్పుడూ అవసరం లేదు. నేను ఎల్లప్పుడూ నీ సేవకుడను. నేను స్వతంత్రుడను, యజమానిని కాను అని భావము.

# ముక్తిమార్గము



భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య

## గుండక్రియ

కడుపెంత తాఁగుడుచు – కుడు పెంత దీనికై
పడని పాటుల నెల్లఁ – బడి పొరలనేలా? ||పల్లవి||

1. పరుల మనసునకు నా – పదలు గలుగఁగ జేయు
పరితాపకరమైన – బ్రదుకేలా?
పొరిది నితరుల మేలు – చూచి సైపఁగ లేక
తిరుగుచుండెడి కష్ట – దేహమిది యేలా? ||కడు||

2. ఎదిరి కెప్పడుఁ జేయు – హితమెల్లఁ దనదనుచు
చదివి చెప్పని యట్టి – చదువేలా?
పొదిగొన్న యాసలోఁ – బుంగుడై సతతంబు
సదమదంబై పడయు – చవులు దనకేలా ||కడు||

3. శ్రీవేంకటేశ్వరుని సేవానిరతికిఁ గాక
జీవన భ్రాంతిఁబడు – సిరులేలా?
దేవోత్తముని నాత్మఁ – దెలియ నొల్లక పెక్కు
త్రోవలేగిన దేహి – దొరతనం బేలా ||కడు||





**భావము :**

మనుజునిది జానెడు పొట్ట. దానికి పట్టెడన్నము పడవేసిన చాలును. ఈ కొద్దిపాటి తిండికై పడరాని దురవస్థలు పడి నవయుటెందుకు?

ఇతరుల మనస్సును కష్టపెట్టు బ్రదుకెందుకు? అట్లు కష్టపెట్టి పాపము మూటగట్టుకొని ఇతరులచే అయ్యో పాపమనిపించుకొను దయనీయమైన జీవనముచే ప్రయోజనమేమి? పరుల మేలు జూచి సైరింప జాలక అసూయతో గూడి ఇటునటు తిరుగులాడు ఈ తుచ్ఛమైన తనువును మోసినందువల్ల లాభమేమి?

ఇతరులకు చేయు మేలంతయు తనకు తాను చేసికొన్న మేలే అను భావమును శ్రుతి స్మృతి పురాణాదుల వాక్యములతో సమన్వయించి చెప్పజాలని చదువు చదివి మాత్రము ఉపయోగమేమి? ఆశలు పెంచుకొని అందులో మునిగి ఎల్లప్పుడు నలినూకలై అనుభవించు తుచ్ఛభోగము లెందుకు? శ్రీవేంకటేశ్వరుని సేవలకై వినియోగపడక చంచలమైన జీవనమందే భ్రాంతి పెంపొందింపచేయు సంపదలెందుకు? ఆ దేవాధిదేవుని హృదయములో గుర్తింపక భౌతిక వాంఛలకు లోనై నానా మార్గములలో పయనించిన జీవుని దొరతనము నిరుపయోగము కదా!



# పల్లీయుల పర్వం సంక్రాంతి పర్వం

- చిల్లర సీతారామారావు

**ఆనందమునకు ఆకరములు పల్లెలు. పల్లెలలో నివసించువారు పల్లీయులు. పల్లీయులకు సంతోషకరమైన పండుగ సంక్రాంతి పండుగ. ఈ పండుగ పుష్యమాసములో వస్తుంది. ధాన్యాది పంటలు పుష్కలముగా పండి చేతికి అందుతాయి కనుక పుష్యమాసములో వచ్చు సంక్రాంతిని పౌష్యలక్ష్మిగా భావిస్తారు. జనవరి 14వ తారీకున వచ్చు సంక్రాంతి పండుగను పెద్ద పండుగ అని, సూర్యుడు మకరరాశి యందు ప్రవేశిస్తాడు గనుక మకర సంక్రాంతి యని పిలుస్తారు.**

ఈ పండుగ హేమంత ఋతువునందు రావడంతో చలి మిక్కుటముగా ఉంటుంది. పగటికాలం తక్కువగా ఉండి రాత్రికాలం అధికంగా ఉంటుంది. సంక్రాంతి పర్వం నాటికి తెలుగునాట గ్రామీణ ప్రాంతాలు సరికొత్త శోభతో కళకళ లాడుతూ ఉంటాయి. మిగతా పండుగల కన్నా భిన్నముగా సంక్రాంతి పండుగను మూడురోజుల పర్వంగా ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు.

సంక్రాంతి అనగా చేరుట అని అర్థము. సూర్యుడు ఒక రాశి నుండి మరొక రాశి లోనికి ప్రవేశించడమును సంక్రమణము అని అంటారు. సూర్యుడు మకర రాశి లోనికి ప్రవేశించడమును మకర సంక్రమణము అని అంటారు. సూర్యుడు మకరరాశి యందు ప్రవేశించగానే ఉత్తరాయణము ఆరంభమవుతుంది. ఉత్తర అను పదమునకు మోక్షము అని అర్థము కూడా ఉన్నది. ఉత్తరాయణమందు దివంగతులయినవారు ఉత్తమ గతులు పొందుతారని భగవద్గీత పేర్కొనుచున్నది. భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలము వరకు అంపశయ్య మీద ఉండి ఆ తరువాత తనువు చాలించాడు. ఉత్తరాయణములోనే వివాహాలు, ఉపనయనాలు మున్నగు శుభకార్యములు జరుగుతాయి.

మకరసంక్రమణము నాటికి పంటలు పండి ఇళ్ళకు వస్తాయి. ధాన్యసమృద్ధితో పాటు తన్మూలంగా ధన సమృద్ధితో వ్యవసాయదారుల గృహాలు సందడిగా ఉంటాయి. సంక్రాంతి పర్వము నాడు క్రొత్త అల్లుళ్ళను ఇంటికి ఆహ్వానిస్తారు. అల్లుళ్ళు, కూతుళ్ళు, ఆడపడుచులు, బంధుమిత్రులు మున్నగువారితో రైతుల గృహాలు ఆనందముతో మునిగి తేలుతుంటాయి. కొత్త అల్లుళ్ళ మరదళ్ళ సరసాలతో, కమ్మనైన పిండివంటల ఘుమ ఘుమలతో, కోడి పందాలతో పండుగ మూడు రోజులూ మూడు క్షణాల్లా గడిచిపోతాయి.

ధనుర్మాసము ప్రారంభమైన వెంటనే పండుగ రోజు వరకు నెలరోజులు ఆడపిల్లలు చక్కగా అలంకరించుకుని తెలుగుదనం ఉట్టిపడేలా పరికిణీ, ఓణీలు వేసుకుని గొబ్బెమ్మలు పెడతారు.

పండుగ సందర్భముగా గృహాలకు రంగులు వేయిస్తారు. గడపలకు పసుపు రాసి, కుంకుమ తిలకం తీర్చి దిద్దుతారు. గుమ్మాలకు, ద్వారబంధాలకు బంతిపూలు, మామిడాకులతో తోరణాలు కడతారు. సూర్యోదయమునకు ముందే మేల్కొని పేడనీళ్ళు కళ్ళాపి చల్లుతారు. పెద్ద పెద్ద ముగ్గులు పెడతారు. ముగ్గుల మీద గోమయంతో చేసిన గొబ్బెమ్మలను పెడతారు. వాటిని పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. గొబ్బిళ్ళ చుట్టూ తిరుగుతూ పాటలు పాడతారు. గొబ్బిళ్ళు లక్ష్మీదేవికి ప్రీతికరము. ముగ్గులను ఉదయం వేళల్లో వీధినుండి ఇంటివైపుకు, సాయం వేళల్లో ఇంటినుండి వీధివైపుకు వేయవలెనని పెద్దలు చెబుతుంటారు.

వ్యవసాయదారులకు అత్యంత మోదాన్ని కలిగించే సంక్రాంతి పండుగను మూడు రోజుల పాటు జరుపుకుంటారు. మొదటి రోజును భోగియని, రెండవరోజును సంక్రాంతి యని, మూడువరోజు కనుమయని పిలుస్తారు. కొన్ని ప్రాంతములలో నాలుగవ రోజును ముక్కనుమ అను పేరుతో జరుపుకొనే ఆచారమున్నది.

## భోగి పండుగ

సంక్రాంతి పండుగకు ముందు రోజును భోగి యని పిలుస్తారు. భోగిని గురించి రక రకాలైన కథలు వ్యాప్తిలో ఉన్నాయి. వామనుడిచే త్రొక్కబడి పాతాళ రాజ్యాధిపతి అయిన బలిచక్రవర్తి ఏడాదికొకసారి భూలోకమునకు వస్తాడని, ఆ రోజున బలిచక్రవర్తిని స్వాగతిస్తూ, భోగిమంటలు వేసి పండుగ జరుపుకోవడం వలన దీనికి భోగి యని పేరు వచ్చిందని పెద్దలు చెబుతున్నారు. భోగినాడు వేకువ జాముననే ప్రజలు మేల్కొంటారు. నెల రోజుల నుండి సేకరించిన కలప మున్నగు వాటిని, ఇంటిలోపల ఉన్న పనికిరాని, నిరుపయోగంగా ఉన్న సామగ్రిని, గోమయంతో చేసిన పిడకలను ఒక కుప్పగా పోసి, దానికి నిప్పు పెడతారు. నిప్పు అంటుకొని మంటగా మారిపోతుంది. ఆ మంటలను భోగి మంటలు అని పిలుస్తారు. భోగి మంటల చుట్టూ పాటలు పాడుకుంటూ తిరుగుతారు. ఈ మంటల వలన మిడతలు మున్నగు క్రిమి కీటకాదులు నశించిపోతాయి. గోమయంలోని ఓషధీయుక్తమైన పదార్థము తోడవడం వలన చాలా ప్రయోజనం కలుగుతుంది. భోగిమంటల వలన పీడ వదిలిపోయిందని ఆనందిస్తారు. తదనంతరం అభ్యంగన, మంగళస్నానములు పూర్తి గావించుకుంటారు. ఆ రోజు ఇంద్రుడిని, విష్ణువును పూజిస్తారు. పొంగలిని నైవేద్యంగా పెడతారు. మధ్యాహ్న సమయంలో బంధు మిత్రులతో, పరివారముతో కలిసి విందు భోజనాలు చేస్తారు. సాయంకాలము అయిదు సంవత్సరముల లోపు బాల బాలికలకు



భోగిపళ్ళు పోస్తారు. ఈ పిల్లలకు బాలారిష్టాల బెడద ఉంటుంది. అయిదు సంవత్సరాలు దాటిన తర్వాత ఈ బెడద ఉండదు. ఆ రోజున పిల్లలకు క్రొత్త బట్టలు వేసి కుర్చీలో కూర్చోబెట్టి, రేగిపళ్ళు, బంతిపూలు, చిల్లర డబ్బులు, చెరుకు ముక్కలు, అక్షతలు మున్నగువాటిని కలిపి పిల్లల తలమీద నుంచి దిగువార పోస్తారు. ముత్తయిదువలకు తాంబూలాలిచ్చి సత్కరిస్తారు. బాహ్యము గమనము శుద్ధులమై క్రమముగా చిత్తశుద్ధికి, తద్వారా భగవదనుగ్రహమునకు పాత్రులము కాగలము. ఈ భోగిపండుగ నాటితో ధనుర్మాస దీక్ష పూర్తి అవుతుంది. తిరుప్పావై రచన పూర్తయిన ముప్పయవ నాడు శ్రీరంగనాథుడు గోదాదేవికి కలలో కన్పించి ఆమెను తప్పక వివాహం చేసుకుంటానని పలుకుతాడు. శ్రీరంగనాథుని ఆదేశానుసారం గోదాదేవి శ్రీరంగం వెళ్ళి స్వామివారిని వివాహమాడుతుంది. వివాహతంతు పూర్తి కాగానే స్వామివారిలో ఐక్యం పొందుతుంది. మహిమోపేతమైన ఇంతటి విషయం నడిచిన పుణ్యదినం భోగి. గోదాదేవికి అంతటి భోగభాగ్యం కూర్చిన ఆనాడు, అప్పటి నుండి జన సామాన్యానికి కూడా సమస్త భోగాలు ఇచ్చేరోజు భోగిపండుగ అయింది.

## సంక్రాంతి

భోగి మరుసటి దినమును సంక్రాంతి అని అంటారు. సంక్రాంతి రోజున చేయు స్నానమునకు అధిక ప్రాముఖ్యత ఇవ్వబడింది. సంక్రాంతి పండుగ రోజున స్నానము చేయని వాళ్ళు సప్తజన్మల వరకు రోగగ్రస్తులవుతారని, నిర్ధనులు అవుతారని శాస్త్రమునందు చెప్పబడింది.

**శ్లో ॥ "రవి సంక్రమణే ప్రాప్తే నస్నాయా ద్యస్తు మానవః**
**సప్తజన్మ సురోగిస్యా న్నిర్ధన శ్చైవ జాయతే"**

మకరరాశికి అధిపతి శని. వాత ప్రధాన గ్రహము శని యని జ్యోతిశ్శాస్త్ర వచనము. కనుక శరీరమునకు నువ్వులపిండిని నలుగు పెట్టుకుని స్నానమాచరించాలి. స్నానానంతరం 'ఓం ఘృణి సూర్యాయ నమః' అని సూర్యభగవానునకు అర్ఘ్యము సమర్పించాలి. నువ్వులతో హోమం చేయాలి. పితరులకు తర్పణాలు విడవాలి. తిలయుక్త భోజనము చేయాలి. ఆ రోజంతా తిలయుక్త జలమును త్రాగాలి. సూర్యోపనిషత్తు నందు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఏకరూపమే సూర్యుడు అని వర్ణింపబడినది. కావున సంక్రాంతి రోజున సూర్యభగవానుని పూజించాలి. పొంగలి గిన్నెకు మామిడాకుల తోరణమును కట్టి పీటపైన ఉంచి దీపాలు వెలిగించాలి. వివిధ భక్ష్యములను సూర్యభగవానునికి నైవేద్యం పెట్టాలి. నువ్వుల హోమము చేయడం వలన సుఖశాంతులు ప్రాప్తిస్తాయి. తిలయుక్త భోజనము, జలమును సేవించడం వలన జీర్ణశక్తి వర్ధిల్లుతుంది.

సంక్రాంతి రోజున దానములు చేయాలి. దాని వలన అంతులేని పుణ్యసంపద ప్రాప్తిస్తుంది. వస్త్రములు, దుప్పట్లు, బెల్లం, పాయసం, కాంస్యపాత్ర, విసనకర్ర,. ధాన్యము, పండ్లు మున్నగువాటిని దానం చేయాలి. స్త్రీలు పసుపు, కుంకుమ, సుగంధద్రవ్యాలు, పువ్వులు దానం చేస్తే మాంగల్యాభివృద్ధి జరుగుతుందని శాస్త్ర వచనము. సంక్రాంతి సమయంలో ఎటువంటి కర్మలను ఆచరిస్తారో, ఎటువంటి దానములు చేస్తారో అటువంటి ద్రవ్యములను, కర్మలను సూర్యభగవానుడి అనుగ్రహము చేత ప్రతి జన్మము నందు పొందగలుగుతారని ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.

**శ్లో ॥ "సంక్రాంతే యానిదత్తా నిహస్య కవ్యాని దాతృభిః**
**తాని నిత్యం దదాత్యర్కః పునర్జన్మ నిజన్మని"**



సంక్రాంతి నాడు మకరజ్యోతి సందర్శనార్థం అయ్యప్పస్వామి భక్తులు శబరిమలకు వెళతారు. మకరజ్యోతిని దర్శించుకొని పునీతులవుతారు. సంక్రాంతి నాడు పెద్దలు పిన్నలు ఆనందోత్సాహాలతో గాలి పటములను ఎగురవేస్తారు. సాయంకాల సమయంలో చక్కని అందమైన బొమ్మలతో బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తారు.

## కనుమ


తమ సేద్యానికి బాసటగా నిల్చిన పశువులను గౌరవించుటకు ఏర్పాటు చేసిన దినము కనుమ. ఆ రోజు ఉదయముననే లేచి పశువులను శుభ్రముగా కడుగుతారు. కొమ్ములకు, ముఖానికి పసుపు రాస్తారు. కుంకుమతో తిలకం పెడతారు. మెడలో పూలదండలు వేస్తారు. చిరుగంటలు, పూసలు కడతారు. పశువుల కాళ్ళను పూలదండలతో అలంకరిస్తారు. క్రొత్త బియ్యం వండి పొంగలిని చేస్తారు. పొంగలిని పశువులకు నైవేద్యం పెడతారు. తరువాత దానిని పొలాల్లో జల్లుతారు. దీనిని పొలి జల్లుట అని అంటారు. ఆ రోజున గారెలు వండుతారు. పశు పక్ష్యాదులు తిరిగే ప్రదేశాలలో వాటిని ఉంచుతారు.

## ముక్కనుమ

కనుమ మరుసటి రోజును ముక్కనుమ అంటారు. ఆ రోజున సావిత్రి, గౌరీదేవిని పూజిస్తారు. సంక్రాంతి పండుగ రోజులు చాలా ఆనందంగా ఉంటాయి. కోడికూతతో పాటు మేల్కొని హరిదాసులు స్నానాదికములు పూర్తి గావించుకుంటారు. నుదుట తిరుమణి, తిరుచూర్ణమును తీర్చిదిద్దుకుంటారు. తంబుర, చిడతలు పట్టుకుని అక్షయపాత్ర శిరముపై పెట్టుకుని హరినామ సంకీర్తనలు గావిస్తూ, వీధి వీధి తిరుగుతారు. గంగిరెద్దులను తీసుకొచ్చి వాకిట ముందు నిల్పి డోలు సన్నాయి వాయిస్తారు. ఆ తరుణములో గంగిరెద్దును చిత్ర విచిత్ర గతులతో ఆడించి, దండాలు పెట్టించి, గృహస్థులను ఆనందపరిచి వారినుంచి కానుకలు అందుకుంటారు.

తెలుగువారి పెద్ద పండుగ అయిన సంక్రాంతి శోభను తిలకించడానికి, ఆనందించడానికి పల్లెలకు పోవల్సిందే. ఎందుకంటే పల్లీయుల పండుగ సంక్రాంతి పండుగ. సంక్రాంతి పురుషుడికి స్వాగతం పలుకుతూ బంధాలను అనుబంధాలను బలపరిచే విశిష్టమైన సంక్రాంతిని జరుపుకుందాం. ఆనందంగా జీవిద్దాం.

**"బలహీనమైన గడ్డితిన్న**
**గోవు – బలాన్నిచ్చే**
**పాలనిస్తుంది గోవు**





34వ భాగము


# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**


శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**– గోవింద దాసు**

**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**

దిశా నిర్దేశం : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారీగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగా చేయుటకు వీలుగా స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 34 వ భాగపు లీలల ప్రచురణ. (డిసెంబర్ 2020 నుండి ఫిబ్రవరి 2021 వరకు).

నా జీవితంలో జనవరి 2021 నుండి సాధన దశ నడిచింది. స్వామివారి సంకల్పాన్ని ఎలాగైనా సాధించాలని దృఢ నిర్ణయానికి వచ్చాను. కాని యోగ్యతకు అవసరమైన వికారాలను తొలగించుకొనుటలో అసమర్థుడనని, రక్షించమని శరణు వేడాను. దయామయుడైన స్వామివారు నాలోని వికారాలను ఒక్కొక్కటి తొలగించుటకు తగిన శిక్షణ ఇవ్వసాగారు. నేను కూడా స్వామి చెప్పినట్లు నడుచుకుంటూ సాధన చేయసాగాను. వాటిని చూద్దాం!

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నవంబర్ 2020 చివర నాలోని దాస్య భావమును జాగృతం చేశాడు. నాలో తగిన పరివర్తన కోసం మరియు మొదటి సంకల్పంలో ఓడిపోయానని నన్ను నేను తెలుసుకొనుటకు వీలుగా స్వామివారు ప్రసాదించిన మొత్తం అనుభూతులను మొదటి నుండి వెంటనే చదవమన్నారు. కాని నేను రెండు రోజులు అశ్రద్ధ చేయటం వలన నన్ను తీవ్ర స్థాయిలో కోపగించారు. గత 20 సంవత్సరాల నుండి స్వామివారు ఎప్పుడూ ఈ విధంగా కోపగించలేదు. అరికాళ్ళ నుండి వణికిపోయాను. చివరికి నా అనుభూతులను తేది 05-12-2020 నుండి రోజుకు ఐదారు గంటల చొప్పున చదువుట ప్రారంభించాను. నిజానికి నేను నా పుస్తకములలో స్వామివారు ప్రసాదించిన అనుభూతులను మాత్రమే వ్రాశాను, కాని ఆనాటి నా పరిస్థితులను, ఏ సందర్భములో ఎందుకు ఈ అనుభూతిని ప్రసాదించారనే విషయమును వ్రాయలేదు. కాబట్టి అప్పటి నా పరిస్థితులను జ్ఞప్తికి తెచ్చుకుంటూ, ఆయా సందర్భములలో స్వామివారు ప్రసాదించిన లీలలను ఆస్వాదిస్తూ, మొత్తం అనుభూతులను చదివేసరికి నాకు డెబ్బై (70) రోజులు పట్టింది. తేది 05-12-2020 నాడు చదువుట ప్రారంభించి తేది 12-02-2021 నాటికి పూర్తి చేశాను.

ఈ చదివే క్రమములో తేది 16-12-2020 నాడు నేను నా సంకల్పములో ఓడిపోయానని గుర్తించి దుఃఖించసాగాను. నాకోసం స్వామివారు పడ్డ కష్టమును చూచి చలించిపోయాను. నేను ఓడిపోయాననే బాధ కంటే ఎక్కువ, నేను ఒక అయోగ్యుడైన సేవకుడిగా భావించి కుమిలిపోయాను. శ్రీవేంకటేశ్వరుని కీర్తికి కళంకం తెచ్చేవాడిగా నన్ను నేను భావించుకుంటూ దుఃఖించసాగాను. జీవితంపై విరక్తి కలిగింది. అపరాధ భావముతో తల దించుకున్నాను. నిజానికి నేను స్వామివారి లీలల యందు అపనమ్మకముతో లేదా లౌకిక విషయాల పట్ల ఆకర్షణతో స్వామి చెప్పినట్లు వినలేదు. ఫలితంగా ఓడిపోయానని గ్రహించాను.

**విశ్లేషణ**

2002 సంవత్సరంలో సంకల్ప సమయాన శ్రీవేంకటేశ్వరుడు మా ఇంటికి వస్తాడన్న విషయము ఉత్త మాట కాదని, స్వామివారు మా ఇంటికి రావడం కోసమే నాకు సంకల్పమిచ్చి శిక్షణ ఇచ్చారని మొదటిసారి తెలుసుకున్నాను. కాని అసమర్థుడనైన నేను దీనిని గ్రహించక తప్పు చేశానని దుఃఖించాను. నా సేవలో తృప్తి చెందితే స్వామివారు మా ఇంటికి వస్తారన్న విషయం నాకు, స్వామివారికి తప్ప ఇంతవరకు ఇతరులకు తెలియదు. కాని ఈ విషయాన్ని జనవరి 2021 లో నా భార్యకు మొదటిసారి చెప్పాను. ఈ విషయం విని ఆమె ఆశ్చర్యానికి గురైంది. నిజానికి నేను కూడా స్వామివారి సేవ చేశానే తప్ప స్వామి చెప్పినట్లు 'నా' అన్నది వదులుకొనుటలో మరియు 'యోగ్యత'ను సాధించుటలో దృష్టి పెట్టలేదు. స్వామివారి మాటలను అవహేళన చేశాను. ఒక అధమస్థాయి వ్యక్తినైన నన్ను, తన పనిముట్టు లాగా ఎన్నుకొని ఏ విధంగా శిక్షణ ఇచ్చారు, ఎంతగా అనుగ్రహించారు, రాజ మహారాజులకు లభించని అనుగ్రహాలను ప్రసాదించి ఎంతగా గౌరవించారు? దీనికి ప్రతిగా నేను ఎలా స్వామి నమ్మకాన్ని వమ్ము చేశాను, ఆయనకు అపకీర్తి తెచ్చిపెట్టానని కుమిలిపోయాను. ఒకసారి ఈ క్రింది విధంగా నా పూర్తి జీవితాన్ని పునః పరిశీలించుకున్నాను, మరియు స్వామి లీలలోని ఆంతర్యమును పరిశీలించసాగాను. స్వామివారి శిక్షణ అత్యంత కఠినముగా, ఏ విషయముపై మమకారమును త్యజించమంటారో ఆ విషయంపై మరింత ఆకర్షణను పెంచే విధంగా ఉంటుంది.

1. నా చిన్నతనములో మా కుటుంబం చక్కగా ఉన్నప్పటికీ నేను పెరిగే క్రమములో ఆర్థికంగా అత్యంత దీనస్థితికి దిగజారింది. నేను మొదటి శ్రేణి విద్యార్థిని అయినప్పటికీ ఇంటర్ తరువాత రెండు సంవత్సరాలు ఇంజనీరింగులో సీటు రాలేదు. ఈ రెండు సంవత్సరాలు ఊరిలో వ్యవసాయం చేస్తూ చదువుకున్నాను. ఈ క్రమములో మా ఆర్థిక పరిస్థితి చూచి చలించిపోయాను. భవిష్యత్తులో ఇంజనీరింగ్ చదివినప్పటికీ వ్యాపారము చేసి మా కుటుంబాన్ని ఆర్థికంగా పైకి తీసుకురావాలనే బీజం అప్పుడే పడ్డది. ఆ తరువాత ఇంజనీరింగ్ చదివినప్పటికీ ఉద్యోగము చేయక వ్యాపారము చేస్తూ జీవించాను. ఆర్థికంగా అత్యంత దిగువ స్థాయినుండి వచ్చాను కాబట్టి వ్యాపారము చేసి డబ్బు సంపాదించాలనే కోరిక బలంగా ఉండేది. అందుకే 2002 సంవత్సరంలో సేవలను ప్రసాదించినప్పుడు వ్యాపారము చేయవద్దు అని స్వామివారు చెప్పినప్పటికీ, నాలోని డబ్బు కాంక్షతో వినలేదు. తరువాత నా వ్యాపారాన్ని అడుగడుగున అడ్డగిస్తూ ఎన్నోసార్లు సరైన దారిలో పెట్టుటకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ధన వ్యామోహములో స్వామి మాటపై దృష్టి పెట్టలేదు. ఫలితంగా ఓడిపోయాను.

2. నేను ఎన్నో భూ సమస్యలను ఎదుర్కొన్నాను. ప్రతి సమస్యలో స్వామివారు నాకు సహాయము చేయలేదని నిందించానే తప్ప, ఆ సమస్య నాలో 'నా' అన్నది నశింపచేసుకొనుటకు, స్థిత ప్రజ్ఞత సాధించుటకు ఉద్దేశించిందని భావించక తప్పు చేశాను. సామ దాన భేద దండోపాయాలను ఉపయోగించి మార్చుటకు ప్రయత్నించినప్పటికీ గ్రహించలేదు.

3. తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నన్ను తన సేవకుడుగా స్వీకరించి సైనికుడిగా శిక్షణ నిచ్చాడు. "వన్ మ్యాన్ ఆర్మీ" లాగా తయారు చేసి లక్ష్యాన్ని ఛేదించమన్నాడు. యుద్ధంలో కాలం గడిచినకొద్దీ క్రొత్త క్రొత్త టెక్నాలజీలతో ప్రతి నాలుగైదు సంవత్సరాలకు ఒక నూతన ఆయుధం పుట్టుకొస్తుంది. అప్పుడు ప్రతి నూతన ఆయుధానికి తగిన శిక్షణను సైనికునికి ఇచ్చినట్లు, నాకు కూడా 2000 సంవత్సరము నుండి నేటి వరకు ఆరు సేవలను ప్రసాదించారు. ప్రతి సేవ ఏ విధంగా సమర్థవంతంగా నిర్వహించాలో శిక్షణను ఇచ్చారు. వీటితో పాటుగా (ఏడవ సేవగా) యోగ్యతను సాధించి, తిరుమల శ్రీవేంకటేశ్వరుని పొందే స్థితిని సాధించి హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయమన్నారు. కాని నేను ఆ స్థితిని పొందుటలో విఫలుణ్ణైనాను.

4. స్వామివారి ప్రతి లీల ఆనంద దాయకమైనా లేక దుఃఖకరమైనా వారి గురించి తపనే లక్ష్యంగా సాగింది. ప్రతి రోజు, ప్రతి క్షణం ఆయన్ను స్మరించుటే లక్ష్యంగా లీలలు సాగాయి. వ్యాపారము చేస్తే మనస్సు అన్య విషయాలపైకి వెళ్ళుట వలన స్వామి స్మరణకు ఆటంకం కలుగుతుందనే కారణముచే వ్యాపారము వద్దన్నారని మొదటిసారి గ్రహించాను. లోకములోని మనుష్యుల ధర్మము వేరు, నా ధర్మము వేరని భావించాను. సాధనకు అనువైన వాతావరణంలో చక్కని ఇల్లును, దానికి దగ్గరలోనే ఆఫీసును ప్రసాదించినప్పటికీ, నేను వాటిని సరిగా ఉపయోగించుకోలేదని బాధపడ్డాను. నేను కేవలం స్వామి చెప్పినట్లు మాత్రమే నడుచుకోవాలి కాని అలా చేయలేదని బాధపడ్డాను.

5. ఈ అనుభూతులు చదివే క్రమములో నేను ఒక విషయ మును అర్థం చేసుకున్నాను. స్వామివారు ప్రసాదించిన ప్రతి అనుగ్రహమును నేను అనుభవించి తిరిగి దానిని వారి భక్తులు అనుభవించేటట్లు చేయుట నా కర్తవ్యంగా దిశా నిర్దేశం చేశారు. ప్రతి సేవ అదే క్రమములో జరిగింది. ఇప్పుడు ఈ హరినామ క్షేత్రము కూడా ఇదే క్రమములో జరుగునని భావించాను. ఎంతవరకైతే నేను శ్రీవేంకటేశ్వరుని పొందగలిగే యోగ్యతను సాధించలేనో... అంతవరకు హరినామ క్షేత్రమును సాధించలేనని భావించాను. యోగ్యతను సాధించుటకే ఇంతటి కఠిన శిక్షణ ఇస్తున్నారని భావించాను. అప్పుడే నేను పరీక్షలో పాస్ కాగలనని కూడా భావించాను. ఇక ఈ కలియుగములో నాలాంటి ఒక సాధారణ మానవుడు శ్రీవేంకటేశ్వరుణ్ణి పొందగలడా...? అనే ప్రశ్నకు నాదొకటే జవాబు. ఈ సంకల్పము నాదైతే సాధ్యం కాదు. కాని ఈ సంకల్పము స్వామివారిదే అయినప్పుడు సంశయించవలసిన అవసరము ఎంతమాత్రం లేదని భావించాను. ఈ కలియుగములో హాథీరాంజీ బావాజీ, తరిగొండ వెంగమాంబలు స్వామివారిని పొందినట్లు ఆనవాళ్ళు ఉన్నవి. ఇంకా ఎంతోమంది భక్తులు పొందారు కాని స్వామి కృప ఉంటేనే ఆ భక్తుడు బయటి ప్రపంచానికి పరిచయమవుతాడని భావించాను.

6. స్వామివారిని పొందుటకు మరియు హరినామ క్షేత్ర సాధన కొరకే నాకు ఈ జీవితాన్ని ప్రసాదించారని భావించాను. స్వామివారు ప్రసాదించిన సేవలను ఉపయోగించుకొని యోగ్యతను సాధించమన్నారు. యోగ్యతను సాధించుటకే ఇన్ని సేవలను ప్రసాదించారని భావించాను. యోగ్యత అంటే...? ఉదా:– ఒక వ్యక్తి ఐ.ఎ.ఎస్ పట్టా పొందాలంటే డిగ్రీ చదవాలి. ఆ తరువాత ప్రిలిమినరీ, మెయిన్ లలో పాస్ కావలసి ఉంటుంది. ఆ తరువాత అతడు చదివిన డిగ్రీని ఉపయోగించుకొని ఇంటర్వ్యూలో పాస్ కావాలి. చదివిన చదువు కేవలం ప్రిలిమినరీ, మెయిన్ లో పాస్ అగుటకే పనికి వస్తుంది. కాని ఇంటర్వ్యూకి మాత్రం విద్యార్థి ఈ చదువును ఉపయోగించి, లోకజ్ఞానం సాధించి మాత్రమే పాస్ కాగలడు. అలాగే నేను ఈ సేవలను ఉపయోగించుకుని, నాలోని వికారాలను తొలగించుకొని, నన్ను నేను సంస్కరించుకుని యోగ్యతను సాధించి, స్వామివారి కృపను పొంది, వారి అనుగ్రహముతో భగవంతుణ్ణి పొందాలి. ఈ స్థితిని చేరుటే లక్ష్యంగా ఇన్ని రోజుల శిక్షణ జరిగిందని భావించాను. దీనిని సాధించనందుకు బాధపడ్డాను.

7. గతంలో ఎంతోమంది భక్తులకు స్వప్న దర్శనాలు ప్రసాదించి ఆలయాలను నిర్మింపచేశారు. ఇక్కడ కేవలం ఒక భజన మండపమును ఏర్పాటు చేస్తే హరినామ క్షేత్రం ఏర్పడుతుంది. మరి ఎందుకు నాకింత శిక్షణ, ఇన్ని అనుగ్రహాలు, ఇంత దూరపు మార్గము అని ఆలోచించాను. బహుశా తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఈ క్షేత్రాన్ని ఒక దివ్య క్షేత్రం లాగా ఏర్పాటు చేయబోతున్నారని భావించాను. పైగా ఈ క్షేత్రములో స్వామివారు భక్తులను సమ్మోహితులను చేసి తన వద్దకు రప్పించుకుంటానని చెప్పారు. భక్తులు వారి వారి లౌకిక విషయాలను వదిలి స్వామి వద్దనే సాధన చేస్తూ జీవిస్తారని కూడా చెప్పారు. ఒక పర్యాయం ఈ క్షేత్రాన్ని బద్రినాథ్ తో పోల్చారు. ఒకరకంగా ఇది మరో తిరుపతిగా ఉండబోతుందని సూచించారు. ఈ క్షేత్రం రానున్న తరతరాల భక్తులకు స్వామివారి దివ్య అనుగ్రహము సులభంగా లభించే విధంగా ఉంటుందని సూచించారు. ఒకసారి నా కారణంగా స్వామివారు తరతరాలుగా జనాలచే స్మరింపబడుదురని, అలాంటి సేవను ప్రసాదిస్తానని చెప్పారు. కాని దురదృష్టవశాత్తు నేను సాధించలేకపోయాను. స్వామివారి నమ్మకాన్ని వమ్ము చేశానని దుఃఖించసాగాను.

అనుభూతులు చదువుట మొదలుపెట్టిన 11 రోజుల తరువాత నేను సంకల్పములో ఓడిపోయానని గుర్తించి దుఃఖించుట మొదలుపెట్టాను. ఆ తరువాత ఇదే దుఃఖముతో మిగిలిన అనుభూతులను చదువుచున్నప్పుడు స్వామివారు నాకోసం పడ్డ కష్టమును చూచి, నన్ను అనుగ్రహించిన తీరును చూచి ఈ దుఃఖము రోజు రోజుకు తారాస్థాయికి చేరింది. స్వామివారు చెప్పినట్లు వినక తప్పు చేశానని, స్వామి కీర్తికి కళంకము తెచ్చానని నాలో నేను కుమిలిపోయాను. ఈ క్రింద వ్రాసుకున్న ఆనాటి నా భావాలను ఒక ఐదు లైన్లు వ్రాసి దుఃఖంతో వ్రాయలేక మిగిలిన భాగమును రెండవరోజు వ్రాశానంటే నా దుఃఖము ఏ స్థాయిలో ఉందో గుర్తించవచ్చు.

## సంహరించమని లేదా తరణోపాయము సూచించమని ప్రార్థన

**మొదటి రోజు:** ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! మీరు చాలా గొప్పవారు. ఈ సృష్టికి స్థితి లయకర్తలు, మీకు అయోగ్యుడైన భక్తుడు ఉండకూడదు. ఒకవేళ అలాంటివారు ఉంటే మీ కీర్తికి కళంకము, కాబట్టి అలాంటివారు వద్దు, నేను అయోగ్యుణ్ణై సంకల్పమును పూరించలేదు. కావున నన్ను వెంటనే సంహరించమని వేడుకున్నాను. ఏ విధంగానైనా సంహరించమని కోరాను. తన సుదర్శన చక్రంతో సంహరించమని ఈ విధంగా ప్రార్థించాను (దీనిని మొదటి రోజు వ్రాసి దుఃఖముతో ముందుకు వెళ్ళలేక వ్రాయుట మానివేశాను).

**రెండవ రోజు:** హే పరమ పవిత్రమైన శ్రీ సుదర్శన చక్రమా నేను మీ స్వామికి అన్యాయము చేశాను. నేను ఒక అయోగ్యుడైన సేవకుడను. ఇలాంటి అయోగ్యులు మీ స్వామికి ఉంటే... దానిని మీరు ఏ విధంగా సహించగలరు? మీకు మరియు మీ స్వామివారికి

అవమానము కనుక దయ ఉంచి నన్ను తక్షణమే సంహరించమని వేడుకున్నాను. ఇలా ప్రార్థిస్తూ నేను స్వామికి కొంత దూరములో ఎదురుగా కూర్చుని నా రెండు కళ్ళు మూసుకున్నాను. మరియు ఇదే నా చివరి క్షణము అనుకుని ఈ జీవితపు ఆఖరి మాటలుగా శ్రీవేంకటేశ్వరుణ్ణి మనసారా స్మరించుకుంటూ దాదాపు ఐదారు నిమిషాలు ఉన్నాను. కాని ఎలాంటి ఘటన చోటు చేసుకోలేదు, ఎలాంటి అనుభూతి కలగలేదు. ఇలా ఓపిక ఉన్నంతసేపు మళ్ళీ మళ్ళీ ప్రయత్నించి విరమించుకున్నాను. నన్ను సంహరించమని లేదా తరణోపాయము చూపమని స్వామివారిని మరీ మరీ వేడుకున్నాను. ఈ రకంగా ప్రార్థించే సమయాన నా రెండు కళ్ళనుండి నీరు ధారగా కారింది. తప్పు చేసిన వాడిని కాబట్టి నా స్వామిని తల ఎత్తి చూడలేకపోయాను. అపరాధభావము ఒళ్ళంతా నిండింది. ప్రతి క్షణము కృంగిపోయాను. నేను స్వామివారికి దాసుడను, ఇష్టుడను, ప్రియమైనవాడిననే భావము తొలగిపోయింది. నేను స్వామి కీర్తికి అవమానము తెచ్చేవాణ్ణి అని తలుచుకుంటూ బాధపడసాగాను. (దీనిని తేది 18-12-2020న ఐదు లైన్లు వ్రాసి తిరిగి 19-12-2020న పూరించాను).

పై విధంగా ప్రార్థిస్తూ తేది 21-12-2020 వరకు చూచాను, కాని ఎలాంటి శిక్ష విధించలేదు. నేను మాత్రము ప్రతిరోజు ఈ అయోగ్యుడైన సేవకుణ్ణి శిక్షించండి లేదా తరణోపాయము సూచించమని ప్రార్థించసాగాను.

ఒక ప్రక్క నా పరిస్థితి ఈ విధంగా ఉంటే... మరోప్రక్క గతంలో నేను అనుభూతులు చదువుటలో రెండు రోజులు ఆలస్యమైనందుకు స్వామివారు కోపగించుకొనుట వలన చాలా భయపడిపోయాను. ఆ భయము నుండి ఇంకా తేరుకోలేదు. స్వామివారికి నాపై కోపమున్నదని, నా నుండి దూరమైపోతారని భయపడ్డాను. ఈ కోపము తగ్గవలెనని మరియు నాకు తరణోపాయము సూచించమని ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు చేయ ప్రారంభించాను. నాకు దగ్గరలో ఉన్న నాచారం, హెచ్.ఎం.టి నగర్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదకొండు రోజులు ప్రతిరోజూ ప్రదక్షిణలు చేస్తూ వేడుకున్నాను. ప్రతిరోజూ, ప్రతి క్షణం స్వామివారిని దీనాతి దీనంగా అపరాధ భావముతో వేడుకున్నాను. చివరికి స్వామివారు నా తపనను చూచి కరుణించి ఈ క్రింది లీలను చూపారు.

## తిరుమల లడ్డూలను బహుమతిగా పొందుట

**తేది 22-12-2020 కల:** నేను, మా తల్లితండ్రులు, సురేఖ లేక మా చెల్లెలు లలితతో కలిసి ఊరిలోని మా పాత ఇంటిలో నివసిస్తున్నామన్న ఊహ. ఇది దాదాపు నేను పదవతరగతి లేదా ఇంటర్మీడియెట్ చదివే సమయం లాగా అనిపించింది. మేము




తిరుపతి లడ్డూలను బహుమతిగా పొందుట

ఎక్కడికో వెళ్ళి స్వామివారి కళ్యాణము లాంటి ఫంక్షన్ జరిపి తిరిగి ఇంటికి వచ్చాము. ఆ ఫంక్షన్ లో ఎంతోమంది మాకు ఎన్నో బహుమానాలను ఇచ్చారు. ఆ బహుమానాలన్నింటిని ఎన్నో బ్యాగుల్లో నింపుకుని ఇంటికి తెచ్చాము. ఇప్పుడు ఆ బ్యాగులన్నింటినీ, హాలులో కుమ్మరించి అందులోని వస్తువులను చూడాలనుకున్నాము. చాలా బ్యాగులను ఒక దగ్గర కుమ్మరించి అందులో ఏమున్నదో, వారు ఏమి ఇచ్చారో చూస్తున్నాము. వారిచ్చిన అన్ని బహుమతులు ప్లాస్టిక్ కవర్లలో చుట్టబడి ఉన్నాయి. నేను ఆ కవర్ ను పూర్తిగా విప్పకనే, బ్యాగ్ నుండి బయటకు తీసిన ఆ కవర్లను పైనుండి ఒత్తి చూశాను. ప్రతి కవర్ లో తిరుపతి లడ్డూ ఒక్కొక్కటి ఉన్నట్లు గమనించాను. లడ్డూలు ఉన్నాయని మా తల్లితండ్రులతో చెప్పాను. ఇలా మా కుటుంబానికి చాలామంది తిరుపతి లడ్డూలను బహుమతిగా ఇచ్చారు. వాటిని మేము మా ఇంటికి తెచ్చుకున్నాము. కల చెదిరింది.

కాని ఆ రోజు ఈ కల సరైన అర్థమును గ్రహించలేదు. కేవలం మాకు శుభం జరుగుతుందని మాత్రమే గ్రహించాను. మరియు అపరాధ భావముతో స్వామివారిని రకరకాలుగా సేవిస్తూ, ఆయనను తృప్తి పరచుటకు విశ్వప్రయత్నం చేయుట కొనసాగుతున్నది.

## శ్రీమహాలక్ష్మి మాత అనుగ్రహము

2020 సంవత్సరంలో టిటిడి వారు మొదటిసారి వైకుంఠ ఏకాదశికి 10 రోజుల వైకుంఠద్వారా దర్శనాన్ని భక్తులకు కల్పించారు. అందుకని నేను, నా భార్య తేది 28-12-2020 నుండి 30-12-2020 వరకు మూడు రోజులు తిరుపతిలో

ఉండి, స్వామివారిని దర్శించుకున్నాము. మరియు మేము చేసిన అపరా ధమును క్షమించమని, తరణోపాయం సూచించమని ప్రతిరోజూ గుడిచుట్టూ ప్రదక్షిణలను, సాష్టాంగ దండ ప్రణామాలను చేస్తూ రక్షించమని వేడుకున్నాను.

ప్రతిరోజు ప్రతి క్షణము అపరాధ భావముతో క్రుంగిపోవుచున్నాను. స్వామివారి ఫోటోను చూడగానే అప్రయత్నంగా సిగ్గుతో తల దించుకుంటున్నాను. నా ముఖాన్ని స్వామివారికి చూపలేకపోయాను. రక్షించమని నాకు తెలిసిన రకరకాల సాధనాల ద్వారా అర్చిస్తున్నాను. ఇలా నా బాధను చూసిన శ్రీమహాలక్ష్మి మాత కరుణించింది. నా పైన ఆమె ప్రేమను చూపించింది. కాని దీనిని కూడా ఆ రోజు అర్థం చేసుకోలేదు. ఆ లీల ఈవిధంగా ఉంది.

**తేది 06-01-2021 కల :** ఈ కలలో నేను మా గ్రామము చిన్నగుండవెల్లిలో ఉన్నాను. మా పాలివాండ్లు చిన్నమ్మ వరుస అయ్యే ఎంకమ్మతో మాట్లాడాను. బ్రతికి ఉన్న ఆమె ఒకే ఒక్క కూతురు గురించి, ఆమెకు ఎంతమంది పిల్లలని అడిగాను. మరియు మొదటి కూతురు చనిపోయినదని బాధపడ్డాను. తరువాత మా పాలివాండ్లు, పెద్దమ్మ వరుసైన మరొకామె అక్కడికి వచ్చి మాతో మాట్లాడింది. మొత్తం మీద నన్ను కొడుకుగా ఆదరించిన, తల్లుల వరసయ్యే వ్యక్తులతో మాట్లాడాను. ఇంతే కల.

ఆ సమయమున దీనర్థమును గ్రహించలేదు. కాని దీని నిజమైన అర్థం బహుశా శ్రీమహాలక్ష్మీ మాత నేను పడుచున్న వ్యధను తీర్చుటకు ఊరడించిందని భావించాను. స్వామివారిని క్షమించమని వేడుకుంటూ ప్రతిరోజూ బాధ పడుచున్నాను. స్వామివారు కరుణించలేదు కాబట్టి రెండవ పర్యాయంగా ప్రతిరోజూ 11 ప్రదక్షిణలు చొప్పున 11 రోజులు చేయ తేది 17-01-2021 నాడు ప్రారంభించాను. ఇది తేది 27-01-2021 వరకు కొనసాగుతుంది. స్వామివారికి రెండు ప్రధాన కోరికలు విన్నవించాను. 1. స్వామివారికి నాపై కోపము ఉండకూడదు, నా నుండి దూరము కాకూడదు. 2. స్వామివారి కళ్యాణముల ఏర్పాట్లు తొందరగా పూర్తై త్వరగా కార్యక్రమములు మొదలు కావలెను. వీటిని తీర్చమని ప్రత్యేక పూజలు చేయ ప్రారంభించాను. ఎలాగైనా స్వామివారిని తృప్తి పరచాలని దృఢ నిర్ణయముతో ఉన్నాను. చివరికి తేది 24-01-2021 రోజున స్వామివారు కోరినట్లు నా ఎం.టెక్ పరీక్షలో ఉత్తీర్ణుడనై హరినామ క్షేత్రమును ఎలాగైనా సాధించాలనే దృఢ నిర్ణయానికి వచ్చాను. మరియు మీరు నన్ను కేవలం ఎం.టెక్ మాత్రమే చదవమన్నారు, నేను పిహెచ్.డి చేయుటకు సిద్ధం ప్రభూ అంటూ తెలియచేశాను. దీనితో పాటు మరో ప్రమాణము చేశాను. ''ఇప్పటినుండి నా జీవితములో ఎదురగు ప్రతి సమస్యను హరినామ క్షేత్ర సాధన దృష్టికోణంతో అన్వయించుకుని ఆ విధంగా నడుచుకుంటా''నని చెప్పాను. మరియు నేను శరణాగతుణ్ణని, రక్షించమని వేడుకున్నాను. యోగ్యత ప్రసాదించే బాధ్యత స్వామివారిపై పెట్టి సాధన చేయదలచాను. వెంటనే స్వామివారు మెచ్చుకున్నట్లు హృదయాంతర భావం కలిగింది.

ఇప్పటినుండి స్వామివారు హరినామక్షేత్ర సాధనకు నాలో అడ్డంకిగా ఉన్న రకరకాల వికారాలను ఒక్కొక్కటి త్రుంచి వేయసాగారు. వాటిని చూద్దాం! మొదట సంతానముపై మమకారమును క్రింది విధంగా త్రుంచి వేశారు.

## సంతానముపై మమకారమును హరింపచేయుట

గత 40 రోజుల తపన, పశ్చాత్తాప ఫలితంగా నాలో గణనీయమైన మార్పు జరిగింది. లౌకిక విషయాల పట్ల వ్యామోహము తగ్గడంతో పాటు స్వామివారు చెప్పినట్లు నడుచుకోవాలని, క్షణము వదలక స్వామి చింతన యందే గడపాలనే పట్టుదల కలిగింది. కాని కుటుంబముపై వ్యామోహము తగ్గలేదు. ఇప్పుడు స్వామివారు తన మరో లీల ద్వారా కుటుంబము, పిల్లలపై పూర్తి వ్యామోహాన్ని త్రుంచి వేశారు. ఈ లోకంలో నాకు శ్రీవేంకటేశ్వరుడు తప్ప దిక్కెవ్వరు లేరనే స్థితి కల్పించారు.

హరినామ క్షేత్ర సాధనలో నేను ప్రధాన పాత్ర పోషిస్తున్నప్పటికీ నా తల్లి తండ్రులు, భార్యాపిల్లలు, కుటుంబము వారు, పాలివారు, గ్రామస్థులు, ప్రాంతవాసులు, చివరికి శ్రీవేంకటేశ్వరుని అఖండ భక్తజనము వారి వారి పాత్రలను సమయానుకూలంగా నిర్వర్తించగలరు అనే విషయమును క్రింది కొన్ని లీలల ద్వారా తెలుసుకోవచ్చును.

'నా' అన్నది నశింప చేసుకొమ్మని, శ్రీవేంకటేశ్వరుడు చెప్పినట్లు వినమని, స్వామివారు సంతోషించునట్లు హరినామ క్షేత్రము ఏర్పాటు చేయమని గతంలో స్వర్గస్థులైన మా తండ్రిగారు ఆదేశించారు. ఇప్పుడు భార్యాపిల్లలపైన గాని, ఆస్తి అంతస్తులపై కాని ఎలాంటి వ్యామోహము లేకుండునట్లు నా పెద్ద కొడుకు చి॥ వేదాంత్ ను ఉపయోగించి బ్రహ్మాండమైన లీలను ఈ క్రింది విధంగా ప్రసాదించారు. నేను గత 22 సంవత్సరముల నుండి స్వామివారి లీలలను అనుభవిస్తున్నప్పటికీ ప్రతి లీల క్రొత్తగా అనిపిస్తుంటుంది, మరియు దాని ప్రభావానికి సులభంగా లోనవుతుంటాను. మొదట్లో ఇది స్వామివారి లీల అని ఎంతమాత్రము గ్రహించలేదు.

ఈ లీల తేది 25-01-2021 నాడు జరిగినప్పటికీ దీనికి పునాది మాత్రం మా రెండవ కొడుకు చి॥ అరవింద్ రెడ్డి పెండ్లి ఫిబ్రవరి 2020లో జరిగినప్పుడు ఈ క్రింది విధంగా పడ్డది.

మా ఇద్దరు కొడుకులు కూడా అమెరికాలో ఎం.ఎస్ చదివి

ఉద్యోగాలు చేసుకుంటున్నారు. చిన్నప్పటినుండి వారికి ఎలాంటి ఆర్థిక లోటు రానివ్వకుండా, ఫీజులకు భయపడక మంచి మంచి పేరున్న కళాశాలలో చదివించి యోగ్యులను చేశాము. పెద్దవాని పెండ్లి తేది 06-07-2018 నాడు, చిన్నవాని పెండ్లి తేది 12-02-2020 నాడు జరిగింది. చిన్నవాడు ఇప్పటికీ కుటుంబ వ్యవహారాలు పట్టనట్లు ఉంటాడు. పెద్దవాడు మాత్రం కొంత అవగాహనతో ఉంటాడు. అమెరికాలో ఉన్నా ప్రతిరోజూ మాతో మాట్లాడుతూ మంచి చెడ్డలు తెలుసుకునేవాడు. చిన్నవాని పెండ్లి సందర్భములో నా పెద్ద కొడుకు, కోడలు నాకు తోడుగా ఉండి, నా భారాన్ని కొంత తగ్గిస్తారని ఆశ పడ్డాను. కాని అలా చేయకుండా వీరు కూడా చుట్టపువారి లాగా వ్యవహరించారు. పైగా "నీ బాధ్యత నీవు నిర్వహించాలి, నీకెవ్వరూ సహాయము చేయర"న్నట్లు మాట్లాడారు. దీనితో మొదటిసారి నా హృదయానికి గాయమైంది. పెండ్లి తరువాత మా గ్రామము చిన్నగుండవెల్లికి వెళ్ళే సమయములో నా పెద్ద కొడుకు కోడలు రాలేదు. ఒకరకంగా మాకు సంబంధము లేదన్నట్లు వ్యవహరించారు. ఇది రెండవసారి బాధించింది.

మా ఇద్దరు పిల్లలు అమెరికాలో చక్కని ఉద్యోగాలు చేస్తూ మంచి స్థితిలో ఉన్నారు. ఇక నేను మాత్రం ఆర్థికంగా బలంగా లేనప్పటికీ చాలాసార్లు వారికి అమెరికా నుండి వచ్చుటకు పోవుటకు నేనే టికెట్ డబ్బులు భరించేవాడిని. వారి అత్తగారింటి లోని వ్యక్తిగత పండగలకు రావటానికి కూడా నేనే టికెట్ డబ్బులు భరించాను. ఈ మధ్యన వాడు అమెరికాలో ఒక మంచి ఇల్లు కొన్నాడు. నా కొడుకుకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశ్యముతో కొంత ధన సహాయము చేశాను. తేది 25-01-2021 సమయం వరకు కోవిడ్-19 భయము పూర్తిగా పోలేదు. ఇండియాలో కంటే అమెరికాలో అధికంగా ఉంది. ఆ సమయంలో ఎమర్జెన్సీ ఉంటే తప్ప ఎవ్వరూ అమెరికా ప్రయాణాలు చేయరు. ఇదే సమయంలో నా కొడుకు, కోడలు ఈ మధ్యనే మా కోడలు అన్నకు జన్మించిన కూతురును చూచుటకు ఇండియాకు రావడానికి నన్ను టికెట్ బుక్ చేయమన్నారు. దీనికి నేను నిరాకరించాను. మరియు ఇది కరోనా సమయమని, రావద్దని, తరువాత రమ్మని అన్నాను. వారు వస్తే ఇరు కుంటుబాలకు మంచిది కాదని చెప్పాను. ఇదే విషయాన్ని మా కోడలు తల్లితో చెప్పి వారిని రాకుండా చేయమన్నాను. మరియు వారు వస్తే ఇంటిలోనికి రానియ్యకూడదని కూడా గట్టిగా చెప్పాను. (కొన్ని రోజులు క్వారంటైన్ లో ఉండి రావాలన్నది నా ఉద్దేశం. కాని బయటకు అలా చెప్పలేకపోయాను)

క్షణంలో ఈ విషయం, అంటే... మా కొడుకు, కోడలు ఇండియాకు వస్తే, వాళ్ళను ఇంటిలోనికి రానియ్యనన్నాననే విషయము కోడలు తల్లి ద్వారా నా కొడుకు వేదాంత్ కు తెలిసింది. వెంటనే ఫోన్ చేసి నా మీద నా కొడుకు అతి భయంకరంగా అరిచాడు. శత్రువు కంటే హీనంగా మాట్లాడాడు. ఒకరకంగా నన్ను తిరస్కరించాడు, విసర్జించాడు, నాతో తెగతెంపులు చేసుకున్నాడు. నన్ను వాని ఇంటికి రానీయనని హీనంగా మాట్లాడాడు. మరియు వాడు మా ఇంటికి రామని నిర్ణయించుకున్నారు. తెగతెంపులు చేసుకుంటున్నట్లు మా కుటుంబ వాట్సాప్ గ్రూప్ నుండి నిష్క్రమించారు. వాడి మాటలను భరించలేక బాధేసి నేనే ఫోన్ ను పెట్టేశాను.

ఈ విధంగా నా కొడుకుచే తిరస్కరింపబడుట వలన చాలా బాధేసింది. ఒక్కసారి లోకం తలక్రిందులైనట్లు అనిపించింది. నేను ఎంతో కష్టపడి పైస పైస కూడబెట్టి, పెంచి పోషించి, డొనేషన్స్ రూపంలో ఎన్నో పైసలు ఖర్చు చేసి మంచి మంచి కళాశాలలలో చదివించాము. ఏ కష్టమూ రాకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొంటూ ప్రాణానికి ప్రాణంగా పెంచి పెద్ద చేసిన పుత్రుడు తిరగబడేసరికి బాధ కలిగింది. విద్యాబుద్ధులు నేర్పి పెండ్లి చేయగానే నీవు మా ఇంటికి రావద్దు, నీవు అనర్హునివి అనే మాటలు ఎంతో బాధ కలిగించాయి. జీవితంలో ఎన్నడూ అనుభవించని అవమానమును అనుభవించాను. నా కష్టార్జితమైన డబ్బులను ఎందుకు వీరి అమెరికా టికెట్లకని, ఇంటిని కొనుటకని ఇచ్చానని పరితపించిపోయాను. ఈ జీవితంలో ఎవ్వరూ మనవారు కారు, చివరికి ప్రాణంగా పెంచి పోషించిన పిల్లలు సహితము పరులవారే, మనది తిని మనకే ద్రోహము చేయువారనే నిజము వ్యక్తిగతంగా, స్పష్టంగా తెలిసింది. నా కొడుకులు నా వారు కారనే భావము బోధ పడ్డది. శ్రీవేంకటేశ్వరా! నీవే శరణు అంటూ స్వామివారిని మళ్ళీ శరణు జొచ్చాను. ఈ సంఘటన నా హృదయాన్ని దహించి వేసింది. ముందే సంకల్పములో ఓడిపోయిన బాధతో ఉన్న నాకు ఈ సంఘటన పుండు మీద కారం చల్లినట్లైంది. ఈవిధంగా స్వామి అనుగ్రహమునకు దూరమైన దుఃఖము మరియు నా కొడుకుచే తిరస్కరింపబడిన దుఃఖము రెండింటిచే రగిలిపోయాను. స్వామివారిని తీవ్రస్థాయిలో ప్రార్థించసాగాను. ప్రతి రోజు ప్రతి క్షణం దుఃఖం ఎగసి ఎగసి వస్తోంది. జీవితపు విలువ, పుత్రుల స్వభావము చక్కగా అర్థం అవుతున్నవి. నాకు శ్రీవేంకటేశ్వరుడు తప్ప దిక్కెవ్వరు లేరనే భావము బలంగా ఏర్పడింది కాబట్టి స్వామి సాధన మరింత పెరిగింది.

## వికారాలను నశింప చేస్తున్నట్లు చూపుట

నా జీవితంలో ఎదురగు ప్రతి సంఘటన శ్రీవేంకటేశ్వరుని వైపే వెళ్ళేది. పై రెండు సంఘటనల వలన నాలో ఎన్నో విషయాలలో ముఖ్యంగా, గత 18 సంవత్సరాల నుండి నేను శ్రీవేంకటేశ్వరుని పొందుటలో ఆటంకము కలిగిస్తున్న వివిధ



హా హా కారాలు చేస్తున్న పూతన

వికారములను నాలో నశింపచేస్తున్నట్లు స్వామివారు ఈ క్రింది లీల ద్వారా సూచించారు.

**తేది 03-02-2021 కల:** నేను ఒక ఉత్తర భారత దేశ ప్రాంతములో ఉన్నాను. ఆ ఊరి తిరునాళ్ళలో శ్రీకృష్ణుని చిన్ననాటి లీలలు, అంటే రకరకాల రాక్షసులు వివిధ రూపములలో వచ్చి శ్రీకృష్ణుని చంపుటకు యత్నించుట, చివరికి వారే హతమైపోవుటను బొమ్మలతో యక్షగానము చేస్తూ చూపిస్తున్నారు. పూతన, పెద్ద ఆకారముతో, రంగు రంగుల అద్దాలు కలిగి, ధగధగ మెరిసే దుస్తులు ధరించి, ఒక బొమ్మ, అటు ఇటు ఊగే విధమైన తలను ధరించి ఉన్న పూతనను స్పష్టంగా చూశాను. అది బాధతో రకరకాల ఆకర్షణీయమైన అరుపులు అరుస్తున్నది. ఈవిధమైన సందడిని, భక్తుల ఆటలను చూచాను. ఇంతే కల.

**దీనర్థం:** స్వామి సంకల్పాన్ని సాధించుటకు అడ్డు వచ్చే అన్ని రకాల వికారాలను ఒక్కొక్క దానిని స్వామివారు త్రుంచి వేస్తున్నారని అర్థం. ముఖ్యంగా భగవంతుణ్ణి పొందుటలో పుత్రవాత్సల్యము పెద్ద అవరోధము, దానిని పూతనతో పోల్చి, అది చనిపోవునప్పుడు ఏ రకమైన హాహా కారాలు చేసిందో నేను కూడా నాలో పుత్రవాత్సల్యము నశిస్తున్నప్పుడు అలాగ అరిచానని చూపాడు. కాని దీనిని ఈ కల కన్నప్పుడు అర్థం చేసుకోలేదు. ఈ భాగాన్ని వ్రాస్తున్నప్పుడే గ్రహించాను.

## విజయం సాధించుటకు చేస్తున్న కృషిని చూపుట

గతంలో నేను తప్పు చేశానని, ఇప్పటినుండి ఆ తప్పులను పునరావృతం కాకుండా చూసుకుంటానని వేడుకున్నాను. మరియు మా పుత్రుని తిరస్కరణ వలన కలిగిన బాధచే మీరే నాకు రక్ష తప్ప లోకంలో మరెవ్వరూ లేరని ప్రార్థిస్తూ మరింత పశ్చాత్తాపం చెందుటను చూచి బహుశా స్వామివారు తృప్తి చెందారు. నేను పరీక్షలో పాస్ అగుటకు తీవ్ర కృషి చేస్తున్నట్లు ఈ క్రింది మరో లీల ద్వారా చూపెట్టారు.

**తేది 04-02-2021 కల:** నేను ఇంజనీరింగ్ ఎం.టెక్ లో పాస్ అగుటకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాను. మళ్ళీ కళాశాలకు వెళ్ళాను, అక్కడి మిత్రులను అడిగి ఏయే సబ్జెక్టులు ఉన్నవి, ఏ పుస్తకాలను కొని చదవాలి? నేను ఈసారి పరీక్షలో తప్పక పాస్ కావాలనే ఉద్దేశ్యముతో ప్రయత్నిస్తున్నాను. ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ ను, అందులోని విద్యార్థులను, నా మిత్రుడు హృషీకేశ్ ను చూచాను. వారి జీవన విధానమును అంటే వారి బాత్రూమ్ లను, నివసించే గదులను, పడుకునే విధానమును చూచాను. ఎలాంటి సౌకర్యవంతము లేని కటిక నేలపైన పడుకొనుట చూచాను. చెత్తగా, శుభ్రం చేయని బాత్రూమ్ లు వాడుటను, ఒకే హాలులో పలువురు విద్యార్థులు నేలపైననే పడుకొనుటను స్పష్టంగా చూచాను. ఇంతే కల.

అంటే... పాస్ కావాలంటే నేను కూడా ఈ విధమైన జీవన విధానమును అలవాటు చేసుకోవలసి ఉంటుందని బహుశా స్వామివారు చూపారు. ఏది ఏమైనా నేను ఎం.టెక్ లో పాస్ కావాలని, పిహెచ్.డి లో కూడా సీటు పొందాలనే కోరికతో ఉన్నాను. ప్రయత్నం విరివిగా చేస్తున్నాను. ఎలాగైనా రెండు హరినామ క్షేత్రాలు, ఒకటి మా ఊరిలో మరోటి హైదరాబాద్ లో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాను.

## హరినామ క్షేత్రానికి ఇల్లును ఇవ్వ చూపుట

**తేది 04-02-2021:** గత కొన్ని రోజుల నుండి ఎలాగైనా హరినామ క్షేత్రమును స్థాపించాలని నిర్ణయించాను. మరియు ఇది తిరుమల ఆలయ ప్రతిరూపముగా ఉండాలనే

విషయమును మరచాను. కాబట్టి ఈరోజు చిన్నగుండవెల్లిలోని మా ఇంటిని మరియు ప్రక్కన ఉన్న మరికొంత స్థలము మొత్తం దాదాపు 1500 గజాలలో హరినామ క్షేత్రము స్థాపించాలని అనుకున్నాను. అందులో ఆశ్రమము, భజన మండపము, భక్తులు నివసించుటకు కొన్ని గదులు, స్వామివారి చిన్నపాటి ఆలయము ఏర్పాటు చేయాలని అనుకున్నాను. అఖండ హరినామ స్మరణకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేయాలని అనుకున్నాను. మరియు ఈ విషయము మా ఊరి వారితో చెప్పాను. ఇక స్వామివారి దయ అనుకున్నాను.

## స్వామివారు సూచించేవరకు హరినామక్షేత్ర ఏర్పాట్లు చేయనని చెప్పట

**తేది 08-02-2021 :** నాకు దగ్గరగా ఉంటుంది కావున, కొన్ని రోజుల క్రింద మా కాలనీలోని సాయిబాబా పార్కులోని కొంత స్థలములో శ్రీవేంకటేశ్వరుని ఆలయం నిర్మించి హరినామ క్షేత్రము ఏర్పాటు చేయాలని భావించాను. కాని ఇక్కడ వద్దన్నట్లు స్వామివారు గతంలో ఒక లీలలో చూపారు. అయినప్పటికీ నేను మొండిగా ముందుకు వెళ్ళి తేది 04-02-2021 నాడు సొసైటీ అనుమతితో సర్వే కూడా చేయించాను. ఆ తర్వాత మా సొసైటీ ప్రెసిడెంట్ ఎందుకు సర్వే చేయించావని ఘాటుగా కోప్పడ్డాడు. ముందు సర్వేకు అనుమతించి తరువాత కోప్పడుటను చూచి ఇది స్వామివారి లీలనే అని భావించాను. ఆయన కోప్పడునంత కాలం స్వామివారే అక్కడ వద్దని చెప్పినా ముందుకు వెళ్ళుచున్నాడని భావించి కోప్పడుతున్నారనే భావన ఏర్పడ్డది. ఫలితంగా స్వామివారు కోరినట్లే చేయాలి తప్ప నా సొంత భావన పనికి రాదని గ్రహించాను. చివరికి స్వామివారు స్వయంగా సూచించే వరకు హరినామ క్షేత్ర స్థలము జోలికి వెళ్ళరాదని నిర్ణయించుకున్నాను.

## మనశ్శాంతిని ప్రసాదించమని వేడుకొనుట

మా పెద్ద కొడుకు నన్ను తిరస్కరించి మాతో తెగ తెంపులు చేసుకున్నప్పటినుండి నా హృదయంలో అగ్ని దహించి వేస్తోంది. నా డబ్బుతోనే ఇల్లు కొని, నన్నే ఇంట్లోకి రానివ్వము అనడంతో మనస్తాపానికి గురైనాను. జీవితం ఏకాకిగా అనిపించింది. ఈ సంపాదన, ఆస్తి ఎవరికి? ఎందుకు సంపాదించాలనే ఆలోచనలు వచ్చాయి. ఈ శ్రమను నా ప్రభు శ్రీవేంకటేశ్వరుని సేవకు, హరినామ క్షేత్రం ఏర్పాటుకు, పరీక్షలో పాస్ అగుటకు చేస్తూ బ్రతకవలెననే నిర్ణయానికి వచ్చాను. అంతా అశాశ్వతము గాన ఉన్నప్పుడే ఆయనకు అర్పించి జీవించాలి. స్వామి సేవకై డబ్బు ఖర్చు చేయుటలో ఏమాత్రం వెనకడుగు వేయకుండా, మరింత శక్తి సామర్థ్యాలతో చేయాలని నిర్ణయించుకున్నాను. మరియు నా కొడుకు మాటలు ప్రతి క్షణం గుర్తుకు వస్తూ నన్ను దహిచి వేస్తున్నవి. అవమాన భావముతో రగిలిపోవుచున్నాను.

చివరికి తేది 11-02-2021 నాడు ఈ రకమైన భావాలు వచ్చాయి. "నిన్ను నీ కొడుకులు, కుటుంబం ఎవ్వరూ పట్టించుకోరు. వారెవ్వరూ నీవారు కారు". స్వామివారు ఎప్పటినుండో చెప్పుచున్న విషయం నిజమైంది. నన్ను సంతోషపెట్టువారు, నావాడని దగ్గరకు తీసి ఆత్మీయంగా ఉండువారు కేవలం శ్రీవేంకటేశ్వరుడు ఒక్కరే. మిగతా అందరూ వారి వారి వ్యక్తిగత ప్రయోజనం కోసం మన చుట్టూ తిరిగేవారు. వారి కోరిక నెరవేరినప్పుడు త్యజిస్తారు. కాబట్టి ఇప్పటినుండి వ్యామోహమును విడనాడాలి. లౌకిక విషయాల పట్ల కూడా వ్యామోహమును తెంచుకోవాలి. శ్రీవేంకటేశ్వరుని సేవ యందే మనస్సు నిలిపి, ఆయన నా వాడని భావిస్తూ జీవించుట మంచిదని భావించాను. దీనిని ఈనాడు నా భార్యకు కూడా చెప్పి ఆమెను కూడా ఈ విధంగా జీవించమని ఉపదేశించాను. నేను మాత్రం నాకు కుటుంబం లేదు, ఎవ్వరూ లేరు, మీరే నా స్వామి, దైవం, నావారు అని మనస్ఫూర్తిగా భావించి, అఖండ భక్తి శ్రద్ధలతో నా ప్రభువుకు ఏ మాత్రం ధన వ్యయమునకు వెనుకాడక సేవ చేయాలని దృఢంగా నిర్ణయించుకున్నాను.

నా కొడుకు సంఘటనతో పాటు మా సొసైటీ ప్రెసిడెంట్ గారు కోపగించి పలికిన మాటలతో నా మనస్సు చాలా బాధ పడ్డది. హృదయములో కోపం, నిరాశ నిస్పృహలతో పాటు అసహనము నిండుకున్నవి. ఏ పని చేసినా అదే విషయం గుర్తుకు వచ్చి రగిలిపోవుచున్నాను. పట్టరాని కోపం వస్తోంది. పైగా నేను శక్తిహీనుణ్ణి, అల్పుణ్ణనే విషయం తెలిసి, ఇలా నా పరిస్థితిని ఎందుకు కల్పించారు ప్రభూ! అంటూ శ్రీవేంకటేశ్వరుని ప్రార్థించాను. లోకంలో నేనే అల్పుణ్ణనే భావమేర్పడ్డది. ఈ రోజు శుక్రవారము. ఇంటిలో అభిషేకం చేయు సమయాన నా మనస్సు అలజడిగా ఉండుట వలన సరిగా ప్రార్థించలేకపోయాను. ఏదోలా పూజను ముగించి, నాకు మనశ్శాంతిని ప్రసాదించమని వేడుకున్నాను. మనిషికి కోపం చెడ్డదని తెలుసు, దాని ద్వారా మరింత చెడు జరుగునని తెలుసు. అయినప్పటికీ దానిని అధిగమించలేకపోయాను. అధిగమించుటకు నా శక్తి సరిపోలేదు. కావున రక్షించమని, నన్ను సరైన దారిలో పెట్టమని స్వామివారిని వేడుకున్నాను. నేను సదా మీ వాణ్ణేనని, తప్పు చేస్తే క్షమించమని, మంచి మార్గంలో పెట్టమని వేడుకున్నాను. నాలోని కోపమును, అలజడిని, నిరుత్సాహమును తొలగించమని మరీ మరీ వేడుకున్నాను. మీరే నాకు గురువు, దైవము, ప్రభువు, తల్లితండ్రులు కావున నేను ప్రస్తుతం ఉన్న స్థితి నుండి కాపాడవలసిందిగా దీనంగా ప్రార్థించాను. నాకు ఎవ్వరూ లేరని బాధపడ్డాను.

మరియు నేటివరకు (తేది 12-02-2021) స్వామివారు

ప్రసాదించిన అన్ని అనుభూతులను చదివాను. స్వామివారు నాపై చూపిన కృపకు ప్రతిగా నేను చేసిన ద్రోహానికి పశ్చాత్తాపముతో కుమిలిపోయాను.

ఈ రోజు వరకు నాలో, లౌకిక విషయాల పట్ల, కుటుంబ విషయాల పట్ల మరియు స్వామివారి లీలల పట్ల గణనీయమైన మార్పు కలిగింది. బహుశా ఈ మార్పు నా మూలములో జరిగింది కాబట్టి ఇప్పుడు స్వామివారు కరుణించారు. ఇప్పటినుండి నేను అనుభవిస్తున్న ఒక్కొక్క బాధాకర అంశమును నానుండి దూరం చేయసాగారు. ఈ లీలలు తేది 13-02-2021 నుండి ఈ క్రింది విధంగా ప్రారంభమైనవి. మొదట నేను సంకల్పములో గెలిచానని ఈ విధముగా చెప్పాడు.

## భాగవతుల ఆశీర్వాదముతో సంకల్పములో గెలిచామని చెప్పట

ఆ రోజు ఈ విషయానికి సంబంధించిన భావాలను నా డైరీలో ఈ క్రింది విధముగా వ్రాసుకున్నాను.

**తేది 13-02-2021 :** తేది 16-12-2020 రోజున నేను సంకల్పానికి అనర్హుడనైనానని తెలిసి చాలా కలత చెందాను. గత 18 సంవత్సరాలుగా నా స్వామి కోసం నేను ఎంతో కష్టపడ్డాను. సంఘంలో వెలివేయబడ్డ వ్యక్తిలాగా జీవించాను. నా శక్తిమేర సేవ చేశాను. తెలిసి ఏ చిన్న తప్పూ చేయలేదు. ఈ కలియుగంలో ఒక అథమ స్థాయి భక్తుడు, కేవలం మీ నామస్మరణ చేస్తూ, మీ పాదాలను దర్శించే సాధారణ మానవునికి కూడా తమ దివ్యదర్శన భాగ్యము కలుగుతుందనే దానికి నిదర్శనంగా, నన్ను ఎన్నుకోవాలనే కోరికకు అనుగుణంగా సాధన చేశాను. సేవ చేసి, స్వామివారి మెప్పు పొంది, బోనస్ కు యోగ్యుణ్ణి అవుతాననే నమ్మకం నాలో ఎంతో ఉండెను. తెలియక తప్పు చేశానేమో చెప్పలేను. తెలిసి ఏ ఒక్క తప్పూ చేయలేదు. కాని చివరికి నా దురదృష్టం వలన విఫలుణ్ణి అయ్యాను. చాలా బాధ కలిగింది. నేను ఓడిపోయాను అనే దానికంటే... నేను ఒక అసమర్థ సేవకుడిననే భావము నన్ను దహించివేసింది. స్వామివారికి నా లాంటి అసమర్థ సేవకులు ఉంటే వారికి చిన్నతనంగా భావించాను. నన్ను నేను అసహ్యించుకున్నాను. ఈ జీవితమును చాలించాలని నిర్ణయించి, స్వామివారి సుదర్శనాన్ని నా శిరస్సును ఖండించమని వేడుకున్నాను. కాని దయామయుడైన శ్రీవేంకటేశ్వరుడు తన సుదర్శనానికి ఆజ్ఞను ఇవ్వనందున బ్రతికిపోయాను. నా తల ఖండించమని ఒక ఐదారు నిముషాలు కళ్ళు మూసుకొని నా స్వామిని చివరిసారిగా స్మరిస్తూ గడిపిన ఆ మధుర క్షణాలు, అమృతము వలె అనిపించాయి. నేను మరో లోకంలో ఉన్నట్లు భావించాను. కాని చివరికి స్వామివారు కరుణించారు. నేను మాత్రం సంకల్పం నెరవేర్చని అసమర్థుడిగా నన్ను నేను భావించుకుంటూ దుఃఖించసాగాను.

చివరికి తేది 22-12-2020 రోజున ఒక కలలో స్వామివారి ఎంతోమంది భక్తులు నాకు తిరుపతి లడ్డూలను బహుమతిగా ఇచ్చారు. ఆ లడ్డూలను మా ఇంటికి తీసుకువచ్చాను. ఆనాడు దీని అర్థమును కేవలం శుభసూచకంగా మాత్రమే భావించాను. మరోప్రక్క దుఃఖిస్తూ నిన్నటివరకు అంటే తేది 12-02-2021 వరకు స్వామివారు ప్రసాదించిన అన్ని అనుభూతులను చదివాను. మనిషికి కష్టం చేసే హక్కు మాత్రమే ఉన్నదని, ఫలితాన్ని భగవంతుడు మాత్రమే ప్రసాదించాలని భావించి నా భాగ్యం ఇంతేనని అనుకున్నాను. కాని ఈ రోజు అనగా 13-02-2021 ఉదయం ఇంటిలో పూజ పూర్తి కాగానే స్వామివారు కరుణించినట్లు ఒక హృదయాంతర భావం ఏర్పడ్డది. నేను సంకల్పంలో భాగవతుల ఆశీర్వాదం ఫలితంగా గెలిచినట్లు భావమేర్పడ్డది. నేను ఓడిపోయిన మాట నిజమే కాని గత 18 సంవత్సరాలలో ఎంతోమంది భాగవతులు నా మాధ్యమంగా స్వామివారి కృపకు పాత్రులైనారు. భక్తులు ప్రతి సంవత్సరం మేము వ్రాయించే 7 కోట్ల జపములో స్వామి నామాన్ని వ్రాసి లాభం పొందారు. కొందరు నమో వేంకటేశాయ రథం ద్వారా కొందరు శ్రీవేంకటేశం మాసపత్రిక ద్వారా స్వామి కృపను పొందారు. మరికొందరు భజగోవిందం ద్వారా స్వామి అనుగ్రహాన్ని పొందారు. ఈ భక్తులందరి ఆశీర్వాద ఫలితంగా స్వామివారు నన్ను నా పరీక్షలో లేదా నా సంకల్పంలో ఉత్తీర్ణుణ్ణి చేశారు అనే భావన ఏర్పడ్డది. అందుకే భక్తులు నాకు స్వామివారి ప్రసాదమైన లడ్డూలను బహుమతిగా ఇచ్చారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు చాలామంది భక్తులు, అందరూ స్వామివారి లడ్డూలనే బహుమతిగా ఇచ్చారు. ఆ భాగవతుల ఆశీర్వాద ఫలితంగా నేను నా సంకల్పములో గెలిచానని స్వామివారు చెప్పారు. మరో రకంగా చెప్పాలంటే భాగవతుల ఆశీర్వాదమనే గ్రేస్ మార్కులతో పాస్ అయ్యానని భావించాను. చివరికి ఏటిలో కొట్టుకుపోతున్న నాకు నా ప్రభువు యొక్క భక్తులు మాత్రమే సహాయకులుగా నిలిచారు. వారి సహాయము చేతనే నేను నా సంకల్పాన్ని సాధించుకున్నాను.

వెనువెంటనే నేను పట్టరాని ఆనందానికి గుర్రైనాను. నా భాగవతుల ఋణం తీర్చుకోవాలనుకున్నాను. వెనువెంటనే ఈ గెలుపు భాగవతులదని, వారికి అంకితమిస్తున్నానని స్వామివారితో చెప్పాను. ఈ గెలుపు ఫలితాన్ని వారికి పంచి పెట్టమన్నాను. మరోప్రక్క నాకు కేటాయించిన సేవలో ఇతరుల జోక్యాన్ని జీర్ణించుకోలేకపోయాను. చివరికి ఈ విజయాన్ని నేను స్వీకరించలేకపోయాను. భాగవతులు నాకు సహాయం చేసినందుకు ప్రతిగా వారికి ఈ సంకల్ప ఫలాన్ని పంచమన్నాను. మరియు నాకు మరో సంకల్పాన్ని ఇవ్వమని ప్రాధేయపడ్డాను.

## రెండవ సంకల్పం పొందుట

ఆ తరువాత అత్యంత దీనంగా, నా కళ్ళనుండి నీరు ధారలుగా ప్రవహిస్తుండగా స్వామివారిని ప్రార్థించసాగాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! ఇప్పటినుండి మీరు చెప్పినట్లు వింటాను, చేయమన్నది చేస్తాను. గతంలో తెలియక చేసిన తప్పులను క్షమించండి, నాకు మరో సంకల్పమును తరణోపాయముగా ఇవ్వమని అత్యంత దీనంగా వేడుకున్నాను. నేను లౌకిక విషయాలను, కుటుంబ విషయాలను సంపూర్ణంగా త్యజిస్తానని మాట ఇచ్చాను. మీ సంకల్పమే ధ్యేయంగా జీవిస్తానని కూడా చెప్పాను. నాకు మరో సంకల్పము ఇచ్చి విజయుణ్ణి చేయమని, తమని పొందే భాగ్యమును ప్రసాదించమని వేడుకున్నాను. వెంటనే స్వామివారు సంతోషించినట్లు భావమేర్పడ్డది. మరియు శ్రీనివాస కళ్యాణాలను మరో సంకల్పముగా స్వీకరించమనే మరో హృదయాంతర భావం కూడా ఏర్పడ్డది. ఎంతో సంతోషించాను.

## ఆనందకర స్థితిని ప్రసాదించుట

ఇది ఇలా ఉంటే... మరోప్రక్క నా సంకల్పంలో విజయాన్ని సాధించిన సంతోషం కేవలం ఒక్క రోజే ఉన్నది. గతంలో నేను స్వామి గురించి చెందిన వ్యధను ఈ ఒక్క 'విజయం సాధించావు' అనే విషయం పూరించలేకపోయింది. స్వామివారికి నాపై కోపము ఉన్నదని బాధపడసాగాను. తేది 18-02-2021 ఉదయం ఇంటిలో పూజ చేయు సమయంలో ఇలా ప్రార్థించాను. ప్రభూ శ్రీవేంకటేశ్వరా! మీకు నాపై ఉన్న కోపాన్ని తగ్గించుకోండి, నేను దుఃఖించి అలసిపోయాను కాబట్టి నాకు 2000-2002 సంవత్సరం వరకు ప్రసాదించిన ఆనంద స్థితిని తిరిగి ప్రసాదించమని వేడుకున్నాను. ఆ సమయంలో నేను 'ప్రభూ! అని ఒక్కసారి స్మరించినంతనే నా శరీరము పులకరించి, రోమాంచితం అయ్యేడిది. నా కళ్ళ నుండి ఆనంద బాష్పాలు రాలేవి. అలాంటి స్థితి 2003 సంవత్సరం నుండి క్రమ క్రమంగా తగ్గిపోయింది. ఈ మధ్యన అస్సలు లేదు. స్వామివారిని స్మరిస్తున్నప్పటికీ అలాంటి మధురానుభూతిని పొందలేదు. అందుకని గత రెండు రోజుల నుండి నేను నా పూర్వపు స్థితిని పొందాలని, ఆ స్థితిని నేను స్వతహాగా పొందలేనని, మీ కృప ఉంటేనే సాధ్యమని వేడుకున్నాను. మరియు మీకు నాపై కోపము పోయి దయ కలిగితే 24 గంటలలో ఈ ఆనందస్థితిని ప్రసాదించమని షరతు విధించాను. స్వామివారు ఈ క్రింది లీల ద్వారా అదేవిధంగా 24 గంటల లోపు ప్రసాదించారు. ఎంతో సంతోషించాను. ఆ లీల చూద్దాం!

శ్రీమాన్ రాళ్ళబండి శ్రీనివాసన్ గారు అనే రచయిత, శ్రీవేంకటేశం మాసపత్రికలో ప్రచురణార్థం, రామాయణం రత్నాకరం అనే ఆర్టికల్ ను పంపారు. ప్రతి వ్యాసాన్ని చదివిన తరువాతే ప్రచురించే అలవాటు నాది. అప్పుడు నేను భరతుడు అడవిలో ఉన్న శ్రీరాముణ్ణి చేరే ఘట్టమును చదువుచున్నాను. ఒక్కసారి నా మనస్సులో స్వామి పట్ల ప్రేమభావం ఉప్పొంగింది. శరీరం పులకరించింది. భరతుడు దూరము నుండి రాముణ్ణి చూచి అన్నా... అని సంబోధించాడు, కాని నేను మాత్రం ప్రభూ...! అంటూ స్వామివారిని గట్టిగా సంబోధిస్తూ ఏడ్చాను, పరవశించిపోయాను. శరీరం రోమాంచితమయింది. ఆనంద బాష్పాలు జల జలా రాలాయి. ఒక రకంగా దివ్యానుభూతికి లోనైనాను. ఇది ఒక్కసారి కాదు, ఈనాడు ఈ ఘట్టం చదివే సమయాన మొత్తం నాలుగయిదు సార్లు నా కళ్ళ నుండి ఆనంద బాష్పాలు రాలాయి. మనస్సు తేలికైంది. నా షరతును పూరించి నా ప్రభు నన్ను మళ్ళీ అనుగ్రహిస్తున్నారని ఆనందపడిపోయాను.

## పరీక్షలో ఉత్తీర్ణుణ్ణి కావటానికి ప్రయత్నాలు

ఇక హరినామక్షేత్రం ఏర్పాటు దిశగా, పరీక్షలో పాస్ అగుటకు తీవ్ర కృషి చేస్తున్నావంటూ ఈ క్రింది విధంగా చూపెట్టారు.

**తేది 20-02-2021 కల:** ఈనాడు కూడా నేను పరీక్షలో పాస్ కావటానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు కలకన్నాను. ఇంజనీరింగ్ కళాశాల లోనికి వెళ్ళాను. పాఠాలు నేర్చుకొనుచున్నాను. పరీక్షలు ఎప్పుడని నా మిత్రుల్ని అడిగాను. నేను కలలో నాతో పాటు ఇంజనీరింగ్ చదివిన మిత్రులను చాలామందిని చూచాను. వారందరూ అప్పటి రూపము కాకుండా నేటి రూపముతో, లావుగా పొట్టలు పెంచి ఉన్నారు. ఎలాగైనా నేను ఉత్తీర్ణుణ్ణి కావాలనే పట్టుదలతో ఉన్నట్లు కనబడ్డది. ఇంతే కల.

ఇంతవరకు నేను సంకల్పములో ఓడిపోయాననే దుఃఖము నుండి మరియు స్వామివారికి నాపై కోపము ఉన్నదనే విషయము నుండి ముక్తుణ్ణి కావించారు. మరియు పరీక్షలో పాస్ కావటానికి చక్కని ప్రయత్నం చేస్తున్నావని కూడా చెప్పారు. ఇప్పుడు నా కొడుకు వల్ల కలిగిన బాధను ఎలా తీర్చాడో చూద్దాం!


## నీ కొడుకు చిన్నపిల్లవాడని చెప్పుట

గత కొన్ని రోజుల నుండి నా కొడుకు చేత తిరస్కరించబడ్డ కారణము చేత రగిలిపోవుచున్నాను. ఒక సందర్భములో మా కోడలు తండ్రి శ్రీమాన్ సంజీవరెడ్డి ఫోన్ చేసినప్పుడు, ఈ కోపములో ఉండి, మీరు తల్లితండ్రుల బాధ్యతను సరిగా నిర్వర్తించలేదని కోప్పడ్డాను. మరియు మా పిల్లలు మాతో తెగతెంపులు చేసుకున్నట్లు చెప్పాను. ప్రతి క్షణం, ప్రతి రోజు నా కొడుకు అన్న మాటలు గుర్తుకు వచ్చి బాధపడసాగాను. మొత్తం జీవితాంతం వాడికి దూరంగా ఉండాలని, వాడితో మాట్లాడకూడదని నిర్ణయించుకున్నాను. కొన్ని రోజుల తర్వాత వాడు మాట్లాడుటకు ప్రయత్నించినప్పటికీ నేను మాట్లాడలేదు.

వాడు పంపిన మెసేజ్ లను చూడలేదు. సురేఖతో మాత్రం వాడు మాట్లాడుచున్నాడు. వారు మార్చి 2021 లో ఇండియా వచ్చుటకు టికెట్ బుక్ చేసుకున్నారు. ఇంటికి వచ్చిన తరువాత నాకు సారీ చెప్తానని సురేఖతో ఎన్నోసార్లు చెప్పాడు. నేను మాత్రం వాని ఫోన్ కాల్ కు రెస్పాన్స్ ఇవ్వలేదు. గత రెండు రోజుల నుండి నా పుత్రుని ప్రవర్తన వల్ల నేను అనుభవిస్తున్న నరక యాతన చూచి స్వామివారు నాకు సహాయపడుట లేదనే భావము మనసుకు వచ్చింది. స్వామివారు కూడా నన్ను పట్టించుకోలేదని బాధపడ్డాను. ఎలాగైనా ఈ బాధను నివారించమని వేడుకున్నాను. వెంటనే శ్రీవేంకటేశ్వరుడు నన్ను ఊరడించ, కోపాన్ని తగ్గించ ఈ క్రింది విధమైన లీలను చూపించాడు.

**తేది 24-02-2021 కల :** ఈ కలలో నా భార్య సురేఖ హాస్పిటల్ నుండి ఒక చిన్న బాబుని ఎత్తుకొని వచ్చింది. ఏ ఇంటికైతే ఆ బాబును తీసుకొని వచ్చిందో ఆ ఇల్లు మాదేనట, కాని అది హైదరాబాద్ లోనిది కాని, లేదా చిన్నగుండవెల్లి లోనిది కాని కాదు. ఒక క్రొత్త ప్రదేశములో నూతనంగా ఉన్నది. సురేఖ దాదాపు అయిదారు మాసాల పిల్లవాణ్ణి తెచ్చి మా ఇంట్లో పడుకోబెట్టింది. వాడు మా కొడుకేనట, నేను వాడిని చూచి అప్పుడే ఇంత పెద్దవాడైనాడా? అని అన్నాను. మరియు వాడిని తీసుకుని ఆడుకున్నాను. వాడు మా పెద్ద కొడుకు చి॥ 'వేదాంత్' చిన్నప్పటి రూపు రేఖలతో ఉన్నాడు. తరువాత ఏదో పని మీద బయటికి వెళ్ళి వచ్చాము. వస్తున్నప్పుడు ఈ ఇంటి పరిసరాలను చూచాను. ఇల్లు పెద్దగా ఉన్నది. చుట్టూ పచ్చని గడ్డితో, పూల మొక్కలతో చాలా అందంగా ఉన్నది. కాని ఇది నాకు క్రొత్తది. ఇంతే కల.

ఇది ఒక అత్యంత విశ్లేషణాత్మకమైన లీల. నేను కలలో



మా కొడుకు చి॥ వేదాంత రెడ్డిని చిన్న పిల్లాడిలా చూపుట


చూచింది... ఈ మధ్యన చి॥ వేదాంత్ అమెరికాలో కొన్న ఇల్లు. ఒకరకంగా శ్రీవేంకటేశ్వరుడు ఈ కల ద్వారా నన్ను ఇలా ఊరడించాడు. "నీ కొడుకు ఏమీ తెలియని చిన్నపిల్లవాడు, పైగా భారతదేశపు మర్యాదలు అంతగా తెలియని అమెరికాలో నివసిస్తున్నాడు, కావున ఈ విధంగా మాట్లాడాడు. అందుకు తప్పు పట్టకుండా తెలియనివాడుగా చిన్నవాడుగా భావించు" అనే సందేశమును ఈ కల ద్వారా ఇచ్చాడు. కాని నేను మాత్రం నా ప్రభువుతో... నేను తప్పకుండా పిహెచ్.డి చేయుటకు సిద్ధంగా ఉన్నాను. అందుకు కుటుంబముతో బంధములను తెంచుకుంటాను అని చెప్పాను. కాని స్వామివారి మాట పాటించాలనే భావము కూడా మరోప్రక్క ప్రవేశించింది. అందుకని బురదలోని తామరలాగా అంటీ అంటనట్లు జీవించాలనుకున్నాను. ఈ మధ్యన చి॥ వేదాంత్ తన తల్లికి ఫోన్ చేసి తాము 08-03-2021న ఇండియాకు వస్తున్నామని, వచ్చాక నాకు సారీ చెప్పుదునని పదే పదే చెప్పాడు. నేను మాత్రం స్వామివారు చెప్పారు కాబట్టి నా కోపములో కొంతవరకు సడలింపు ఇచ్చి వేదాంత్ చెప్పబోయే 'సారీ'కై వేచి చూస్తున్నాను.

చివరికి మా కొడుకు కోడలు తేది 08-03-2021 నాడు మా ఇంటికి వచ్చారు. నేను మాత్రం వారితో దూరంగానే ఉంటూ మాట్లాడీ మాట్లాడని స్థితిని కొనసాగించాను. రెండు రోజులు గడిచాయి. వేదాంత్ సారీ తప్పక చెబుతాడని అనుకున్నాను. ఐనప్పటికీ నేను బురదలోని తామరాకు వలె అంటీ అంటనట్లే జీవించాలనుకున్నాను. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం తనదైన పద్ధతిలో నా మూలం నుండి పుత్ర వ్యామోహాన్ని త్రుంచివేసి, దీనిని అలాగే కొనసాగించాలని అనుకున్నాడు. దీనికై మరో అద్భుతమైన లీల ఈ క్రింది విధంగా చూపాడు.

## స్వామివారి వెక్కిరింత నవ్వు

ఒకరోజు నేను, సురేఖ మరియు వేదాంత్ ముగ్గురము మా ఇంటి హాల్ లో కూర్చున్నాము. అంతకు ముందు వేదాంత్ సారీ చెప్పుదునన్నాడు కాబట్టి ఇప్పుడు డాడీకి సారీ చెప్పు అని సురేఖ వేదాంత్ ను అడిగింది. ఇంతలో వేదాంత్ ఇలా అన్నాడు. "ముందు డాడీయే ఇంటికి రావద్దన్నాడు, ఆ తరువాత నేను ఆ మాట అనవలసి వచ్చింది. నా తప్పు లేదు సారీ చెప్పను" అంటూ లేచి మొదటి అంతస్తులోని వాని గదికి పోసాగాడు. ఇంతలో శ్రీవేంకటేశ్వరుడు మరో అద్భుతమైన లీలను ఈ విధంగా ప్రసాదించాడు.

చి॥ వేదాంత్ తాను సారీ చెప్పనని, తన తప్పు లేదని చెప్పుచూ సోఫా నుండి లేచి పై అంతస్తుకు పోవుచూ, మా నుండి కొంత దూరంగా పోయాడు. నేను, సురేఖ మాత్రము వేదాంత్ ఈవిధంగా మాట్లాడేసరికి మరింత నొచ్చుకున్నాము. నిజానికి




## స్వామి వారి వెక్కిరింత నవ్వు

మేము వేదాంత్ నుండి సారీని ఊహించాము. కాని అలా జరగలేదు. పైగా ఆ తప్పు మా పైనే నెట్టివేశాడు. దీనితో అలాగే చూస్తూ స్వామివారిని ప్రార్థించాను. ఇంతలో నా నుండి కొంత దూరములో వేదాంత్ వెనకాల, ఒక ప్రక్కకు శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా దర్శనమిచ్చాడు. ఆయన నా వంక ఓరకంట చూస్తూ ముసి ముసిగా నవ్వాడు. ఒకరకంగా "చూడు నీ పుత్రుల మనస్తత్వం? సారీ చెప్తాదురని ఆశించావు కదా! ఏమైంది" అని ఎగతాళిగా ముసిముసిగా నవ్వుచున్నట్లు భావమేర్పడ్డది. రెండు క్షణాలు ఈ రూపం కనబడి మాయమైంది. ఇది నేను మాత్రమే చూడగలిగే లీల, మరియు స్వామివారు సహజ రూపముగా కాకుండా రేఖా చిత్రంగా, ప్రత్యేకించి ఈ సందర్భము కోసమే అన్నట్లు దర్శనమిచ్చారు. వెంటనే ఒక హృదయాంతర భావం ఈ విధంగా ఏర్పడ్డది. "ఓయీ...! లోకం నడిచే క్రమంలో నీవు ఇద్దరు పుత్రులకు జన్మనిచ్చినంత మాత్రాన వారు నీవారు కారు, నీ మాట వినరు, లోబడి ఉండరు" అనే భావమేర్పడ్డది. దీనర్థం : పుత్ర వ్యామోహం త్యజించి తామరాకుపై నీటిబొట్టు లాగా, అంటీ అంటనట్లు జీవితాన్ని గడుపుచూ లక్ష్యం వైపు పయనించమన్నారు. పైగా దీనిని నా జీవితాంతం గుర్తు పెట్టుకొమ్మని పదే పదే చెప్పారు.

ఆ తరువాత నేను ఇదంతా శ్రీవేంకటేశ్వరుని లీలయని, పిహెచ్.డి చేయుటకు శిక్షణ అని భావించాను. నిజానికి మా పుత్రులు గత 5 సంవత్సరాల నుండి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నప్పటికీ వారికి ఆర్థిక స్తోమత లేదని భావించి ఖర్చు చేయుట నా పుత్ర వ్యామోహానికి నిదర్శనం. ఈ లీల తర్వాత వారికి డబ్బు ఇవ్వబుద్ధి కాలేదు. స్వామివారికి ఖర్చు పెట్టాలనిపించింది. ఇదే నా ధర్మం అనిపించింది.

ఈ సంఘటన నా మానసిక స్థితిని మార్చి వేసింది. ఇంతకుముందు భగవంతుడే సన్నిహితుడు, ఇతరులు ఇలా వచ్చి అలా పోయేవారు అని ఎన్నో పుస్తకాలలో చదివినప్పటికీ అది మనస్సుకెక్కలేదు. కాని ఇప్పుడు ప్రత్యక్షంగా చూచేసరికి బాగా అర్థం అయింది. తనవరకు వస్తే కాని తెలియదన్నట్లు ఈ సంఘటన నన్ను మార్చింది. పైగా నీ కొడుకు చిన్నపిల్లవాడు అని చెప్పుటలో నన్ను ఊరడించినట్లు అయినప్పటికీ స్వామివారు నా బాధను తాత్కాలికంగా చల్లబరుచుటకు చూపాడని భావించాను. ఇప్పుడు నిజం తెలిసింది. ఎవరు ఆప్తులు, ఎవరు కాదు అని తెలిసింది. మన బాధ్యతలను మనము నిర్వహించాలి. పిల్లలను కనుట, వారికి తగిన విద్యాబుద్ధులు నేర్పించుట, చివరికి ఒక ఇంటివారిని చేయుట వరకే మన బాధ్యతలు. ఆ తరువాత వారిది వేరు, మనది వేరు. వారి విషయములో తల దూర్చరాదు, ఆధిపత్యము చెలాయించరాదు, వదిలివేయాలి.

ఇప్పటినుండి నా జీవిత ధ్యేయం శ్రీవేంకటేశ్వరునికి సేవ చేయుట, ఆయనకు మరింత దగ్గరగుచు ఈ జీవితమును సద్వినియోగం చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. స్వామి లీలలను పొందే స్థితి నుండి స్వామివారిని పొందే స్థితికి చేరాలనుకున్నాను. నా సర్వసంపదకు వారసుడు శ్రీవేంకటేశ్వరుడే అనే భావన బలపడ్డది. కళ్యాణాలను మరింత గొప్పగా, ఎన్నో రకాల అలంకరణ సామగ్రిని తయారు చేసి, మనోరంజకంగా చూపరులకు ఉత్సాహభరితంగా చేయాలనుకున్నాను. ఖర్చులను చాలా వరకు మేమే భరిస్తూ నిర్వహించువారికి వీలైనంత తగ్గించాలని అనుకున్నాను.

**నా దశ :** శ్రీవేంకటేశ్వరుడు మా ఇంటికి వస్తానన్నమాట నిజమని తెలిసింది. వికారాలను తొలగించుకుని యోగ్యతను సాధించాలని భావించాను. నా ప్రయత్నాలకు స్వామివారి సహాయము తోడైంది. మొదటి సంకల్ప ఫలితాన్ని భాగవతులకు పంచమన్నాను. రెండవ సంకల్పం లభించింది. తామరాకుపై నీటిబొట్టులాగా జీవితాన్ని గడపమన్నారు.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**

**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**


**ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,**

**హైదరాబాద్. ఫోన్: 040-27175050**

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 24వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మా నుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050


ఈ కార్యక్రమం గురించి
పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**



# సంక్రాంతి సంబరాలు

**– డా|| దేవులపల్లి పద్మజ, 9849692414**

సఖ్యతతో సంతోషాన్ని సహకార వితరణ చేయడమే సంక్రాంతి సంబరం. శాంతి, సౌభాగ్యం, ఐకమత్యం కలగలసినదే పండుగ. అందరూ పండుగగా వ్యవహరించే ఉత్సవాలు వ్యక్తిగతంగాను, కుటుంబపరంగాను, బంధుగతంగానూ జరుపుకుంటూ ఉంటాము. అంతవరకూ ఉన్న కష్టాలు మరిచి అందరితో కలిసిమెలిసి ఆనందం పంచుకునే దినమే పండుగ. ఈ పండుగ క్రమంలో వచ్చే ముఖ్యమైన పండుగలలో సంక్రాంతి ఒకటి. ''సమ్యక్ క్రాంతి – సంక్రాంతి''. సమ్యక్ అంటే బాగుగా లేదా మేలైన, ఉత్తమమైన అని అర్థం చెప్పవచ్చును. క్రాంతి అనగా పుట్టుక, జీవించుట లేదా వెలిగించుట అనే అర్థాలు చెప్పవచ్చును. వెరసి సమ్యక్ క్రాంతి అనే పదానికి బాగుగా ఆనందం జనించునది అని అన్వయించుకోవచ్చును.

సూర్యుడు తన ప్రయాణంలో ఒక రాశినుండి మరొక రాశిలోనికి ప్రవేశించడాన్ని సంక్రమణం లేదా సంక్రాంతి అంటారు. ధనుస్సు రాశి నుండి మకరరాశి లోనికి మకర సంక్రమణం సంభవించి, ఉత్తరాయణ పుణ్యకాలం ఆరంభమై మనం ఆచరించే ''సంక్రాంతి'' పండుగ వస్తుంది. సూర్యగమనం ఉత్తరాయణ, దక్షిణాయనాలు నిర్ణయిస్తే, చంద్రగమనం మాసాలు నిర్ణయిస్తుంది. సూర్యుడు ధనుస్సు రాశిలో సంచరిస్తుండగా ధనుర్మాసం జరుగుతుంది. ఈ ధనుర్మాసం ముగియగానే సంక్రాంతి శోభలు ప్రారంభమవుతాయి.

కాలచక్రంలోని రాశులలో మకరరాశి సర్వ శ్రేష్ఠమైనది. శ్రవణా నక్షత్రంలో ఉద్భవించిన శ్రీమన్నారాయణుడు అనంత పద్మనాభునిగా బ్రహ్మకు సాక్షాత్కరించినది శ్రవణా నక్షత్రంలో. ఈ నక్షత్రం మకరరాశికి చెందినది. ఈ కారణం చేత శ్రీమహావిష్ణువు యొక్క రాశి మకరరాశి. దీనిని మానవుని శిరస్సుగా భావిస్తారు. అటువంటి మకరరాశి లోనికి సహస్ర కిరణుడైన సూర్యభగవానుడు ప్రవేశించే మహత్తర పుణ్యదినం కాబట్టి, ప్రతి వ్యక్తిలో ఆధ్యాత్మిక భావనలను పెంపొందించటానికి అత్యంత అనువైన కాలం. వేదకాలం నుంచి శిష్యులు సరైన గురువు కోసం అన్వేషించటం, గురూపదేశం పొందటం, వేదపారాయణలు సాగించటం వంటివి ఈ సమయంలోనే


ఆరంభమవుతాయి.

జగత్తు జలమయమైనప్పుడు శ్రీమన్నారాయణుడు ఆదివరాహమూర్తిగా అవతరించి భూమిని ఉద్ధరించిన రోజు సంక్రాంతి. వామనావతార ఘట్టములో వామనుడికి బలిచక్రవర్తి మూడడుగుల భూమిని దానం చేసినది, వామనుడి పదఘట్టనతో పాతాళానికి చేరినది ఈరోజే. దీనికి సంకేతంగా మనం సంక్రాంతి పర్వదినం జరుపుకుంటాము. ఈ పండుగ భోగి, సంక్రాంతి, కనుమ అని మూడు రోజులుగా జరుపుకునే పర్వదినం.

## భోగి పండుగ

భోగి పండుగ పేరు చెప్పగానే మనకు స్ఫురించేవి భోగిపళ్ళు, భోగిమంటలు. ఆవుపేడతో పిడకలు తయారు చేసి యజ్ఞదేవతను తలుచుకుంటూ, పాప ప్రక్షాళన జరిపించమని వేడుకుంటూ, ధర్మమార్గ పయనానికి సమాయత్తమవుతూ సూర్యోదయం సమయంలో మంటలో వీటిని వేస్తారు. పిల్లలు, పెద్దలు అందరూ ఈ మంట చుట్టూ చేరి ఆనందోత్సాహాలలో మునిగిపోతారు. ఈ మంటలలోనే పాతబడిన సామానులను కూడా వేసే సాంప్రదాయం కనబడుతుంది. నూతనత్వానికి ఆహ్వానం పలకాలంటే పాతదనాన్ని విడనాడాలి. ఈ మంటలు వేదకాలం నాటి ఋషులు తాము సంవత్సరారంభంలో వ్రేల్చిన 'ఆగ్రహాయణి' హోమాగ్నికి ప్రతిరూపం. హోమభస్మం మంత్రసారము, అతి పవిత్రమైనది. మంటలు శాంతించిన తరువాత ఈ హోమ భస్మాన్ని దైవప్రసాదంగా భావించి నుదుటిన ధరిస్తారు. పిల్లలకు కూడా నుదుటి మీద ఉంచి వారి ఆయురారోగ్యాలకై ప్రార్థిస్తారు.

దేవతారాధన, నూతన వస్త్రధారణ, పిండివంటలతో భోజనము వగైరా పూర్తి చేసుకుని సాయంకాలం ''భోగిపళ్ళు'' వేడుక జరుపుతారు. పిల్లలను ఆశీర్వదిస్తూ పెద్దలంతా వారి శిరస్సుపై రేగిపళ్ళను పోస్తారు. రేగిచెట్టును సంస్కృతంలో బదరీవృక్షం అని పిలుస్తారు. ఈ వృక్షం విష్ణుప్రీతికరమైనది. ఈ రేగిపళ్ళతో పాటు చిల్లరపైసలు, నానపెట్టిన శనగలు, పువ్వులు పిల్లల తలపై పోస్తూ, శ్రీమహావిష్ణువులాగా తేజరిల్లాలని ఆశీర్వదిస్తారు. తరువాత ముత్తైదువలకు తాంబూలాలు ఇచ్చి సంతోషపరుస్తారు.



## సంక్రాంతి పండుగ

రెండవ రోజున సంక్రాంతి పండుగ. పండుగలో ప్రతిరోజుకూ ఒక ప్రత్యేకత ఉంటుంది. వ్యవహార నియమ నిబంధనలుంటాయి. స్నానాదికాలు ఎలా ఆచరించాలి? ఎటువంటి పూజలు ఆచరించాలి? ఎటువంటి దానధర్మాలు చేయాలి? అనేవి మన శాస్త్రాలు విపులంగా వివరించాయి. ఇవి శారీరక దారుఢ్యాన్ని పెంపొందించి, వాతావరణ సమతుల్యత కాపాడుతూ, సమతను పెంపొందిస్తాయి. నువ్వుల నూనెతో అభ్యంగన స్నానం శారీరక రుగ్మతలను నివారిస్తుంది. నువ్వులు సేవించటం వలన ఆరోగ్య సమస్యలు తగ్గుతాయి. ఆ రోజు జరిపే శాంతి హోమాలు, మృత్యుంజయ హోమాలు, అభిషేకాలు, వివిధ దైవారాధనలు ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించి, భగవదనుగ్రహానికి తోడ్పడతాయి. పితృదేవత స్మరణ వారి అఖండ ఆశీర్వచనానికి దోహదం చేస్తుంది. మన పెద్దలు మనకిచ్చిన జన్మకు కృతజ్ఞత ప్రకటించటం ప్రతి ఒక్కరి కర్తవ్యం. వారిని స్మరిస్తూ తగిన విధంగా తర్పణాలు విడవటం, వారి జ్ఞాపకార్థం దానధర్మాలు చేయటం శాస్త్ర విధి. పరమేశ్వరుడు అభిషేక ప్రియుడు. సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో చేసే అభిషేకాలకు చక్కటి ఫలితాలుంటాయి. విష్ణువు అలంకారప్రియుడు. రకరకాల పూమాలలతో అలంకరిస్తే, ఆయన అవ్యాజ కరుణ మనపై కలుగుతుందని పురాణ ప్రవచనం. అపాత్రదానం పనికిరాదు. తగినవారికి తగినట్లు దానం చేయాలి. ఎవరి అవసరాన్ని బట్టి వారికి దానం చేయాలి. పేదలకు కంబళ్ళు, వస్త్రాలు దానమివ్వాలి. యోగ్యులైన బ్రాహ్మణులకు శక్తిననుసరించి సువర్ణ, రజిత, కాంస్య దానాలు ఇవ్వాలి. ఈ ప్రకృతిలో లభించే ప్రతి వస్తువు ప్రతి ఒక్కరి సొంతం అనే నిర్వచనానికి ప్రతీకలే దాన ధర్మాలు. పౌష్య, మాఘ మాసముల సంధిలో వచ్చే అమావాస్య నాడు సూర్యుడు మకరరాశిలో ప్రవేశం చేస్తే అట్టి సంక్రమణ కాలమే అర్ధోదయకాలము. ఇది పగటి పూట వస్తే ప్రశస్తము. మధ్యాహ్నమునకు పూర్వమే సంభవించే అర్ధోదయకాలమే పూర్తి ఫలితాన్నిస్తుంది. ఆ సమయంలో ఏ కొంచెం దానమిచ్చినా మేరు పర్వతమంత పుణ్యము వస్తుంది. అర్ధోదయ కాలంలో ''ఏ బ్రాహ్మణుడైనా బ్రహ్మతో సమానం''. ''ఏ పుణ్య జలమైనా గంగతో సమానం'' అని శాస్త్ర వచనం. వేద వచనం. ఈనాడు పాయస దానము, కాంస్య పాత్ర దానము, సువర్ణలింగ దానము, కూష్మాండ

దానము, పెరుగు దానము ప్రశస్తమైనవి.

గొబ్బిళ్ళ సందడి సంక్రాంతి పండుగల వేడుకలో మరొక ప్రధానమైనది. కన్నెపిల్లలు చక్కటి వస్త్ర ధారణతో, తమకు కలిగిన ఆభరణాలతో చూడచక్కగా అలంకరించుకుంటారు. తెలుగుదనం ఉట్టిపడే కన్నెపిల్లలను చూచి కుటుంబ సభ్యులు మురిసిపోతారు. వివాహ వయస్సుకు వచ్చినారని చెప్పకనే చెబుతారు. పెద్దవారికి ఇది ఒక హెచ్చరిక లాంటిది. ఆవు పేడతో గుండ్రముగా బంతులవలె తయారు చేసి, ఇంటి ముంగిట రంగవల్లుల మధ్య అమరుస్తారు. వాటిపై బంతిపూవులు, ఇతర రంగు రంగుల పూలను అలంకరించి, వాటి చుట్టూ తన తోటివారితో, స్నేహితులతో వలయాకారంగా తిరుగుతూ గొబ్బిపాటలు పాడుతూ, లయబద్ధంగా చప్పట్లు చరుస్తూ తిరుగుతారు. ఇది సంధ్యాసమయంలో జరిగే కనుల పంట. చూచినవారిదే భాగ్యం. మహాలక్ష్మికి ప్రీతిపాత్రమైనది. ఈ విధంగా చేయటం వలన కన్నెపిల్లలకు త్వరలోనే చక్కటి వరుడు లభించి వివాహం జరుగుతుందని విశ్వాసం. విజ్ఞాన శాస్త్రపరంగా కూడా ఇది ఎంతో మంచిది. ఆవుపేడ అనేక రకాల క్రిమి సంహారకంగా ఉపయోగపడుతుంది. ప్రతి ఇంటి ముంగిట దర్శనమిచ్చే గొబ్బిళ్ళు స్వాగతం పలుకుతూ, అసలు సిసలైన పండుగ వాతావరణాన్ని తలపిస్తుంది.

''హరి హరి గోవిందా'' అని కీర్తిస్తూ, లయబద్ధంగా చిడతలు వాయిస్తూ, భుజముపైనున్న తంబురను స్వరబద్ధముగా మీటుతూ, అడుగు అడుగులో గజ్జెల సవ్వడి నింపుతూ విలాసంగా సాగిపోయే హరిదాసులు మన సంప్రదాయ చిహ్నాలు. హరినామ సంకీర్తన తప్ప మరొక మాట వారి నోటివెంట వెలువడదు. రంగు రంగుల వస్త్రధారణతో, మెడలో పూలదండలతో హుందాగా నడుస్తూ సాగిపోతారు. శిరస్సుపై చక్కగా పూవులతో అలంకరించిన ఇత్తడి గిన్నెను ధరించి, ఎవరైనా తమంత తాముగా ఏదైనా సమర్పించదలచుకుంటే వంగి లేదా మోకాళ్ళపై కూర్చుండి గిన్నెలోకి స్వీకరిస్తారు. ఎందుకంటే వారి వృత్తి భిక్షాటన కాదు. భగవన్నామ సంకీర్తనా ప్రచారం వారి వృత్తి. ఆయాచితంగా వచ్చినది స్వీకరించటం వారి ప్రవృత్తి. సంప్రదాయాలను గౌరవించే గృహస్థు నిత్యమూ వారికోసం ఎదురు చూచి, తమకు కలిగినది, వారికి సమర్పించుకుంటూ భావితరాలకు ఆదర్శవంతంగా నిలుస్తారు.

## కనుమ

మూడవ రోజు కనుమ పండుగ. కనుమ నాడు మినుము తినాలంటారు. అందుకే ఆవునేతితో తయారు చేసిన మినప సున్ని, బెల్లం గారెలు వంటివి తయారు చేసుకుంటారు. నోరూరించే పదార్థాలు జిహ్వను మరింత పెంచగా మానసిక సంతృప్తితో కడుపారా ఆస్వాదిస్తారు. వ్యవసాయదారులు తమ తమ పశువులను అలంకరించి, వాటిని స్వేచ్ఛగా తిరిగేలా చేస్తారు. బలవర్ధకమైన దాణా వేసి విశ్రాంతిగా ఉండేలా చేస్తారు. వ్యవసాయ క్షేత్రములో వాటి అవసరం లేకుండా పంటలు పండవు. నాగరిక ప్రపంచములో యంత్ర వినియోగం ఎక్కువైనప్పటికీ, పశువుల వినియోగం లేకుండా సాగదు. మనకు జీవనాన్ని, జీవితాన్ని ఇచ్చిన ప్రతి ప్రాణినీ గౌరవించాలనే సత్సాంప్రదాయము మనది. కనుమనాడు కాకి కూడా కదలదు అనే నానుడి ప్రచారంలో ఉంది. శాస్త్రపద్ధతిలో ఆలోచిస్తే దీనికి తగిన కారణం కనబడుతుంది. దైనందిన కార్యక్రమాలకు దూరంగా ఉంటూ, కుటుంబ సభ్యులతో కలిసి మెలిసి ఆనందంగా జీవించటానికి అవకాశం కల్పించేవే కొన్ని కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు. బయటకు వెళ్ళకూడదు అనే నియమం పెడితే చక్కగా ఇంటి వద్దే ఉండి సంతోషంగా గడుపుతారని దీని ముఖ్యోద్దేశము. అంతేకాకుండా మరుసటి రోజున బంధువులు తమ తమ స్వస్థలాలకు వెళ్ళిపోతారు కనుక వారి వీడ్కోలుకు కావలసిన కార్యక్రమ నిర్వహణకు దోహదం చేస్తుంది. వయస్సుతో నిమిత్తం లేకుండా కోడిపందేలాటతో మగవారు ఆనందిస్తారు.

బొమ్మల కొలువు ప్రతి ఇంటా కొలువు దీరుతుంది. సంవత్సరం పొడవునా సేకరించిన రకరకాల బొమ్మలను వరుసలో అలంకరించి హృద్యమైన వాతావరణాన్ని తయారు చేస్తారు. వస్తు గ్రహణ శక్తిని పెంపొందించి, మానసిక శాంతిని కలిగిస్తుంది. సిరిసంపదలు కలుగుతాయని విశ్వాసం. బొమ్మల కొలువు పేరుతో ఇంటిని అందంగా అలంకరిస్తారు. పలువురు విచ్చేసి అలంకరణను వీక్షించి ముగ్ధులౌతారు.

ఇంటిని అలంకరించిన మామిడి తోరణాలు, నూతన వస్త్రధారణలు, వాకిట భోగిమంటలు, వింత శోభలు, నట్టింట్లో నిండు గర్భిణిలా ధాన్యపు గాదెలు, వాకిట్లో హరిదాసులు ఆలపించే హరిభజనలు, తోటల్లో కోడిపందేలు, పెరట్లో పశువుల అలంకారాలు, అత్తింట్లో అల్లుడుగారు ఎక్కే అలకపాన్పు, వంటింట్లో అత్తగారు చేసే నేతి అరిసెల ఘుమ ఘుమలు, అంగట్లో వస్త్ర సంబరాలు, ఆలయాలలో దైవ పూజలు, ముంగిట్లో వయ్యారి భామలు దిద్దే ముత్యాల రంగవల్లులు, రంగవల్లులపై శోభిల్లే గొబ్బిళ్ళు, దాన ధర్మాల తృప్తి పొందిన దాన గ్రహీతలు... కలగలసి మన సంక్రాంతి.

ఈ విధంగా మూడు రోజులు నూతన వస్త్రాలు ధరించి, యథాశక్తి పూజలు, హోమాలు సలిపి, దానాలు చేసి, పశువులను అలంకరించి, అందరితో కలిసి యథాశక్తి పిండివంటలు భుజించి అత్యంత ఆనందంగా గడుపుకుని సంవత్సరమంతా పండుగలా గడవాలని కోరుకుంటారు.

ధారావాహికం



# మార్గదర్శకులు మహర్షులు

డా|| శివానందమూర్తి

**గత సంచిక తరువాయి**

యయాతి కొడుకైన పురూరవుడు భూమిని ఏలుతున్న సమయంలో, ఊర్వశి అతనికి భార్య అయింది. ఇదివరకు దేవేంద్రుడి యొక్క శాపం పొందిన అగ్నివాయువులు, ఊర్వశి యందు మోహం కలిగినటువంటి మిత్రావరుణులు – అంటే సూర్యుడు, వరుణ దేవుడు వీళ్ళు నలుగురూ కలిసి తమ తేజస్సును తీసుకుని, వాళ్ళ వీర్యాలను ఒక కలశంలో పెట్టి ఇచ్చారు. ఆ విషయాన్ని వాళ్ళు మరిచిపోయారు. మరచిపోవటమంటే మిత్రా వరుణులిద్దరికీ ఆమె యందు కలిగిన వ్యామోహాన్ని వీర్యరూపంలో బహిర్గతం చేసి ఆమెను మరచిపోయి శుద్ధులైపోయారని అర్థం. ఆ తరువాత వాళ్ళలో ఆ భావమే ఉండదు. మనుష్యులలో వేరు. అలా ఉండదు. దేవతలు ఒక్కమారే భావాల్ని బహిర్గతం చేసి వదిలేస్తారు. దేవతలకు మాత్రమే ఆ శక్తి ఉన్నది. మునులకు కూడా ఆ శక్తి ఉంటుంది. చరిత్రలో అనేకమంది ఋషులు, తమ వీర్యాలను తీసుకొని నిక్షేపించి వెళ్ళిపోయారు యధేచ్ఛగా. మళ్ళీ వాళ్ళు తిరిగి చూడరు.

ఆ మిత్రావరుణులు తమ మోహాన్ని తీసి అక్కడ కలశంలో పెట్టి వెళ్ళిపోయారు. ఆ కలశంలోంచి అగస్త్య మహర్షి పుట్టాడు. 'అగస్త్యః కుంభ సంభవః' అని నిఘంటువు చెబుతోంది. వసిష్ఠ మహర్షి కూడా ఆ కలశంలోంచే పుట్టాడు. ఊర్వశి యందు మోహం కలిగినటువంటి ఆ ఇద్దరూ దేవతలూ – మిత్రావరుణులు – ఆ విధంగా తమ అంశలను నిక్షిప్తం చేసిన ఆ కలశంలో శాపగ్రస్తులైన అగ్ని వాయువులు కూడా శరీరాలు పొందడం కోసం ప్రవేశించారని అర్థం చేసుకోవాలి. (ఈ దేవతల వీర్యంలో ప్రవేశిస్తే ఉత్తమ జన్మ కలుగుతుంది కదా! అందుకని వాళ్ళు భూలోకంలో పుట్టడానికి శాపగ్రస్తులై వెళ్ళాలి కాబట్టి, అందులో ప్రవేశించారని అర్థం. వాళ్ళకు అది అవకాశం). ఆ నలుగురి తేజస్సుతో అగస్త్య, వసిష్ఠులు ఒకే కలశంలో నుండి పుట్టారు.

పూర్వం ఇంద్రుడు అగ్నివాయువులను 'జడ పదార్థములయిన రాళ్ళలో నుండి గానీ, చెట్లలో నుండి గానీ పుట్టండి – మీ ఇష్టం' అన్నాడు కదా! ఆ మాటలు నిజమై, కుంభమందు నిక్షేపించబడిన వీర్యం నుండి పుట్టారు. 'కుంభం' అంటే జడ పదార్థమే కదా!

(ఇంతకుముందు దేవేంద్రుడి శాపం వలన వరుణుడు, అగ్ని భూలోకంలో పుట్టారు. అంటే అక్కడ లేకుండా పోయినారని అర్థం కాదు. దేవతలు శాపగ్రస్తులై భూమి మీద పుట్టారంటే, అక్కడ వాళ్ళు అలా ఉండగానే వాళ్ళ జీవలక్షణంతో మనిషి శరీరంలోకి వచ్చి ఇక్కడ కూడా బ్రతుకుతున్నారు అని అర్థం చేసుకోవాలి. అలాంటి మానవత్వ లక్షణం వాళ్ళకు శాపంతోటే కలగాలి. లేకపోతే రాదు).

పేరుకు మాత్రం, వాళ్ళ పుట్టుకకు ఊర్వశి కారకురాలు. పరోక్షంగా ఆమె కారకురాలు. ఆవిడకు వీళ్ళెవరో తెలియదు. వీళ్ళకు ఆవిడెవరో తెలియదు. ఆవిడ పేరు మీద అగస్త్యుడికీ, వసిష్ఠుడికీ 'ఔర్వశేయులు' అని పేరు వచ్చింది. ఊర్వశి కారణంగా పుట్టారని అర్థం. మరి వీర్యం ఎవరిది అంటే మిత్రా వరుణులది. అందుకని వాళ్ళిద్దరికీ 'మైత్రావరుణులు', అంటే 'మిత్రావరుణుల' పుత్రులు అని పేరొచ్చింది. కుండలో పుట్టడం చేత 'కుంభసంభవులు' అని పేరొచ్చింది. వాళ్ళు చక్కగా పెరుగుతున్నారు. వాళ్ళు దేవతలే కాబట్టి భౌతికమైన వాసనలు, భూలోకానికి చెందిన, శరీరానికి సంబంధించిన దోషాలు ఏమీ అంటలేదు. చిన్నప్పటినుంచీ యోగము, జ్ఞానము, తపోనిష్ఠ, అగ్నిహోత్రము వలె వెలుగుతున్న తేజస్సు, పవిత్రత – ఇవన్నీ వాళ్ళయందు ఉన్నాయి. దేవతలే వాళ్ళను చూస్తున్నారు ఎలా పెరుగుతున్నారో అని. ఆ సమయం రాగానే వాళ్ళే పేరు పెట్టారు. అన్నప్రాశన చేశారు. సమయం రాగానే దేవతలే ఉపనయనం కూడా చేశారు. అలా పెరిగారు వాళ్ళు.

అగస్త్యుడు తన ఇంద్రియాలను జయించి, ఆహారాన్ని త్యజించి, యోగబలం తోటే పెరగటం మొదలుపెట్టాడు. అప్పుడు అతడు బ్రహ్మచారి. అడవిలో తిరుగుతూ ఉండేవాడు. అలా అడవిలో తిరుగుతున్నప్పుడు ఒక మహావృక్షాన్ని చూచాడు. ఆ వృక్షానికి ఉన్న కొమ్మలు నాలుగు దిక్కులా వ్రేలాడుతూ చాలా దూరం వరకూ వ్యాపించి ఉన్నాయి. కొందరు ఋషులు కాళ్ళతో



కొమ్మలను పట్టుకొని తల క్రిందులుగా వ్రేలాడుతున్నారు. అగస్త్య మహర్షి అక్కడికి వెళ్ళి "మహాత్ములారా! ఏమిటి మీకీ దురవస్థ? మీరు మీ కాళ్ళమీద నిలబడలేరా? ఎందుకలా వ్రేలాడుతున్నారు? మీకు ఏదయినా శాపమా? ఎందుకు" అని అడిగాడు.

అప్పుడు వాళ్ళు "నాయనా! పితృ లోకంలో ఉండే పితృ దేవతలము మేము. పితృదేవతలకు ఆరాధన తగ్గిపోవటం చేత, ఇక్కడ భూలోకంలో సంతానాభివృద్ధి లేకపోవటం చేత, మాకు నీళ్ళు వదిలిపెట్టేవాళ్ళే లేక పితృ లోకాల నుంచి భూలోకానికి వచ్చి అథోగతి పాలై ఇలాగ ఉన్నాము. ఎవరైనా ఒక మహాత్ముడు మమ్ములను తండ్రులుగా భావించి, వివాహితుడై, సంతానవంతుడై మాకు తర్పణమిచ్చిననాడు మాకు ఊర్ధ్వ లోకాలు లభిస్తాయి. అలా ఎవరో సామాన్యుడు చేస్తే సరిపోదు. నీవంటి మహాత్ముడు చెయ్యాలి. కాబట్టి కారణజన్ముడవయిన నిన్ను మేము ప్రార్థిస్తున్నాము. నీవు ఈ పని చెయ్యాలి. నీవు పుడుతున్నావని తెలియగానే మాకు ఆశ చిగురించింది. మా పితృ లోకాలకు మేము వెళ్ళగలుగుతామని అనిపించింది" అన్నారు.

పితృ లోకంలో ఎప్పుడూ అయిదుగురు దేవతలు శాశ్వతంగా ఉంటారు. ఇక్కడ చనిపోయిన జీవులు ఆ పితృ లోకాలకు వెళ్ళి ఆ పితృదేవతల సంరక్షణలో ఉంటారు. ఆ దేవతలకు ముందర నమస్కరించి తర్పణము ఇచ్చి, తరువాత మనం ఇక్కడనుంచి వెళ్ళిపోయిన మన తాతలకు ఇస్తాము.

వాళ్ళు ఇంకా అతనితో ఇలా అన్నారు. "భూ స్పర్శ లేకుండా ఇక్కడ ఉన్నాము మేము. నిన్ను వెతుక్కుంటూ ఎక్కడికి రాగలము మేము? నువ్వు ఎప్పుడు వస్తావా అని ఎదురు చూస్తున్నాము. నువ్వు బ్రహ్మచర్య దీక్షలో ఉన్నావు. అలా కాకుండా నీవు వివాహం చేసుకుని సంతానాన్ని కని మమ్మల్ని రక్షించమని కోరుతున్నాము".

"అలాగే మహాత్ములారా! మిమ్మల్నందరినీ నా తండ్రులుగా భావించి నేను వివాహం చేసుకుని, సంతానాన్ని కని, మీ వంశంలో సంతానంగా నేను వాళ్ళను అంకితం ఇచ్చి మిమ్మల్ని ఊర్ధ్వలోకాలకు పంపిస్తాను" అన్నాడు అగస్త్యుడు.

వివాహం చేసుకోవటానికి తనకు తగిన కన్యక కోసం ఆయన వెతికితే, భూలోకంలో ఎవరూ కనబడలేదు. ఎంతమందిని, ఎన్ని గోత్రాలను విచారించినా వాళ్ళ దగ్గర ఏదో దోషం, ఏదో అజ్ఞానం, ఏదో లోపం ఉంది.

అప్పుడు ఆయన విదర్భ దేశం వెళ్ళాడు. ఆ దేశపు రాజుకు సంతానం లేక దుఃఖిస్తున్నాడు. ఆ రాజు చేతిలో విభూది పెట్టి "నీకు మంచి ఆడపిల్ల పుడుతుంది. ఆమెను నాకు ఇచ్చి వివాహం చెయ్యి" అని తన సంకల్పంతో ఆ జీవుణ్ణి రూపకల్పన చేశాడు. తనకు తగినటువంటి భార్యను ఊహించి, ఇలా ఇలా ఉండాలనే భావంతో చేశాడు. తపస్సుకు, యోగానికీ అసాధ్యమనేది లేదు. అవి శాశ్వత సత్యాలు. ఇప్పుడైనా, ఎప్పుడైనా సాధ్యమే. భవిష్యత్తులో ఎంత అధర్మం ఉన్నా, అజ్ఞానం ఉన్నా యోగం మాత్రం నశించే విద్య కాదు. సజీవంగా ఉండే విద్య. అదే ఆర్ష సంప్రదాయం. ఈ సత్యం బాగా గుర్తు పెట్టుకోవాలి. ఇవన్నీ వట్టి కథలేమో అనుకోరాదు. ఋషుల యొక్క చరిత్రలు సత్యము యొక్క చరిత్రలు.

అలా జన్మించిన ఆ విదర్భరాజు కూతురుకు "లోపాముద్ర" అని పేరు పెట్టారు. ఆమె సాక్షాత్తూ లక్ష్మీదేవిలా ఉంది. ఒకనాడు అగస్త్యుడు వచ్చాడు. ఆయన వరమిస్తేనే పుట్టిన పిల్ల కదా మరి! అందుకనే ఆయన రాగానే కాళ్ళు కడిగి – ఈ కన్యను భార్యగా స్వీకరించండి అని అనాలి. కాని రాజు అలా అనలేదు. అగస్త్యుడు ఎలా పుట్టాడో అలానే ఉన్నాడు. ఈ చక్కని చుక్కను తీసుకుని వెళ్ళి ఆయనకు ఇవ్వటానికి తల్లితండ్రులకు కొంచెం కష్టం అనిపించింది. వాళ్ళకు కన్న కూతురు కదా! అందుకని. "అయ్యో! ఇంత ముద్దుగా ఉండే పిల్లను మీకెలా ఇమ్మంటారు స్వామీ? మేము ఈ దేశాన్ని ఏలే రాజులం. ఈ సుకుమారి, ఈ చక్కని చుక్క మహాభోగాల్లో పెరిగింది. మిమ్మల్ని చూసి జడుసుకుంటుందేమో" అని ఇలాంటి మాటలన్నీ అనడం మొదలుపెట్టారు.

వాళ్ళకైతే అజ్ఞానం ఉంది కానీ, ఆమె కారణ జన్మురాలు కదా! తల్లితండ్రులు ఏదో బ్రతిమాలుతుంటే, ఆమె తల్లితండ్రులతో "నేను కారణ జన్మురాలిని. ఈయనే నాకు భర్త" అని తన నిశ్చయం చెప్పింది. ఆయనకు నమస్కరించింది. అలా ఆ లోపాముద్ర అగస్త్యుడిని వరించింది. ఆయన త్రికాలవేది.

ఆయనది మనుష్య బుద్ధి కాదు. అనేక విషయాలు చూడగలడు. మనుష్య బుద్ధికి కొంతే తెలుస్తుంది. ఒక మాట వింటుంటే దాని వెనకాల ఎన్ని పరిణామాలు ఉన్నవో చూసేదే దివ్యదృష్టి. మాట మాత్రమే అర్థం చేసుకుంటే అది మనుష్య దృష్టి.

(ఇప్పుడు కూడా దేశంలో ఆ విదర్భ ఉంది. నాగపూర్ కు దగ్గరగా బృహన్మహారాష్ట్రకు విదర్భ రాజధాని కావాలని అనుకున్నారు మహారాష్ట్రులు. నాగపూర్ కు కొంచెం ఎగువగా ఉంది విదర్భ. సిద్ధతీర్థం అనేది ఒకటుంది. దానికి ఇప్పుడు మరో పేరు ఉంది. అది ఇప్పుడు కూడా ఉంది. అక్కడ జరిగింది వాళ్ళ వివాహం. అగస్త్యుడు లోపాముద్రను వివాహం చేసుకున్న స్థానం కాబట్టి ఆ సిద్ధ తీర్థాన్ని స్మరణ చేసుకున్నా, అక్కడికి వెళ్ళి స్నానం చేసిన కన్యకు అత్యుత్తమమైన వరుడు లభిస్తాడని, వరుడికి కూడా అత్యుత్తమమైన వధువు లభిస్తుందని మహారాష్ట్రుల విశ్వాసం. ఇప్పటికి కూడా వాళ్ళు అలా చేస్తారు. హరిశ్చంద్ర చక్రవర్తి భార్యకు కూడా వైదర్భి అని పేరు. ఆవిడ పుట్టిల్లు కూడా అదే. అయితే నేటి అరుణాచల్ ప్రదేశ్ లో అతి ప్రాచీనమైన మరొక విదర్భ ఉంది. రుక్మిణి ఆ విదర్భకు చెందినది. ఆమెకు కూడా 'వైదర్భి' అనే పేరు ఉంది).

అలా అగస్త్యుడి వివాహం అయిపోగానే, చాలా కొద్దిగా ఎంత ఉండాలో అంతే ఆభరణాలు ఆమె ఒంటిపై ఉంచి, ఒక రెండు నార చీరలు మాత్రం ఆమెకిచ్చి, ఆమె కాలికి ఉన్న అందెలు, రత్నాలు, మంజీరాలు అన్నీ తీసివేయించి తల్లితండ్రులకు ఇప్పించాడు అగస్త్యుడు. ఆమె తల్లి చేత ఆమెకు కుంకుమ బొట్టు పెట్టించి కాళ్ళకు పసుపు రాయించి, తన దర్భలకట్ట ఆమె చేతికిచ్చి, "ఇదే నువ్వు నాకు చేసే సేవ – నాతో రా!" అని తనతో తీసుకెళ్ళిపోయాడు. అలా తిన్నగా గంగానది ఒడ్డుకు వెళ్ళిపోయాడు. గంగా ముఖద్వారం దగ్గరికి వెళ్ళి అక్కడ ఆశ్రమం కట్టుకున్నారని పురాణంలో ఉంది. అక్కడికి వెళ్ళి ఆశ్రమంలో కాపురం పెట్టాడు. అలా ఆయన ఆశ్రమ జీవితం చక్కగా గడిచిపోతోంది.

అప్పుడు ఆయనకు పితృదేవతలకు తను చేసిన వాగ్దానం జ్ఞాపకం వచ్చింది. ఆయనతో లోపాముద్రాదేవి "ఏమండీ! భర్తతో ప్రేమతో కలిసి తిరగాలనే ముద్దు ముచ్చటలు ఆడదానికి ఉంటాయి కదా! ఆభరణాలు అవీ లేకుండా ఇలా జడధారి వలె – సన్యాసిని వలె నేను ఉంటే కాపురం చేయటమేమిటి? పిల్లల్ని కనటమేమిటి? లోకం తీరు మీకు తెలియదు. ఇదంతా లోకంలో సహజంగా ఉంటుంది. నేను లోకంలో ఒకరింట్లో పుట్టి పెరిగాను. ఏవైనా నగలు – కాసులపేరు, గొలుసు, ముక్కుపుడక, చెవులకు దుద్దులు – ఇలాంటివి ఉండాలి కదా! ఏమిటి ఇది? జడధారిగా ఉంటే ధర్మపత్నిని అని ఎలా అనిపిస్తుంది? నాకేమి ఇచ్చారు మీరు?" అన్నదట.

అగస్త్యుడు కావాలనుకుంటే కుబేరుణ్ణి పిలిపించి కనకవర్షం కురిపించగలడు. ఆయన ఆమెతో "ఇలాంటి వాటికోసం తపస్సు సులభంగా ఖర్చుపెట్టుకోకూడదు. లోపాముద్రా! ఆభరణాల లాంటివి ఏ రాజుని అడిగినా ఇస్తాడు. వీటిని తపస్సు చేసి సంపాదించనక్కరలేదు. ఎదుటి వాళ్ళ దగ్గరికి వెళ్ళి దేహీ అంటే ఇస్తారు. అడిగితే ఇచ్చేవాళ్ళుండగా యోగాన్ని ఖర్చు పెట్టుకోకూడదు కదా!" అని అన్నాడు. తపస్సు ఖర్చు పెట్టుకునే విషయంలో లోభి అతడు.

తరువాత అగస్త్యుడు దగ్గరలోనే ఉన్న శ్రుతర్వుడు అనే రాజు దగ్గరికి వెళ్ళాడు. ఆయనతో "నాకు కొంచెం ధనం కావాలి" అని అడిగాడు. శ్రుతర్వుడు దాతే. ఆయన ఈయనను చూచి "ఈయన సర్వ సమర్థుడు, నాకే కనకవర్షం ఇవ్వగలిగినవాడు. ఈయన వచ్చి నన్ను అడుగుతున్నాడు. నా దగ్గర ఉన్నది ఇచ్చేస్తే ఎలాగ? అసలు ఉన్నవాడికి ఇవ్వటమేమిటి? లేనివాడికి ఇవ్వాలి కాని" అని లోపల అనుకున్నాడు. అంత ధనం తనవద్ద లేదన్నాడు. ఆ ఇద్దరూ బ్రధ్నశ్వుడు అనే రాజు దగ్గరికి వెళ్ళారు. ఆయన దగ్గర కూడా ఎక్కువ లేకపోవటం చేత ముగ్గురూ కలిసి త్రసదస్యుడు అనే రాజు దగ్గరకు వెళ్ళారు. అక్కడా అదే పరిస్థితి. అప్పుడు వాళ్ళందరూ, ఆయన ధనం సంపాదించడానికి ఏం చేస్తాడో, ఎక్కడికి వెళతాడో చూద్దామని ఆయనతో పాటే వెళ్ళారు. ఆయన ధనమడిగితే తాము లేదన్న తరువాత ఆయనకు కోపం వస్తుందేమోనని వాళ్ళ భయం. ఆయన జగత్ప్రసిద్ధుడు. మహాజ్ఞాని. ఎక్కడికి వెళతాడో – ఇంకెవరైనా ధనమిస్తారా? ఇస్తే ఎలా ఇస్తారు? ఎలా పుచ్చుకుంటాడో చూద్దామని ఆయనతో పాటు వెళ్ళారు వాళ్ళు. నలుగురూ కలిసి ఊళ్ళో ఎవ్వరూ ధనం ఇవ్వటం లేదు కదా అని అడవిలోకి వెళ్ళారు.

ఇలా ఉండగా మణిమతి అనే పట్టణాన్ని పరిపాలించే ఇల్వలుడు అనే రాజు చాలా బలపరాక్రమ సంపన్నుడు. అతడికి వాతాపి అనే తమ్ముడున్నాడు. వాళ్ళు రాక్షసాంశలో పుట్టడం చేత వాళ్ళకు చాలా శక్తులున్నాయి. వాళ్ళు కుక్క, గాడిద మొదలైన జంతువుల రూపంలోకి వెళ్ళగలరు. ఏ రూపంలోకైనా మారిపోగలగటమే కామరూపం అంటే. అలాంటి శక్తి వాళ్ళది.

ఇల్వలుడు బాగా తపోబల సంపన్నుడైన ఒక బ్రాహ్మణుడి దగ్గరకు వెళ్ళి అతడిని ఆశ్రయించి, అన్ని కోరికలూ తీర్చగల మంత్రమేదయినా ఇమ్మని అడిగాడు. అప్పుడు "నేను కష్టపడి సంపాదించుకున్న తపస్సు నీకిస్తానా? నీకు మంత్రోపదేశం చేస్తే ఎలా వాడుకుంటావో తెలియదు. నువ్వు రాక్షసాంశతో ఉన్నావు. నేను నీకు అలాంటి మంత్రం చెప్పను" అన్నాడట ఆ బ్రాహ్మణుడు.

అప్పుడు బ్రాహ్మణుడి మీద కోపంతో ఇల్వలుడు వాతాపిని ఒక మేకగా మార్చేసి, ఆ బ్రాహ్మణుని దగ్గరకు వెళ్ళి అతడితో "ఇవాళ మా ఇంట్లో పితృపర్వం ఉంది" రమ్మని ఆ బ్రాహ్మణుడిని పిలిచి,

ఆ మేకను వండి ఆ బ్రాహ్మణునికి పెట్టాడు. పితృకార్యం కదా! ఆ కాలంలో పితృకార్యం నాడు మేకను చంపటం – పితృదేవతలకు నైవేద్యం పెట్టటం, ఆ బ్రాహ్మణుడు దానిని కొద్దిగా ప్రసాదంగా తినటం ఆచారం. అతడు తిన్న తరువాత ‘‘వాతాపీ! బయటకు రా’’ అని పిలిచాడు ఇల్వలుడు. అప్పుడు వాతాపి బ్రాహ్మణుడి పొట్టను చీల్చుకుని బయటకు వచ్చాడు. మళ్ళీ వాతాపిగా మారిపోయాడు. ఆ బ్రాహ్మణుడు చనిపోయాడు. బ్రాహ్మణులకు ఈ ప్రకారంగా వాళ్ళు ఆతిథ్యం ఇవ్వటం మొదలుపెట్టారు. ఈ రకంగా చాలామంది వాళ్ళ చేతుల్లో చచ్చిపోయారు. ఒక బ్రాహ్మణుడిని మంత్రవిద్య అడిగితే చెప్పలేదని, వాడికి ఆ బ్రాహ్మణుల మీద కక్ష వచ్చింది. ‘‘ఈ బ్రాహ్మణులకు ఇన్ని మంత్రవిద్యలున్నాయి, నేను అడిగితే చెప్పలేదు’’ అని వారిపై కోపం.

అగస్త్యుడికి కూడా ఇలాంటి మర్యాదే చేద్దామని వాళ్ళకు బుద్ధి పుట్టింది. అగస్త్యుడు ఇల్వలుడి దగ్గరకు వెళ్ళి తనకు కొంత ధనమియ్యమని అడిగాడు. ఇల్వలుడిని ధనం అడిగితే, ‘‘దానిదేముంది స్వామీ! ముందర భోజనం చేయండి మా ఇంట్లో’’ అన్నాడు. వాతాపిని మేకగా మార్చి, చంపి వండి భోజనం పెట్టాడు. అగస్త్య మహర్షి కడుపునిండా తినేశాడు.

ఆతిథ్యం ఎవరైనా ఇవ్వవచ్చు. ఎవరైనా స్వీకరించవచ్చు. తినే అధికారం బ్రాహ్మణుడికి ఉంది. అనేకమంది అగస్త్యుడికి ముందే చెప్పారు. ‘‘మీరు మహాత్ములు, నిష్కారణంగా ఇల్వలుడు అనేకమంది బ్రాహ్మణులకు ఇలాగే ఆతిథ్యం ఇచ్చి చంపేశాడు. బ్రాహ్మణులు తిన్న తరువాత ‘‘వాతాపీ రా!’’ అని పిలుస్తాడు. వాడేమో పొట్ట చీల్చుకుని వస్తాడు. మీ గతి కూడా ఇలాగైతే ఎలా?’’ అని వారంటే ‘‘మీరేమీ భయపడకండి’’ అన్నాడు అగస్త్యుడు.

వాతాపిని తిన్న తరువాత ‘‘వాతాపి జీర్ణం, వాతాపి జీర్ణం, వాతాపి జీర్ణం’’ అని పొట్టను మూడు మార్లు నిమురుకున్నాడు అగస్త్యుడు. వాతాపి లోపల జీర్ణమైపోయాడు. ‘‘వాతాపీ రా! రా!’’ అంటే రావటం లేదు. ఇంకేమి వస్తాడు? అగస్త్యుడి కడుపులో సముద్రాలే ఇంకిపోయాయి. ఇక వాతాపి ఒక లెక్కా ఏమిటి? ఇల్వలుడు వెళ్ళి అగస్త్యుడి కాళ్ళ మీద పడ్డాడు. ‘‘నాకు బుద్ధి వచ్చింది. అపరాధం చేశాను. నన్ను బతకనివ్వండి. ఏం చెయ్యాలో చెప్పండి’’ అంటే ‘‘ఏం లేదు, కొంచెం ధనం అవసరమై తిరుగుతున్నాను’’ అన్నాడు అగస్త్యుడు.

**–శివానంద సువిధ ఫౌండేషన్ సౌజన్యంతో**

**(సశేషం)**


# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



‘శ్రీ వేంకటేశం’ మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.


ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



# విష్ణుప్రియం – తిరుప్పావై

– చింతలపాటి శివశంకర శాస్త్రి

"మృగశిర" నక్షత్రముతో కూడిన పూర్ణిమ గల మాసమును మార్గశిర మాసమంటారు. ఈ మాసం విష్ణువుకు ప్రీతికరం. 'మార్గ' మనగా దారి. 'శిర' మనగా తల. మానవ శరీరమునకు శిరము ఏ విధంగా దిశా నిర్దేశం చేయునో, అదేవిధంగా ఈ మాసం ఆధ్యాత్మికత వైపు దారి చూపుతుంది. భగవదారాధనకు విశేషమైన కాలం. సౌరమానం ప్రకారం ధనుర్మాసమని అంటారు. ధనుః + మాసం = ధనుర్మాసం. 'ధను' అనగా దేని కొరకు ప్రవేశించెదమో అని అర్థము. ఆధ్యాత్మికత కొరకు, భక్తి ప్రపత్తుల కొరకు ఈ మాసం లోనికి ప్రవేశించెదరు కావున ఇది ధనుర్మాసమైంది. ధనుర్మాసంలో నారాయణుని ఆరాధన విశేష ఫలాన్నిస్తుంది.

"మా సానాం మార్గశీర్షోహం... ఋతూనాం కుసుమాకరః" అన్నారు గీతాచార్యులు. మార్గశిర మాసం సాక్షాత్తూ తన స్వరూపమని చెప్పాడు శ్రీకృష్ణుడు. ఈ మాసమునకు మార్గ, సహ, అగ్రహ మణిక అనే పేర్లు కలవు. కైవల్య కారకమైన ఈ మాసం రమణీయం, మహనీయం, కమనీయం మరియు జగద్రక్షాకరం.

ధనుర్మాసంలో విష్ణువును మధుసూదనుడు, వాసుదేవుడు అనే పేర్లతో పూజిస్తారు. ఈ మాసంలో దేవతలను విశేషంగా పూజించాలని, ఆలయాలను సందర్శించాలని పండితులు చెబుతారు. దేశవ్యాప్తంగా అన్ని వైష్ణవాలయాలలోనూ ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ధనుర్మాసం నెలరోజుల పాటు సుప్రభాత సేవను నిలిపి వేసి తిరుప్పావైను పఠిస్తారు. గోదాదేవి స్వామికి సమర్పించిన పాశురాలు అష్టాక్షరీ మంత్ర స్వరూపాలే. వేదోపనిషత్తుల సారమే. నియమ నిష్ఠలతో, భక్తి శ్రద్ధలతో స్వామిని ఆరాధిస్తే, పాశురములను ఆలపిస్తే శుభ ఫలితాలు కలుగుతాయని లోకోక్తి.

"తిరుప్పావై" = "తిరు" అంటే శ్రీ అని, "పావై" అంటే గీతాలు లేదా వ్రతం అని అర్థం. తిరుప్పావైలో ఉన్న పాశురాలు ఛందోబద్ధంగా ఉన్న గీతాలు. మహాభక్తురాలు గోదాదేవిగా జన్మించిన ఆండాళ్ భగవంతునే భర్తగా భావించి, ఎంతో భక్తి పారవశ్యంతో పరమాత్ముని స్తుతించిన పాశురాల సమాహారం. తిరుప్పావై వ్రతాన్ని నియమ నిష్ఠలతో విధి విధానాలతో ఆచరిస్తారు. పరమ పవిత్రమైన ధనుర్మాసం తొలిరోజున ఈ వ్రతాన్ని ఆరంభించి, భోగిరోజున ఆండాళ్ శ్రీరంగనాథుల కళ్యాణం (గోదా కళ్యాణం) తో పరిసమాప్తి చేస్తారు. గోదాదేవి ఆలపించిన తిరుప్పావై లోని ముప్పది పాశురాల్లో అడుగడుగునా భక్తి పారవశ్యం గోచరిస్తుంది. వైదిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక,



సాంఘిక జీవన ప్రతీకలెన్నో ఇందులో పొందుపరచబడ్డాయి. కన్యలు తమకు మంచి భర్త దొరకాలని భగవంతుని ప్రార్థిస్తూ పాడే పాటలివి. పరమాత్ముడొక్కడే పురుషుడు. మిగిలినవారంతా స్త్రీలే. అందరూ ఆ పరమాత్ముని చేరవలసినవారే. కనుక భక్తి సంప్రదాయంలో పావై పాటలకున్న ప్రాముఖ్యం గొప్పది. కన్యల

మనోభావాలు, వారి భక్తి మార్గపు తీరు మొదలైనవన్నీ ఇందులో హృదయంగమంగా వర్ణించబడ్డాయి.

తిరుప్పావై లోని పాశురాలను ఆరు విభాగాలుగా చెబుతారు. మొదటి అయిదు పాశురాలలో ప్రాతిపదిక, జీవన్ముక్తికి కావలసిన హంగులను, మార్గాలను గురించిన ప్రశంస ఉంటుంది. పరమాత్మ తీరును, ఆతని చెంతకు చేరగోరినవారు పాటించవలసిన పద్ధతులు ఇందులో పొందు పర్చింది. జీవాత్మ పరమాత్మలో చేరడమే ఈ భక్తి మార్గం యొక్క లక్ష్యం. గమ్యం. తరువాతి పాశురాల్లో పల్లెపట్టు అందాలను, అక్కడి పడుచులు ఉదయాన చేసే పనులను అందంగా వర్ణించారు. పెరుగు చిలికి వెన్న తీయడం, పాడి పశువులు మేతకు వెళ్ళడం మొదలైన అంశాలు కళ్ళకు కట్టినట్లు పాడుతూ, కన్యలు తోటివారిని లేపుతారు. తరువాతి పాశురాలలో ఉదయకాలపు వర్ణన అందంగా ఉంటుంది. పూలు వికసిస్తున్న తీరు, నక్షత్రాలు కనుమరుగయ్యే పద్ధతి, పక్షుల కిలకిలా రావాలు, కోడి కూతలు, కోయిల పాటలను వర్ణించే ఈ గీతాలు అసలైన జానపద వాతావరణాన్ని మన ముందుంచుతాయి. చిక్కనైన కవితకు ఉదాహరణగా చెప్పుకోవడానికి తిరుప్పావైకి మించింది లేదు. మొత్తం పాశురాలు ఒక నోముకు సంబంధించినవి మాత్రమేనని స్థూలంగా అనిపించే వీలుంది కాని, కవితలుగా అవి అనితర సాధ్యమైనవి. తత్వవిచారణ చేయగలిగేవారికి సముద్రమంత అర్థం కనబడుతుంది. చలిలో స్నానం, పాశురాల గానం, వ్యాఖ్యానం, ముద్గాన్నమనే పొంగల్ ప్రసాదం – అన్నీ కలిసి భక్తుల మనసులను పరమాత్ముని వైపు మరల్చుతాయి. సంక్రాంతి పండుగకు ముందు ముప్పయి రోజులు అనగా డిసెంబర్ లో (మార్గశిర మాసంలో) మొదలవుతుంది. ధనుర్మాసం లేదా 'మార్గళి'. దక్షిణ భారతదేశంలో ఈ కాలం భక్తిభరితమైన కాలం. భక్తికి ఆలంబనగా నడిచే సంగీత, నృత్య, సాహిత్య, సమ్మేళనాలకు అనువైన చక్కని కాలం. ఇందులో బయటకు కనిపించే అర్థం ఒకటయితే, పరమార్థం మాత్రం భగవన్నామ స్మరణమే ప్రధానంగా గోచరిస్తుంది.

పూర్వకాలంలో తమిళనాడులోని విల్లిపుత్తూరు ప్రాంతాన్ని రాణి మల్లి పాలించింది. ఆమెకు విల్లి, కందన్ అనే ఇద్దరు కుమారులు. వారు విలువిద్యలో ఆరితేరినవారు. ఇద్దరూ ఒకనాడు వేటకోసం అడవికి వెళ్ళి జంతువులను వేటాడుతూ, వాటిని తరుముకుంటూ చెరో దారి వెళ్ళారు. ఆ సమయంలో కందన్ పై పులి దాడి చేయగా అతడు మరణించాడు. జంతువులను వేటాడుచూ చాలాదూరం వెళ్ళిన విల్లి అలసిపోయి ఒకచోట నిద్రపోయాడు. ఆ నిద్రలో భగవానుడు కనిపించి ఆ అరణ్య ప్రదేశంలో ఒక కొత్త ఊరును కట్టించమని ఆదేశించాడు. భగవంతుని ఆదేశంపై విల్లి ఒక కొత్త ఊరును కట్టించాడు. విల్లి కట్టించిన ఊరు కనుక ఆ ఊరికి విల్లిపుత్తూరు అనే పేరు స్థిరపడింది. భక్తి సామ్రాజ్యానికి, సంప్రదాయానికి ప్రధానమైనది విల్లిపుత్తూరు.

విల్లిపుత్తూరును ఆవాసంగా చేసుకొని అనంత శక్తిస్వరూపుడైన రంగనాథస్వామి కొలువైనాడు. ఆ ఆలయ అర్చకుడు విష్ణుచిత్తుడు. విష్ణు భక్తులలో అగ్రగణ్యుడు. ఆతని మనస్సు విష్ణు పాదాలయందు, మాటలు విష్ణు సంకీర్తనమందు, చేతులు విష్ణుపూజా మందిరమును శుభ్రపరచుట యందు, చెవులు హరికథలు వినుట యందు, చూపులు గోవిందుని రూపం చూచుట యందు, తల కేశవునకు నమస్కారాలు చేయుట యందు, నాలుక శ్రీనాథుని వర్ణించుట యందు, ఆతని ఆసక్తులు పుణ్యవిషయాల యందు నిమగ్నమై ఉండేవి.

విష్ణుచిత్తుని దంపతులకు చాలాకాలం వరకు సంతానం కలగక పోవడంతో వారు పూజలు, వ్రతాలు చేశారు. ఒకనాడు విష్ణుచిత్తుడు తులసి మొక్కలకు, ఇతర మొక్కలకు పాదులు ఏర్పాటు చేయడానికి మట్టిని తవ్వుచుండగా జనకునికి నాగేటి చాలులో దొరికిన సీత లాగా, విష్ణుచిత్తునికి గోదా తులసివనంలో లభించింది. తమకు భగవత్ ప్రసాదంగా లభించిన ఆ చిన్ని శిశువుకు "కోదై" అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచారు. కాలక్రమేణా కోదై – గోదాగా, గోదాదేవిగా పిలువబడింది. "గా దదా తీతి గోదా" అనగా చక్కని వాక్కులను ఇచ్చునది అని అర్థము. "జన్మ కర్మచమే దివ్యం" అని శ్రీకృష్ణుడనినట్లు గోదాదేవి జన్మ కర్మ, జ్ఞానము, భక్తి, ప్రపత్తి అన్నీ దివ్యమూ, భవ్యమైనవే.

విష్ణుచిత్తులు గోదాకు అర్చామూర్తి వైశిష్ట్యాన్ని తీర్థ ప్రసాదాలతో రంగరించి పోశాడు. దానితో గోదాదేవి చిన్నతనం నుండి భక్తి, జ్ఞాన, వైరాగ్యాది సుగుణాలను అలవరచుకొని, తండ్రి కొరకు ఇంటికి వచ్చి పోయే వారి ద్వారా హరికథలను వింటూ, రంగని గుణగణాలను విని రంగనిపై ఇష్టం పెంచుకుంది. ఆ ఇష్టం ప్రీతిగా, ఆ ప్రీతి ప్రేమగా దినదినాభివృద్ధి చెంది ప్రవర్ధమానమైంది. ఆమెకు యుక్త వయస్సు వచ్చేసరికి శ్రీకృష్ణుడినే పెండ్లి చేసుకోవాలనే కోరిక బలపడింది. భగవంతునికై తండ్రితో పాటు పూలమాలలు తయారు చేసి, ముందుగా తాను ధరించి బాగున్నాయని అనిపిస్తే అప్పుడు భగవంతునికి అర్పించేది. అందువల్ల ఆమెకు "శూడి కొడుత్త నాచ్చియార్" అనే పేరు కలిగింది. కట్టి పూమాలను ముందుగా తాను ధరించి, ఆ మాలను స్వామికి అర్పించిందని అర్థము. అందుకే ఆమెను "ఆముక్త మాల్యద" అని అంటారు.

ఒకనాడు యథావిధిగా తన కుమార్తె ఇచ్చిన మాలలను తీసుకొని వెళ్ళి దేవునికి సమర్పించబోగా దండలో తలవెండ్రుక కనిపించింది. విష్ణుచిత్తుడు ఆశ్చర్యపోయి తన కుమార్తెను



అదుగ గా ముందుగా మాలలను ధరించి బాగుంటేనే భగవంతునికి ఇచ్చుచున్నానని పలికింది. అందుకు తండ్రి మందలించగా భగవంతునికి సమర్పించే మాలలు సహజ సుందరంగా, అందరి మనసులు దోచేలా యుండాలనే తలంపుతో ముందు తాను ధరించి, ఇచ్చుచున్నానని పలికింది. ఆ నాటి రాత్రి మధుసూదనుడు విష్ణుచిత్తునికి కలలో కనిపించి, ఆమె ధరించి ఇచ్చిన మాలలే తనకిష్టమని చెప్పాడు. ఆనాటి నుండి అందరూ ఆమెను ''ఆముక్త మాల్యద'' అని పిలిచేవారు. చిన్నతనము నుండి ఆ నోటా, ఈ నోటా వాసుదేవుని గాథలు విని, గుణగణములు విని యుండుట చేత రంగనాథునే తన భర్తగా ఊహించుకొనెడిది. రోజులు గడిచేకొద్దీ ఆ భావన ఆమె మనసులో దృఢంగా స్థిరపడి, రంగనాథుని పతిగా కోరి ధనుర్మాసం నెల రోజులు మార్గళి వ్రతాన్ని ఆచరించి రోజూ ఒక పాశురం చొప్పున నెల రోజులు 30 పాశురాలతో మహావిష్ణువును కీర్తించింది, స్తుతించింది, సేవించింది.

గోపికలు ఆచరించిన కాత్యాయనీ వ్రతమనే ధనుర్మాస వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించింది. స్వామికి నివేదించిన ప్రసాదాన్ని స్వీకరిస్తూ, ఒంటిపూట మాత్రమే ఆహారం తీసుకుంటూ, కటిక నేలమీదే నిద్రించేది. ఈ విధంగా కఠిన నియమాలతో ఆచరించగా ఆమె భక్తికి, అపారమైన ఆమె ప్రేమకు స్వామివారు ప్రసన్నులై ఆమెను పరిణయమాడారు. ఆమె తండ్రి గోదాదేవిని తీసుకువెళ్ళి రంగనాథ స్వామితో వివాహం జరిపించాడు. వివాహం జరిగిన వెంటనే గోదాదేవి రంగనాథునిలో ఐక్యమైంది.

''వఙ్గ కడల్ కడైన్ద, మాధవనై, కేశవనై'' అనే పాశురం 30వ పాశురం. ఫలశ్రుతి. దీనితో తిరుప్పావై వ్రతం ముగుస్తుంది. గోదాదేవి ఆచరించి చూపిన ఈ స్నాన వ్రతం వలన మనలో శారీరక మానసిక క్రమశిక్షణ ఏర్పడుతుంది. ఒక లక్ష్యమంటూ ఏర్పరచుకున్నాక దానిని సాధించేవరకు విశ్రమించకూడదనే పట్టుదల, కృషి, దీక్ష ఏర్పడుతుంది. గోదాదేవి భక్తి తత్పరతను ఆలంబనగా చేసుకొని ఆ నాటి నుండి నేటివరకు ప్రతి ఒక్కరూ వేడుకగా ఉత్సవాలను జరిపిస్తూ తరిస్తున్నారు.

ధనుర్మాసం నెల రోజులు దేవాలయాలలో స్వామికి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పిస్తారు. మొదటి పదిహేను రోజులు చక్కెర పొంగలి లేదా పులగాన్ని స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తారు. తరువాతి పదిహేను రోజులు దధ్యోదనాన్ని నివేదన చేస్తారు. ధనుర్మాస వ్రతం చేసినవారికి ఇహ పర సౌఖ్యం కలుగుతుందని పురాణ వచనం. ఈ మాసంలో తులసిపూజ చాలా ప్రశస్తమైనది. గోవునకు శాస్త్రోక్తంగా పూజ చేసి గౌరవించిన అనంత ఫలం కలుగుతుంది. గోవుకు ప్రదక్షిణ చేసిన భూలోక ప్రదక్షిణ చేసిన ఫలితం దక్కుతుంది.

గోదాదేవి మార్గళి వ్రతం, పాశురాలు మధుర భక్తికి తార్కాణాలు. ఒక్కొక్క పాశురం పరతత్త్వానికి ప్రతీక. హృదయమే కేంద్రంగా చేసుకొని వ్రతం చేసిన ఆండాళ్ ను ఆధ్యాత్మిక యోగినిగా శ్రీకృష్ణదేవరాయలు ''ఆముక్త మాల్యద''లో వర్ణించాడు. తిరుప్పావైను రచించిన ఆండాళ్ పన్నెండుగురు ఆళ్వార్లలోని ఒకే ఒక స్త్రీ. ప్రేమోన్మాద ఫలితమైన మధురభక్తికి తిరుప్పావై మార్గదర్శకం చేస్తుంది. ద్రవిడ భాషలో ఈ గీతాలను ''దైవీ వాక్కులు'' అని అంటారు.


ధనుర్మాసంలో తిరుమల క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామికి సుప్రభాతసేవను సహితం రద్దు చేసి, ఆండాళ్ రచించిన తిరుప్పావై పాశురాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పఠిస్తారు. పాశురాలలో ''కడారై వెల్లుమ్ శీర్ గోవిందా'' అన్న పాశురంలో ''గోవింద'' నామాన్ని ప్రయోగించి స్వామిని కీర్తించు. ''తిరుప్పావై''ను అనుసరించే వారు, ఆచరించేవారు ఆ గోదా రంగనాయకుల పరిపూర్ణమైన కటాక్షాన్ని పొందుతారు. కావున మనమూ త్రికరణశుద్ధిగా ఆచరించి తరిద్దాము. ఈ జగత్తంతా ఏ శక్తి (భూదేవి) చేత రక్షించబడుతోందో ఆ శక్తి (జగన్మాత) ని అర్చించి సన్మంగళాలను పొందుదాము.

**"సర్వ మంగళ మాంగళ్యే శివే సర్వార్థ సాధకే**
**శరణ్యే త్రయంబికే దేవి నారాయణి నమోస్తుతే"**

# "హరే శ్రీనివాసా!" పుస్తక సమీక్ష

## వెంకటరమణుడిపై రమణాచారి గారి అచంచల విశ్వాసము, భక్తి

**– కూర చిదంబరం**




నలుగురికీ మంచి చేయాలని చిత్తశుద్ధితో ప్రయత్నించే మార్గంలో ఎన్నో అవరోధాలు ఉండవచ్చును. ప్రభుత్వం ఏర్పరచిన చట్టాలు, ప్రజాభిప్రాయాలు, వక్రీకరించిన అభిప్రాయాలను ఆపాదించటం లాంటి ఎన్నో అవరోధాలు ఉండవచ్చును. పాలనా యంత్రాంగంలో భాగమైన ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో భాగంగా తీసుకునే నిర్ణయాలపై విమర్శలు ఇలాంటివి వేవేలు. అందుకనే అధికారులు తాము తీసుకోబోయే నిర్ణయాలపై ఆచి తూచి వ్యవహరిస్తుంటారు. ఆ అధికారి వ్యక్తిగత విశ్వాసంతో ముడిపెట్టిన సందర్భాలయితే మరింత జటిలంగా ఉంటాయి. ఏదో 'మంచి' చేయాలన్న తపన ఒకవైపు, విమర్శ మరోవైపు వీరిని డోలాయమాన స్థితికి గురి చేస్తుంటాయి. అయినా చిత్తశుద్ధి, దీక్ష గల అధికారులు ఈ అవరోధాలన్నింటినీ సమర్థవంతంగా అధిగమించి పేరు తెచ్చుకుంటారు.

డా॥ కె.వి.రమణాచారి చిత్తశుద్ధి గల ఒక ఐ.ఎ.ఎస్ ఆఫీసర్. డిప్యూటీ కలెక్టర్ గా తన సర్వీస్ ప్రారంభించి, ఎన్నో బాధ్యతాయుత పదవులను నిర్వహించారు. నిర్వహించిన ప్రతి పదవిలో కూడా తనదంటూ ఒక ముద్ర వేశారు. పదవిలో ఉన్నపుడు, పదవీ విరమణ అనంతరం కూడా ఎన్నో సాహితీ, కళా, సాంస్కృతిక కార్యక్రమాలకు చేయూత నందిస్తున్నారు.



శ్రీవైష్ణవుడిగా, తన విశ్వాసంలో భాగంగా తిరుమలేశుని త్రికరణశుద్ధిగా నమ్మే వీరికి తిరుమల తిరుపతి దేవస్థానం వారి 'ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్'గా పదవీ బాధ్యతలు నిర్వహించే అవకాశం 2007 నుండి 2009 వరకు కలిగింది. తాను నమ్ముకున్న దైవానికి సేవ చేసే అవకాశం రావటం తన భాగ్యంగా, అదృష్టంగా భావించారు రమణ గారు. ఆనాటి అవిభక్త ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు, తిరుమల శ్రీనివాసుని భక్తులకు ఎన్నో సదుపాయాలు, సౌకర్యాలు కలిపించారు. ఈ.వో గా తన పదవీ నిర్వహణలో భాగంగా ఎన్నో అడ్డంకులు ఎదుర్కొన్నారు. వాటన్నింటినీ మొక్కవోని పట్టుదల, శ్రీనివాసునిపై అచంచలమైన విశ్వాసంతో అధిగమించి కృతకృత్యులయ్యారు.

తాను తీసుకుంటున్న నిర్ణయాలు శ్రీనివాసుని భక్తులకు మేలు చేకూర్చుతాయన్న అచంచల విశ్వాసంతో ముందుకు సాగారు. తన పై అధికారుల్నీ, తన క్రింద పని చేసే సిబ్బందినీ తన ఆలోచనలకు అనుకూలంగా మలచుకోగలిగారు. విధి నిర్వహణలో భాగంగా 'హరే శ్రీనివాసా!' అని ఎన్నిసార్లు అనుకున్నారో! అదే శీర్షికను ఈ పుస్తకానికి ఉంచి మనకందిస్తున్నారు. పుస్తకం వెలువడిన మూడు పక్షాల్లోనే మూడో ముద్రణకు రావటం – ఇదో 'రికార్డు'గా రమణాచారి గారికి దక్కుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చును.

'హరే శ్రీనివాసా!' చదువుతున్నంతసేపూ పాఠకుడు ఒకరకమైన ఆధ్యాత్మిక, భక్తిభావనలో తేలిపోతాడు. ఏ పనినైనా

అచంచల విశ్వాసం, చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే శ్రీనివాసుడు తప్పక తన వెంట ఉండి సాయపడతాడన్న నమ్మిక కలుగుతుంది. రచయిత మాటల్లోనే – ''నేను సంకల్పించి చేపట్టిన ప్రతికార్యం లోనూ నాకు పరీక్షలూ ఆయనే పెట్టాడు... పరిష్కారమూ ఆయనే చూపించాడు'' అని అనటం రమణాచారి గారి వినయ విధేయతలకు నిలువెత్తు సాక్ష్యం. ఈ ఒక్క వాక్యంలోనే సముద్రమంతటి వారి అంతరంగం ఆవిష్కృతమవుతోంది.

22-04-2007 నుండి 19-06-2009 వరకు తిరుమల తిరుపతి దేవస్థానం ఈ.వో గా పని చేసి రమణాచారి గారు భక్తులకు ఈ క్రింది సౌకర్యాలు కల్పించారు.

1. ''చతుర్యుగ బంధ భక్తి చైతన్య యాత్ర'' పేరున స్వామివారే ఆంధ్రావని అంతా 3 రథాలలో వెళ్ళి తిరుమలకు రాలేని భక్తులకు తానే వారి వద్దకు వెళ్ళి దర్శనమీయటం 20-12-2007 న ప్రారంభం.
2. 7 జులై 2007 నుండి తిరుమలలో అఖండ హరినామ సంకీర్తన ప్రారంభించటం. నేటికీ అది జాజ్వల్యమానంగా కొనసాగుతూ ఉండటం.
3. పెరుగుతున్న భక్తుల సంఖ్యకి తగినట్లుగా తిరుమలలో సదుపాయాలు పెంచటంలో భాగంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ని ఎయిర్ కండిషనింగ్ చేయించటం.
4. చంటిపిల్లల తల్లులు, వయోధికులు, వికలాంగులకు ప్రత్యేక దర్శన సదుపాయం కల్పించటం.
5. తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద మందిరాన్ని ఒకేసారి 40,000 మంది భక్తులకు సరిపడ విస్తరింపచేయటం.
6. పాంచజన్యం, నందకం, కౌస్తుభం, సన్నిధానం భవనాలు నిర్మించి భక్తులకు నివాస వసతి విస్తరణ. యాత్రిక విడిది కేంద్రాల (డార్మిటరీ) నిర్మాణం.
7. తిరుచానూరులో అమ్మవారి ఆలయం చుట్టూ ఉండే వీధుల విస్తరణ.
8. ''కళ్యాణమస్తు'' పేరున నిరుపేద భక్తులకు ఉచిత వివాహ సౌకర్యం. గోకుల్ చాట్ ప్రేలుళ్ళ నేపథ్యంలో కూడా నిర్వహించటం రమణుడిపై రమణాచారికి గల అచంచల విశ్వాసానికి నిదర్శనం.
9. జీ.వో ద్వారా తిరుమల ఏడు కొండలను వ్యవస్థీకృతం కావించటం.
10. ఎస్.వి.బి.సి ఛానెల్ (టీ.వి) స్థాపన (07-07-2008). అంతగా తెలియని రంగం. అయినా విజయవంతంగా నిర్వహణ.
11. ధర్మాచార్యుల సదస్సు ''పుస్తక ప్రసాదం'' ప్రారంభం.
12. 2007-2009 సంవత్సరాల మధ్యకాలంలో దేశంలో, విదేశాల్లో శ్రీనివాస కళ్యాణ ఉత్సవాలు, అన్నమయ్య సంకీర్తనామృత ఉత్సవాల నిర్వహణ.
13. తాళ్ళపాకలో 108 అడుగుల ఎత్తు గల అన్నమయ్య విగ్రహ స్థాపన. వారి వంశీయులకు జీవనభృతి కల్పన.
14. టి.టి.డి ధర్మకర్తల మండలి అమృతోత్సవాల (75 ఏళ్ళ) నిర్వహణ.
15. వేద విశ్వవిద్యాలయ స్థాపనకు నిర్ణయం.

మచ్చుకు ఇవి కొన్ని మాత్రమే...

ఇన్ని సాధించి కూడా – ''ఏ పథకాన్ని ఏ కార్యక్రమాన్ని ఎవరి చేత అమలు చేయించుకోవాలో, ఎంతవరకు చేయించుకోవాలో నిర్ణయించేది మనమా? అంతా స్వామి అనుగ్రహం. ఆయన అనుగ్రహానికి కాలం చెల్లిన మరుక్షణం ఎంత పరపతి ఉన్నవాళ్ళు కూడా ఈ సీట్లో (ఈ.వో గా) ఒక్క క్షణమైనా ఉండలేరు'' – అనటం రమణాచారి గారి మోడెస్టీకి నిలువెత్తు నిదర్శనం. సగం నిండిన కుండ తొణుకుతుంది కాని నిండా నిండిన కుండ తొణకదు.

ఈ.వో గా బదిలీ అయిన తరువాత చివరి ఆరు పేజీల్లో రచయిత పొందిన వేదన గుండె ఉన్న ప్రతి పాఠకుడినీ, కలిచివేసేదిగా చెప్పారు. ఆత్మీయులకు దూరం అవుతున్న వేదన ప్రకటితమయింది. ఈ.వో గా చివరిసారి స్వామి దర్శనం, సిబ్బంది అశ్రు నయనాల వీడ్కోలు, భావోద్వేగాలు, రైల్వే స్టేషన్ కు కూడా వచ్చి వీడ్కోలు పలికిన జన సంద్రం, చివరికి జనసందోహాన్ని నియంత్రించేదుకు ప్లాట్ ఫాం మారిన రైలు... వేంకటాద్రి కొండలు దిగి వెంకటాద్రి ట్రెయిన్ ఎక్కిన రచయిత భావోద్వేగం... పాఠకుడూ ఆ జన సంద్రంలో ఒకరై రమణాచారికి వీడ్కోలు పలుకుతారు. అప్పుడే పుస్తకం చివరి పేజీకి వచ్చామే అని రచయితతో పాటు పాఠకుడూ బరువుగా నిశ్వసిస్తాడు.

**హరే శ్రీనివాసా!**

**- డా|| కె.వి.రమణాచారి.**

**వెల రు|| 150/-**

**ప్రతులకు : ఎమెస్కో బుక్స్ ప్రై.లి.**
**విజయవాడ. ఫోన్. 0866-2436643).**


అమ్మను సేవించడం ఎంత ముఖ్యమో -
ఆవును సేవించడం అంతే ముఖ్యం



అమ్మను సేవిస్తే పరమార్థం -
ఆవును సేవిస్తే చరితార్థం

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 390. తాప జ్వర వినాశకాయ నమః

ఆధ్యాత్మికాది తాపత్రయ రూపమగు జ్వరమును నశింపచేయువాడు భగవంతుడగు విష్ణువు.

ఉష అనిరుద్ధుల ప్రణయము కారణముగా కృష్ణునికి బాణునితో జరిగిన యుద్ధములో బాణుని పక్షమున శివుడు పాల్గొని కృష్ణునిపై తాపము కల్గించే శివ జ్వరమును ప్రయోగించినాడు. కృష్ణుడు ఆ శివ జ్వరమును తన సుదర్శన చక్రముతో నశింపచేసినాడు.

శివ తాప జ్వరమును నశింపచేసిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము. తాపత్రయములు మూడు. అవి 1. ఆధ్యాత్మికము 2. ఆధి భౌతికము 3. ఆధి దైవికములు. తాపము అనగా సంతాపము, బాధ అను అర్థములు కలవు.

## 391. ఉషోద్ధర్షయిత్రే నమః

ఉషా – ఉత్ – హర్షయితా – ఉషోద్ధర్షయితా – గుణ సంధి

బలిచక్రవర్తి కుమారుడగు బాణాసురుని తనయ ఉష. ఈమె కృష్ణుని మనుమడు, ప్రద్యుమ్నుని కుమారుడు అగు అనిరుద్ధుని కలలో చూచి ప్రేమించి, తన చెలికత్తె చిత్రరేఖ సహాయమున ద్వారక నుండి తన అంతఃపురమునకు అనిరుద్ధుని రప్పించుకొని అతనితో సుఖజీవనం చేసింది. అంతఃపురమున ఉన్న అనిరుద్ధుని బాణుడు బంధించినాడు. ఈ వార్త నారదుని ద్వారా తెలిసిన కృష్ణుడు బాణునిపై దండెత్తిపోయి అతని బాహువులను ఖండించి యుద్ధములో జయించి, ఉషానిరుద్ధులతో ద్వారక చేరి, వారికి వివాహము చేసి ఉషకు మహానందమును కలిగించినాడు.

ఉషకు అనిరుద్ధునితో వివాహము చేసి ఆమెకు మహదానందమును చేకూర్చిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 392. అవ్యక్తాయ నమః

వాక్కుకు, మనస్సుకు అతీతుడు భగవంతుడగు విష్ణువు.

అనంతమైన తన ప్రభావమును మనుష్య సజాతీయమైన ఆకారముచే కప్పి పుచ్చుకొని యున్నాడు కనుక విష్ణుదేవుడు అవ్యక్తః అనబడుచున్నాడు. స్పష్టము కాని పర్వతము కలవాడు అని అర్థము. ఈ విషయమును "నాహం ప్రకాశః సర్వస్య యోగ మాయా సమా వృతః" – 7–25 గీత.

యోగమాయచే బాగుగా కప్పబడి ఉండుటచే నేను అందరికీ కనబడను అనియు


"నాహం వేదై ర్న తపసా దృష్టవానసి మాం యథా" – 11–53 గీత.

నేను వేదములచే (వేదాధ్యయన పరుల చేత) కాని, తపస్సుచే కాని చూచుటకు శక్యుడను కాను అనియు భగవద్గీతలో కృష్ణభగవానుడే చెప్పుకొని యున్నాడు. కనుక భగవంతుడు తన దివ్య రూపమును స్పష్టముగా ప్రకటించినప్పుడే భక్తులు చూడగలరు తప్ప ఎవరికిని దానిని గ్రహించు శక్తి లేదు అని ఉదాహరించిన గీతా శ్లోకములను బట్టి స్పష్టమగుచున్నది. విష్ణుదేవుని కర్మ అయిన విశ్వము వ్యక్తమవుతున్నది. కాని కారణమైన విష్ణువు వ్యక్తమవడంలేదు. అతడు ప్రాణులందరిలో ఉన్నా అవ్యక్తుడు. ఏకోదేవః సర్వభూతేషు గూఢః అని శ్వేతాశ్వతరోపనిషత్తు.

ఈ నామము విష్ణు సహస్ర నామములలో 727 సంఖ్యతో ఉన్నది.

అవ్యక్తుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

## 393. శివ వాక్తుష్ట మానసాయ నమః

పరమ శివుని మాటల చేత సంతష్టమైన మనస్సు కలవాడు కృష్ణుడు. వేంకటేశుడు.

వేంకటాద్రిపై ఒక శుభదినమున శంఖణరాజు, అగస్త్య మహర్షి మున్నగు వారు చేయుచున్న తపస్సునకు ప్రీతుడై శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమైనాడు. భగవంతుని బ్రహ్మ స్తుతించిన పిమ్మట శివుడు

**అహ మారాధ్య దేవ! త్వాం సర్వమేధే మహాక్రతౌ ।**
**ప్రాప్తవాన్ దేవ దేవత్వం దుర్లభం సర్వదేవతైః ॥**

దేవా! నేను నిన్ను సర్వమేధ యాగముతో ఆరాధించి దేవతలందరు పొంద శక్యము కాని దేవాధిపత్యమును పొందితిని అని స్తుతించినాడు. అంతట నారాయణుడు శివుని యెడ ప్రీతుడై శంకరా! నీ కోరిక ఏమి? అని అడిగినాడు. అందుకు శంకరుడు స్వామీ! మీరు ఎల్లప్పుడు ఎచట నుండిన అచ్చటనే నేను ఉండునట్లు వరమొసంగుమని కోరినాడు. అంత నారాయణుడు ఈశ్వరా నేను ఈ వేంకటాచలమున ఈ శ్వేత వరాహ కల్పాంతము వరకు నివసించెదను. నీవు ఈ పర్వత సానువులో ఆగ్నేయ దిశలో నివసించుమని పలికినాడు. ఆనాటి నుండి శివుడు నేటి కపిల తీర్థ తీరమున నివసించి యున్నాడు. శివుడు వేంకటాచల క్షేత్ర పాలకుడు. విష్ణుక్షేత్రములకు శివుడు, శివక్షేత్రములకు విష్ణువు క్షేత్ర పాలకులుగా ఉన్నారు. వారికి భేదము లేదు. వారి భక్తులు మాత్రం వారి మధ్య భేదం పాటిస్తున్నారు. ఎంత అజ్ఞానం?

శివ వాక్తుష్ట మానసుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 394. మహేశ జ్వర సంస్తుత్యాయ నమః

అనిరుద్ధుని రక్షించుటకై కృష్ణుడు బాణాసురునితో యుద్ధము చేసెను. అప్పుడు బాణుని పక్షమున శివుడు కృష్ణునితో పోరాడినాడు. శివుడు ప్రయోగించిన శివతాప జ్వరము కృష్ణుని ఎదుర్కొనెను. కృష్ణుడు దానిపై వైష్ణవ జ్వరమును ప్రయోగించినాడు. అపుడు శివ వైష్ణవ జ్వరములు పరస్పరము యుద్ధము చేయగా శివజ్వరము పరాజయము పొందెను. అంతట శివజ్వరము కృష్ణుని శరణు జొచ్చి నమస్కరించి కృష్ణుని ఇట్లు స్తుతించింది. దేవా! నీవు అనంత శక్తి స్వరూపుడవు. శ్రేష్ఠులైన బ్రహ్మ రుద్రేంద్రాది దేవతలకు ప్రభుడవు. సకల ప్రాణులలోను అంతర్యామివై వెలుగొందుచుందువు. నీవు అద్వితీయుడవు. (నీకు సాటి కాగలవారు లేరు) జ్ఞాన స్వరూపుడవు. విశ్వము యొక్క సృష్టి స్థితి లయములకు కారకుడవు. వేదములచే వర్ణింపబడిన బ్రహ్మ స్వరూపుడవు. వికార రహితుడవు. (భాగ, 10–ఉత్తర – 63 – 25 శ్లో ॥).

శివజ్వరము యొక్క స్తుతికి ప్రీతుడై త్రిశిరా! నీ యెడ ప్రసన్నుడనైతిని. నా వైష్ణవ జ్వరము వలన నీకు భయము లేదు అని చెప్పగా శివ జ్వరము (త్రిశిరుడు) కృష్ణునికి నమస్కరించి స్వస్థానమునకు వెళ్ళిపోయెను.

మహేశ జ్వరము స్తుతించిన కృష్ణుని మరు జన్మయే యైన వేంకటేశునకు నమస్కారము.

కృష్ణునికి వేంకటేశునకు అభేదము గనుక వేంకటేశ సహస్ర నామములలో మహేశ జ్వర సంస్తుత్యః (374) నామము ఏర్పడింది.

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

రాముణ్ణి ఓదార్చుతున్నాడు సుగ్రీవుడు. సీతాదేవిని చూశారు వీరులు. వచ్చేస్తున్నారు. నీకు భద్రమగు గాక. హనుమంతుడే దర్శించి ఉంటాడు జనకాత్మజని అన్నాడు. అంతలో కిలకిలా రావాలు వినబడుతున్నాయి. సింహగర్జనలు వినపడుతున్నాయి. విన్నాడు సుగ్రీవుడు. సంతోషించాడు. తన తోక పైకెత్తాడు. గమ్యస్థానం చేరాలి విమానం. అందుకు దీపకాంతులు సూచింపబడతాయి. అలా ఇక్కడే దిగాలి అన్నట్లు వాలం పైకెత్తాడు సుగ్రీవుడు.

**గత సంచిక తరువాయి**

హనుమంతుణ్ణి ముందుంచుకున్నారు వానరులు. దిగారు. మహాబాహుడు హనుమంతుడు రామలక్ష్మణుల్ని చూశాడు. సాష్టాంగ నమస్కారం చేశాడు. 'దృష్టా దేవి' – అమృత తుల్యమైన పలుకులు వినపడ్డాయి. రామలక్ష్మణులు మహదానంద భరితులైనారు. నియతాం అక్షతాం దేవీం – అన్నాడు హనుమంతుడు. అంటే సీతాదేవి పాతివ్రత్యంలో ఉంది. నియమశీలయై ఉంది. అది మారుతి భావన.

కార్యం సాధించాడు హనుమ – అన్నట్లు సంతోషించాడు సుగ్రీవుడు. అలా ఆనందంలో ఉన్న సుగ్రీవుణ్ణి చూశాడు లక్ష్మణస్వామి. ఆ చూపుల్లో గౌరవభావం ఇమిడి ఉంది. రాముడు సంతోషించాడు. హనుమంతుణ్ణి చూశాడు. ఆ చూపుల్లో అతనిపై అమిత గౌరవం పొడసూపింది.

మనలో మాట – సీతాదేవిని తప్పక హనుమంతుడే చూస్తాడని సుగ్రీవుని నమ్మకం. మారుతి అంతటి బలశాలి. పరాక్రమశాలి. బుద్ధిశాలి కదా. వాలిని చంపు. నాకు దుఃఖం పోగొట్టు అని అతణ్ణి సుగ్రీవుడు అడగలేదు ఎందుకు? లేదా వాలిని హనుమంతుడే చంపి – సుగ్రీవుని రాజుని చేయవచ్చు కదా? ఆ పని ఎందుకు చేయలేదు?

1. తన బలం తెలియనివాడు హనుమంతుడు. అందుకు ఆ పని చేయలేదు. అది మహర్షులు పెట్టిన శాపం. అందుకు వాలిని చంపలేదు.
2. ఆ శాపం విషయం తెలియదు సుగ్రీవునికి. అందుకు అతని శక్తి ఏమిటో తెలియచెప్పాలి. తర్వాత అన్నని చంపు అని అడగాలి.
3. తన కింద పని చేసే మంత్రిని అడగాలంటే అభిమానం

అడ్డు వస్తుంది. అంతకంటే అవమానం మరొకటి ఉండదు సుగ్రీవునికి.

4. రాముణ్ణే నమ్మలేదు సుగ్రీవుడు. వాలిని చంపడానికి రెండు పరీక్షలు పెట్టాడు. ఇక తన మనిషి హనుమని నమ్ముతాడా – అంటే మంత్రులపై అంత నమ్మకం రాజుకి ఉండాలి. అందుకే మారుతిని పరీక్షించలేదు సుగ్రీవుడు.

అశోకవనం ధ్వంసం చేశాడు హనుమ. మధువనం పాడు చేయించాడు. ఆ రెండు వనాల ఆంతర్యమేమి? అశోకవనం దక్షిణ తీరంలో ఉంది. దానికి ఉత్తరాన ఉంది మధువనం. కింది లోకాల్లో పాపఫలం అనుభవించాలి. పై లోకాల్లో పుణ్యఫలం అనుభవించాలి. రెండూ భోగ్యవిషయాలే. పాపం ఇనుప సంకెళ్ళు. పుణ్యం బంగారు సంకెళ్ళు. అవి రెండూ భగవత్ ప్రాప్తికి ప్రతిబంధకాలు. అవి ధ్వంసం కావాలి. అప్పుడే భగవత్ సాన్నిధ్యం లభ్యమవుతుంది. అది ఆధ్యాత్మిక పరమైన అంతరార్థం – అది పెద్దల అభిప్రాయం.

## సీతమ్మ సమాచారం

సీతాదేవిని చూశారని తెలిసింది రామునికి. సీతాదేవి ఎక్కడుంది? నా గూర్చి ఏమనుకుంటోంది? వివరంగా చెప్పండి – అడిగాడు రాముడు.

విన్నారు వానరులు. హనుమంతుణ్ణి చెప్పాలని ప్రోత్సహించారు. సరే అన్నాడు మారుతి. సీతాదేవి ఉన్న దిక్కువైపు తిరిగాడు. నమస్కరించాడు. చెప్పటం మొదలుపెట్టాడు.

రామా! నూరు యోజనాల సముద్రం దాటాను. దక్షిణ తీరం చేరాను. అక్కడ దురాత్ముడు రావణుని పట్టణం ఉంది. అదే లంక. వాడి అంతఃపురంలో చూశాను సీతమ్మను. రావణుని స్వాధీనంలో ఉంది. అశోకవనంలో ఉంది. అక్కడ చూశాను సీతమ్మను. శోకభరితయై ఉంది. ఒంటి జడతో ఉంది. దీనంగా ఉంది. నిన్నే ధ్యానిస్తోంది. కటిక నేలమీద పడుకుంటోంది. మంచు పడిన తామరలా కనిపించింది. దేహం వివర్ణమై ఉంది. ఆమె మనసంతా నువ్వే. ఏమాత్రం రావణుని పొందాలని లేదు. ఆత్మహత్య



చేసుకోవాలనుకుంది. నిన్నే నమ్మిన సీతమ్మను చూశాను.

ఇక్ష్వాకు వంశాన్ని కీర్తించాను. నన్ను నమ్మింది. తర్వాత మాట్లాడాను. ఇక్కడి సంగతులన్నీ చెప్పాను. రామ సుగ్రీవుల మైత్రి చెప్పాను. సంతోషించింది. ఆమె పాతివ్రత్యం ఏమని చెప్పను? నీ మీది భక్తి ఏమని చెప్పను? ఎంత చెప్పినా తనివి తీరదు. చిత్రకూట పర్వతాన మీరున్నారు. అపుడు జరిగిన కాకి వృత్తాంతం అది నీకు గుర్తుగా చెప్పింది.

హనుమా! ఇక్కడి విషయాలన్నీ రామునికి చెప్పు. నేనింతవరకు ఈ మణిని దాచుకున్నాను. నీకు ఇస్తున్నాను. ఇది నా ప్రభువు రామునికి సమర్పించు. ఒకరోజు నా నుదుట బొట్టు చెదిరిపోయింది. మణిశిలని బొట్టుగా చేశావు. నా చెక్కిలి మీద బొట్టుగా పెట్టావు. ఎందుకంటే సరదా కోసమన్నావు. హనుమా! ఇది జ్ఞాపకం తెచ్చుకోవాలని చెప్పమంది. ఇక నేను ఒక నెల మాత్రమే జీవిస్తాను. నెల దాటితే ఈ రాక్షసులు చంపేస్తారు నన్ను – అవి సీతమ్మ మాటలుగా చెప్పాడు. మళ్ళీ అంటున్నాడు.

రామా! సీతాదేవి ధర్మం తప్పలేదు. కృశాంగియై ఉంది. లేడిలా బెదిరిపోతోంది. చూపుల్లో భయం కనిపిస్తోంది. రామా! లంకలో చూసింది చూసినట్లుగా నివేదించాను. ఇక సముద్రం దాటాలి. ఎలా దాటాలి? ఏ సాధనంతో దాటాలి? ఆలోచించండి అన్నాడు. చూడామణిని ఇచ్చాడు రామునికి. అందుకున్నాడతడు.

విన్నారు రామలక్ష్మణులు. కొంచెం ఊరట చెందారు.

## రామ పరితాపం

చూశాడు చూడామణిని రాముడు. హృదయానికి హత్తుకున్నాడు. విలపించాడు. అది చూశాడు లక్ష్మణస్వామి. అతడూ కంటతడి పెట్టాడు. సుగ్రీవుణ్ణి చూశాడు రాముడు. అంటున్నాడు.

వాత్సల్యం ఉంది ధేనువులో. దూడ చూస్తుంది. ప్రేమ ద్రవిస్తుంది. అలా ఈ మణి చూశాను. నా హృదయం ద్రవిస్తోంది. సముద్రంలో పుట్టింది ఈ మణి. అది వరుణుడు తీసుకున్నాడు. ఇంద్రునికి ఇచ్చాడు. జనకమహారాజు యజ్ఞం చేశాడు. సంతృప్తుడైనాడు ఇంద్రుడు. ఈ మణిని మా మామగారు జనకునికి బహూకరించాడు. వివాహ సమయంలో ఈ మణిని వైదేహికి కానుకగా ఇచ్చాడు మహారాజు. ఆ మణిని తీసుకుంది సీత. తన తలలో అలంకరించుకుంది. ఇపుడు ఈ మణిని చూస్తుంటే మా మామగారిని, మా తండ్రి గారిని దర్శించినట్లు ఉంది. ఇపుడు ఈ చూడామణిలో నా సీతను చూస్తున్నాను.

హనుమంతునితో అంటున్నాడు. దాహం వేసినవాడికి పదే పదే నీళ్ళిచ్చి వాడి దాహం తీర్చినట్లు నీ మాటలనే నీరు నన్ను సేద తీర్చినట్లుంది. ఇంకా ఏం చెప్పింది వైదేహి?

**చిరంజీవతి వైదేహీ యది మాసం ధరిష్యతి ।**

**క్షణం సౌమ్య న జీవేయం వినా తామసి తేక్షణాం ॥**

నెల రోజులు బతుకుతుందా సీత. అయితే బహుకాలం బతికినట్లే. నల్లని చూపులు కల జానకిని చూడక క్షణకాలం బతకలేను నేను.

అంటే సీతమ్మ ప్రేమ కంటే రామయ్య ప్రేమ అధికం. అంతేకదా. జీవుని ప్రేమకన్నా భగవత్ ప్రేమ అధికం. అది పరమాత్మ స్వభావం.

హనుమా! సీతను ఎక్కడ చూశావు? నన్నక్కడికి తీసుకెళ్ళు. ఆమె వృత్తాంతం తెల్సింది. ఇక దూరంగా ఉండలేను. క్షణ క్షణం భయపడుతూ భయంకర రాక్షసాంగనల మధ్య ఎలా ఉంటోంది? హనుమా! ఇంకేం చెప్పింది సీత? మందు ఇస్తే రోగి బతుకుతాడు. నా సీత ఏం చెప్పిందో వింటే నేను బతుకుతాను.

**మధురా మధురాలాపా కిమాహ మమ భామినీ ।**
**మద్విహీనా వరారోహా హనుమాన్ । కథయస్వమే ॥**
**దుఃఖా ద్దుఃఖతరం ప్రాప్య కథం జీవతి జానకి ॥**

నా భార్య మధుర స్వభావి. ఆమె మాటలు మధురాలు. ఆమె మాటలు చెప్పే నీ మాటలూ నాకు మధురాలే. ఇపుడు సీత నాకు దూరమై ఉంది. నాపై ప్రేమతో ఉంది. ఇంకేం అన్నదో చెప్పు. దుఃఖ పరంపరలతో ఎలా జీవిస్తోందో జానకి? – అని పరితపించాడు రాముడు.

## సీతా నివేదన

సీతమ్మ చెప్పింది విన్నాడు హనుమ. ఆ మాటలు రామునికి నివేదిస్తున్నాడు. చిత్రకూటంలో నీ ఒడిలో పడుకుంది సీతమ్మ. కాసేపటికి లేచింది. నీవు ఆమె ఒడిలో పడుకున్నావు. అపుడు ఒక కాకి వచ్చింది. ఆమె స్తనాల మధ్య గీరింది. మళ్ళీ మళ్ళీ వచ్చింది. పొడిచింది. రక్తం కారింది. అది నీ మీద పడింది. నీ సుఖ నిద్ర చెడింది. కోపగించుకున్నావు నీవు. 'నిన్ను గాయపరిచిందెవరు? అయిదు తలల పాముతో చెలగాటమా?' అన్నావు. అటు ఇటు చూశావు. ఎదురుగా కాకి కనిపించింది. నెత్తురుతో తడిసిన దాని గోళ్ళు చూశావు. ఆ కాకి ఇంద్ర కుమారుడు. దేవ కార్యమై వచ్చాడు. అలా గుర్తించావు. ఒక దర్భ తీశావు. బ్రహ్మాస్త్రంగా మంత్రించావు. వేశావు. అది కాలాగ్నిలా మండింది. కాకిని వెంటాడింది. తండ్రి రక్షించలేకపోయాడు. దేవతల చేత కాలేదు. ఋషుల చేత కాలేదు. తిరిగి తిరిగి నీ ముందు వాలాడు. నీవు దాన్ని చంపలేదు. కరుణించావు. ఒక కన్ను తీశావు. అస్త్రం శాంతించింది. అపుడా కాకి నీకు నమస్కరించింది. దశరథ మహారాజుకి నమస్కారం చెప్పింది. దేవలోకానికి పోయింది.

రామా! నాకోసం ఒక కాకిపై బ్రహ్మాస్త్రం ప్రయోగించావు. ఇపుడు రాక్షసుల మీద అస్త్రాలెందుకు ప్రయోగించకున్నావు? నాగులు గంధర్వులు అసురులు దేవతలు యుద్ధంలో నీముందు



నిలువలేరు. నా మీద ప్రేమ ఉంటే వాడి బాణాలు వెయ్. రావణుని చంపు. లక్ష్మణుడు నన్నెందుకు ఉపేక్షిస్తున్నాడు? హనుమా అన్నదమ్ములిద్దరూ సమర్థులు. నన్ను రక్షించలేకున్నారు. ఏదో పాపం చేశానేమో అని కన్నీరు కార్చింది. దీనంగా విలపించింది సీతాదేవి.

అపుడు నేను ఓదార్చాను. అమ్మా! రాముడు దుఃఖంలో ఉన్నాడు. నిజం. ఒట్టు. అన్నని చూసి తమ్ముడూ దుఃఖిస్తున్నాడు. ఇపుడు నీ జాడ తెల్సింది. ఉత్సాహం పుంజుకుంటారు. ఇక్కడికి వస్తారు. లంకను భస్మం చేస్తారు. సబాంధవంగా రావణుని సంహరిస్తాడు రాముడు. నిన్ను అయోధ్యకు తీసుకెళ్తాడు అని ధైర్యం చెప్పాను. రామునికి గుర్తుగా ఏదైనా ఇమ్మని అడిగాను. కొంగుముడి విప్పింది. చూడామణి తీసింది. ఇచ్చింది నాకు. నేనామెకు నమస్కరించాను. ప్రయాణమైనాను.

అపుడు మళ్ళీ చెప్పింది. సింహ సదృశులు రామలక్ష్మణులు. వాళ్ళని, సుగ్రీవుణ్ణి యోగక్షేమాలు అడిగినట్లు చెప్పు. నన్ను దుఃఖ సముద్రం లోంచి కడతేర్చు. అది నీవే చేయాలంది నాతో. హనుమా! నా కష్టాలు చెప్పు. నేను పడే దుఃఖం చెప్పు. రాక్షస స్త్రీల బెదిరింపు చెప్పు. సుఖంగా వెళ్ళు అంది సీతాదేవి.

కాసేపు ఆగింది. మళ్ళీ చెబుతోంది ఇలా.

రాముడు రావణుని హతమార్చాలి. శీఘ్రంగా నన్ను తీసుకెళ్ళాలి. ఈ మాట మరీ మరీ చెప్పాలి రామునితో. తర్వాత నన్ను అక్కడ ఒక రోజు ఉండమని కోరింది తల్లి సీతమ్మ.

ఎక్కడైనా రహస్యంగా ఉండు. విశ్రాంతి తీసుకో. రేపు వెళ్ళు. నీవు ఉంటే నా దుఃఖానికి ఉపశమనం లభిస్తుంది. నీవు వచ్చేవరకు నేను వుంటానో లేదో. నీవు వెళ్ళిపోతే నా దుఃఖ పరంపరలు నన్ను పీడిస్తాయి.

వీర హనుమా! నాకో సందేహం. వానరుల్లో నీవు గొప్పవాడివి. సముద్రం దాటావు. కాని వానర సైనికులు కాని రామలక్ష్మణులు కాని దాటగలరా? గరుత్మంతుడు వాయుదేవుడు నీవు – ఈ ముగ్గురే సముద్రాన్ని లంఘించగలరు. ఈ కార్యం ఎలా నెరవేరుతుంది? హనుమా! నీవు సమర్థుడవు. కార్యం సిద్ధింప చెయ్. అది నీకు కీర్తినిస్తుంది. రావణుడు నన్ను దొంగచాటుగా తెచ్చాడు. అలా రాముడు చేయరాదు. ససైన్యంతో రావాలి రాముడు. రావణుని చంపాలి. అది రామునికి కీర్తికరం.

సీతామాత చెప్పినవన్నీ విన్నాను. అపుడు నేను చెప్పాను. అమ్మా సుగ్రీవుడు బలవంతుడు. నిన్ను రామ సన్నిధి చేర్చాలి – అది ఆయన సంకల్పం. అదాయన కృత నిశ్చయం. పరాక్రమవంతులు బలశాలురు మా వానరుల్లో ఎందరో ఉన్నారు. ఎందరో భూ ప్రదక్షిణలు చేశారు. పైకి కిందికి అడ్డంగా ఎలాగైనా ఎగరగల సమర్థులు. అందరూ నాకంటే బలవంతులు. నాతో సమానులు. నాకంటే తక్కువ వాడు ఒక్కడు కూడా లేడు. ఇలాంటి కార్యాలకి చిన్నవాళ్ళని పంపుతారు. దూతగా పెద్దవాళ్ళని పంపరు. నేనే సముద్రం దాటాను. ఇక తక్కిన వానరుల మాట చెప్పనేల? అమ్మా శోకించకు. రామ లక్ష్మణులు నా భుజాలపై కూర్చుంటారు. నీ వద్దకు తెస్తాను వాళ్ళని. ఆ అన్నదమ్ముల్ని లంకా ద్వారం దగ్గర చూడగలవు. గోళ్ళు కోరలు ఆయుధాలు గల వానరుల గర్జనలు వినగలవు. త్వరలో శత్రువుల్ని హతమార్చుతాడు రాముడు. విజయోత్సాహంతో అయోధ్య చేర్తాడు. నీతో పట్టాభిషిక్తుడవుతాడు – అలా ఓదార్చాను సీతామాతను.

రామా! రాక్షసులు ఎంతో పీడిస్తున్నారు. బెదిరిస్తున్నారు. నీ వియోగ దుఃఖంలో పరితపిస్తోందామె. మైథిలికి నీ బలపరాక్రమాలు చెప్పాను. సంతోషించే విధంగా మంగళకరమైన మాటలు చెప్పాను. ఓదార్చాను. ప్రసన్నురాలిని గావించాను. ఆమె మనశ్శాంతి పొందింది.

ఈ సుందరకాండ శ్రీరామాయణంలో ఒక మహిమాన్వితమైన కాండ. ఈ కాండ చదివినవారికి మనశ్శాంతి లభిస్తుంది. హనుమ అనుగ్రహం లభిస్తుంది. తద్వారా సీతారాముల కృపకు పాత్రులౌతారు. ఈ సుందరకాండ పూర్తయ్యాక పట్టాభిషేకం చేయాలి. లేదా కనీసం ఆ పట్టాభిషేక ఘట్టం చదవాలి. అది సనాతన సంప్రదాయజ్ఞుల మాట.

**సుందరకాండ సంపూర్ణం**

**సర్వం శ్రీరామార్పణమస్తు**



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 93 వ కళ్యాణం

తేది 06-12-2025 శనివారం రోజు ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. ఇంటి నెం.34-100/4 వద్ద రోడ్ నెం.8, వివేకానందపురం కాలనీ, భావన్ స్కూల్ వెనకాల, సైనిక్ పురి, సికింద్రాబాద్ లో శ్రీమాన్ బుర్లి కృష్ణమూర్తి, శ్రీమతి తులసి దంపతుల నిర్వహణలో జరిగింది.

## 94 వ కళ్యాణం

తేది 21-12-2025 ఆదివారం ఉదయం 11 గంటల నుండి అల వైకుంఠపురం ఫామ్ హౌజ్, కనకమామిడి/కేతిరెడ్డిపల్లి, మొయినాబాద్, రంగారెడ్డి జిల్లాలో జరిగింది. దీనిని శ్రీమాన్ డా॥ పూల మురళీధర్ గుప్తా, శ్రీమతి లలిత దంపతులు , కుటుంబ సభ్యులు నిర్వహించారు.



# అంబరీషోపాఖ్యానం

– ఎస్.ధర్మారావు

శా|| "సప్తద్వీప విశాల భూభరము దోః స్తంభంబు నంబూని సం
ప్రాప్త శ్రీయుతుడై మహా విభవ సం పచ్చాతురిం గల్గి దు
ర్వ్యాప్తిం జేయక వైష్ణవార్చనం వేరంగాల ముం బుచ్చుచున్
సుప్తిం బొందక యొప్పె సద్గుణ గరిష్టు డంబరీషుం డిలన్"

ఆ పుణ్యాత్ముని జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు ఎల్లప్పుడు శ్రీ విష్ణు కైంకర్యము నందే నిమగ్నములై ఉంటాయి.

సప్త ద్వీపముతో కూడిన భూ మండలానికి అంతటికి పాలకుడైన అతనికి ఐహిక భోగములందు కోరిక లేదు. నిత్యం శ్రీహరిని, హరిభక్తులైన భాగవతులనూ అర్చిస్తూ నిశ్చలంగా కాలం గడుపుతూ ఉండేవాడు. విష్ణువు నందే లగ్నమైన మనస్సును కలవాడైనా తనకు విహితమైన రాజ్యపాలనము చక్కగా సాగిస్తూ అతడు రాజర్షి అనే బిరుదుకి

తగిన వాడనిపించుకున్నాడు. అలా అతడు ఈశ్వరాయుత్తమైన చిత్తముతో రాజ్యము చేస్తూ ఉండగా అన్నింటి యందు నిరాసక్తత కలిగింది.

ఇలా కొంతకాలం గడిచిన పిదప ఆ రాజర్షి సంసార జంజాటమును పూర్తిగా వదులుకున్నవాడై ఏకాంత భక్తితో విష్ణుధ్యాన పరాయణుడై ఉంటూ ఉండగా శ్రీహరి అతని యెడల ప్రసన్నుడై వైరి శిక్షకము అగు తన సుదర్శన చక్రమును అతని రక్షణకు ఏర్పాటు చేశాడు. చూశావా రాజు అంబరీషుడు మార్జాల కిశోర న్యాయంతో శ్రీహరినే ఆశ్రయించగా అతడే తన భక్తుని రక్షణ భారాన్ని వహించాడు. తనకు అన్నివిధాలా అనుకూలవతి అయిన ధర్మపత్ని సహకరిస్తూ ఉండగా ఆ రాజర్షి ఒక ఏడాది పాటు ఇతర చింతలను మాని శ్రీహరి ప్రీత్యర్థం ద్వాదశీ వ్రతం నియమపూర్వకంగా ఆచరించాడు. వ్రతం పరిసమాప్తి అయిన తర్వాత కార్తీకమాసములో మూడు రాత్రులు ఉపవాసం ఉండి కాళిందీ నదిలో స్నానము చేసినవాడై మధువనంలో శ్రీహరికి అభిషేకం చేసి గంధాక్షతలతో పూజించి సుగంధభరితమైన పుష్పాలను సమర్పించాడు. ఇలా వ్రత ఉద్యాపన చేయడానికి సిద్ధపడ్డాడు.

ఎంతో మంది బ్రాహ్మణులకు కుండ పొదుగులు గల గోవులను లక్షల కొలదీ దానం చేసి బ్రాహ్మణ సమారాధన చేసి తాను కూడా వ్రత పారాయణ చేయడానికి పూనుకున్నాడు. అంత –

కం ॥ భూసుర నిగమ పదోప
వ్యాసుడు సు తపో విభాను దనుపమ యోగా
భ్యాసుడు రవిభాసుడు దు
ర్వాసు డే తెంచె తన్నివాసంబు నకున్

సరిగా అదే సమయంలో వేదమూర్తి, మహా తపశ్శాలి, ఈశ్వరాంశ సంభూతుడు అయిన దూర్వాసుడు, సూర్య తేజస్సును తిరస్కరించే తేజంతో అంబరీషుని నివాసానికి వచ్చాడు. వెంటనే ఆ రాజర్షి ఆ మహర్షికి ఎదురేగి పాదాలు కడిగి అర్ఘ్యం ఇచ్చి ఉన్నతాసనం పైన కూర్చుండబెట్టి వ్రతపారణంలో తన సహపంక్తి భోజనం చేయమని ప్రార్థించాడు. ఆ మహర్షి సంతోషంతో తన అంగీకారం తెలిపి ఇపుడే స్నాన సంధ్యాదులు ముగించుకొని వస్తానని కాళింది నదికి వెళ్ళాడు. స్నానానికి వెళ్ళిన ఆ ముని కాళింది జలాల్లో మునిగి ఎంతసేపటికీ పైకి లేచి రాలేదు. ఏకాదశి ఉపవాసానంతరం మరునాడు ద్వాదశి ఘడియలు వెళ్ళిపోక ముందే పారణ చేయవలసి ఉంది. అది వ్రత నియమం. అందుచే అంబరీష మహారాజు ద్వాదశీ అర్ధ ముహూర్త కాలము మాత్రమే మిగిలి ఉండుటచే మహర్షి ఇంకను తిరిగి రాకపోవుటచే ఏమి చేయడానికి పాలుపోక ధర్మవిధులైన బ్రాహ్మణులను రప్పించి తన ధర్మ సంకటమును వారికి వివరించి కర్తవ్యం ఏమిటో సెలవిమ్మని వారిని కోరినాడు. అందుకా విప్రులు ఆలోచించి ఇలా చెప్పారు.

ఓ మహారాజా! భోజనానికి పిలిచి అతిథి రాకుండా భోజనం చేయరాదు. అలాగని ఆలస్యం చేసి ద్వాదశి ఘడియలు దాట బెట్టుకుని వ్రత భంగమును కూడా చేయరాదు. కనుక ద్వాదశి ఉండగా జల భక్షణము చేసినట్లయితే అది భోజనము కాదు కనుక అతిథిని అతిక్రమించినట్లు కాదు. సలిల పానం జరుగును కనుక ద్వాదశి పారణ ఫలితం కూడా దక్కుతుంది.

ఆ.వె అతిథి వోయి రామి! నధిప యీ ద్వాదశి
పారణంబు మాన! పాడిగాదు
కుడువ కుండ గాదు! గుడుచుటయు గాదు
సలిల భక్షణంబు! సమ్మతంబు

అన్నారు. ధర్మవిదులైన ఆ విప్రుల వాక్యాన్ని విష్ణువు ఆనతిగానే భావించి ఆ రాజర్షి హరినామస్మరణ పూర్వకంగా, కొంచెముగా జలమును త్రాగి ఆ ముని తిరిగి వస్తాడని నిరీక్షిస్తూ కూర్చున్నాడు. ఈ లోపున యమునలో అఘమర్షణము నిర్వహించుకొని ముని తిరిగి వచ్చాడు. అలా వస్తూనే దూర్వాస మహర్షి జ్ఞానదృష్టితో రాజు చేసిన సలిల భక్షణమును గ్రహించి ఆగ్రహోద్రగుడయ్యాడు. కోపంతో ఒళ్ళు తెలియని మహర్షి పళ్ళు పటపట కొరికి కన్నుల నిప్పులు కురిసేటట్లు రాజును చూసి, ఆకలి దహిస్తూ ఉండడం చేత కోపం ఇబ్బడి ముబ్బడి కాగా ఈ ధనమదాంధుణ్ణి చూశారా! ఇతడు దురహంకారి. నిజానికితడు విష్ణుభక్తుడు కాదు. నన్ను భోజనానికి పిలిచి నా జపం అయి వచ్చేలోపునే భుజించి దుష్కర్మ చేసిన వాడయ్యాడు. నా యెడల అపరాధం చేసిన ఇతణ్ణి నా కోపం నుండి ఎవరు తప్పించగలరో చూస్తాను అని –

చ॥ "పెటపెట బండ్లు గీటుచును భీకరుడై కనుక్రీవే నిప్పుకల్
పొట పొట రాల గండములు పొంగ మునీంద్రుడు హుంకరింపుచున్
జట మొదలంటగా పెరికి చక్కన దానన కృత్య నాయు భో
త్కట వలమాన హస్తయుతంగా నొనరించె నయించె రాజు పైనే"

హుంకరిస్తూ తన జడలలో ఒకదానిని పెరికి మంత్రించి దానిని భయంకరమైన ఆయుధం ధరించిన కృత్య అనే రాక్షసిగా చేసి రాజుపై ప్రయోగించాడు. ఆ కృత్య పైకి వస్తోంది.

శ్రీహరి విశ్వరూపుడు కనుక ఆ విషయం గ్రహించి ఆ వెర్రి తపస్వి చేసే ఆ దుందుడుకు కని చక్కబెట్టు అని సుదర్శన చక్రాన్ని పంపించాడు. తక్షణం చక్రం వచ్చి రాజు మీదకు వస్తున్న కృత్యను భస్మం చేసింది. తరువాత ముని వెంట బడింది. ఆ మహర్షి భయపడి మేరు గుహలోకి పరుగెత్తాడు. చక్రం అతణ్ణి వెన్నంటింది. అది ఆ ఋషి ఎక్కడికి వెళితే అక్కడికి వెంబడించి తాపం కలిగించసాగింది ఆ శ్రీహరి చక్రం. అలా మహర్షి –

ఉ॥ భువి దూరన్ భువిదూరు నబ్ధి జొర నబ్ధిం దొచ్చు నుద్వేగయై
దివి బ్రాకన్ దివిబ్రాకు దిక్కులకు బో దిగ్వీధులన్ బోవు జి
క్కి వెసన్ గ్రుంగిన గ్రుంగు నిల్వ నిలుచున్ గ్రీడింప గ్రీడించు నా

క్క వడిన్ దాపసు వెంటనంటి హరిచక్రం బవ్య దుర్వక్రమై
ఏ లోకంబునకైన వెంటబడి తోనే వెంచు చక్రానల
జ్వాలన్ మానుపు వారు లేమి జని దేవ జ్యేష్ఠు లోకేశు వా
డా లోకించి విధాత విశ్వజనన వ్యాపార పారణ రే
ఖాలీ వేక్షణ కావలేక రుణ చక్రంబు న్నివారంపవే"

శ్రీహరి చక్రం ఎటు వెళ్ళినా తనను వదలదని గ్రహించిన ముని తిన్నగా సత్యలోకానికి వెళ్ళి పితామహుని పాదాలపై వ్రాలి చక్రానల జ్వాలల నుంచి రక్షించమని వేడుకున్నాడు.

ఓ మహర్షీ! నేను శివుడు, దక్షుడు, ఇంద్రాది దేవతలు, ప్రజాపతులు, భృగుడు, భూతపతులు మొదలగు వారమంతా ఎవని ఆజ్ఞ శిరసా వహిస్తామో అటువంటి శ్రీహరి చక్రాన్ని అడ్డుకోవడానికి నేను చాలను అన్నాడు. మహర్షి విఫల మనోరథుడై వెంటనే కైలాసానికి పరుగిడి ఆ పరమేశ్వరుని పాదాలపై వ్రాలి శరణు అన్నాడు. దానికి ఈశ్వరుడు నాయనా! ఏ పరమేశ్వరుని యందు బ్రహ్మాది స్తంబ పర్యంతం, ఈ భూతరాశులు పుట్టి పెరిగి లయ మవుతూ ఉంటాయో నేను, దేవలుడు, ప్రహ్లాదుడు, నారదుడు, బ్రహ్మ, సనత్కుమారుడు, కపిలుడు, మరీచ్యాదులు అందరము ఎవని మాయ దాటలేమో, ఎవని కరుణకు నోచుకోవాలని చూస్తూ ఉంటామో అటువంటి సర్వలోకనాథుని ఆయుధాన్ని మేము అడ్డుకోలేము. కనుక నీవు ఆ స్వామినే శరణు పొందు అని ఆనతిచ్చాడు. మహర్షి వెంటనే వైకుంఠానికి పరుగెత్తి ఆ శ్రీహరి పాదములకు మ్రొక్కి, ఓ దేవాదిదేవా! ఓ వరదా! ఓ భక్త రక్షామణీ! నన్ను కరుణించి ఈ చక్రానల జ్వాలల నుండి రక్షించు.

ఓ మునీ! భక్తులు వారి హృదయంలో నన్ను రజ్జువులచే బంధించి మావటీడు మదగజాన్ని తీసుకొని పోయినట్లు తీసుకొని పోతారు. ఇది కూడా విను.

ఆ.వె నాకు మేలు గోరు! నా భక్తుదగువాడు
భక్తజనుల కేన! పరమ గతియు
భక్తుదెందు జనిన! బరతెంతు వెనువెంట
గోవు వెంట దగులు! కోదె భంగి!

అని అంటూ శ్రీహరి ఓ మహర్షీ! అంబరీషుడు మహా సాధువు. అన్యులకు ఎప్పుడూ అతడు హాని చేయడు. అటువంటి వానికి నీవు అపకారము తలపెట్టి ఆపదలో చిక్కుకొన్నావు. విప్రులకు తపస్సు, విద్య ఈ రెండు ముక్తి కారకములు. కాని దుర్వినీతులైన వారికి అవే కీడు చేస్తాయి. నా తేజస్సు సాధుజనులలో నిక్షిప్తమై ఉంటుంది. వారిని బాధించే వారిని, ఆ తేజస్సు ఆయుధ ప్రయోగం వలె భయపెడుతూ ఉంటుంది. వారి మనస్సులో ఉన్న సంతోషాన్ని నాశనం చేస్తుంది అని చెప్పి నీవు చేసిన తప్పిదానికి ప్రతిక్రియ చేయగలవాడు ఆ రాజర్షి అంబరీషుడు మాత్రమే. కనుక నీవు అతని వద్దకు వెళ్ళి అతణ్ణి ప్రార్థించు అని చెప్పాడు.

అపుడు దూర్వాసమహర్షి తాను యెగ్గు తలపెట్టిన అంబరీషునే



శరణు వేడవలసి వచ్చినందుకు సిగ్గుపడుతూ గత్యంతరము లేక అంబరీషుని వద్దకు వచ్చి శరణు, రక్షించు అంటూ అతని రెండు పాదాలు గట్టిగా పట్టుకొన్నాడు. ఆ రాజర్షి తపస్వి తన రెండు పాదాలు పట్టుకొన్నందుకు నొచ్చుకొంటూ అతనిపై దయ తలచిన వాడై సుదర్శన చక్రాన్ని ఇలా ప్రార్థించాడు.

ఓ దేవ దేవుని ఆయుధరాజా! శ్రీహరి ఆజ్ఞచే నువ్వు దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షిస్తూ ఉంటావు. ఈ తాపసి దుష్టుడు కాడు. ఆపన్నుడు అందుకే ధర్మవృత్తి గల నీవు ఈ తపస్విని రక్షించవలసింది.

ఇంద్ర శత్రువులైన రాక్షసులకు తోకచుక్క వంటిది, ధర్మాన్ని, లోకాన్ని రక్షించేటువంటిది అయిన శ్రీహరి ఆయుధ రాజమునకు నమస్కారము. నేను ధర్మప్రవర్తకుడను అయితే, విప్రుల కోర్కెలు నెరవేర్చేవాడినే అయితే బ్రాహ్మణులకును నేను దైవం వలె భావించే వాడినయితే ఈ మహర్షికి శుభం కలుగు గాక అని ప్రార్థించాడు. రాజు ఇలా ప్రార్థించేసరికి శ్రీ సుదర్శన చక్రం శాంతించి మునిని విడిచిపెట్టి వెళ్ళింది. మహర్షి భయం తీరి రాజును కొనియాడి ఆ రాజర్షి ఆతిథ్యం స్వీకరించి, ఆ మహారాజును పెక్కు విధాల దీవించి సంతోషంగా తిరిగి వెళ్ళాడు. అతిథిని తృప్తి పరచిన ఆనందంతో రాజర్షి శ్రీహరిని సేవించే వారికి బ్రహ్మపదం మొదలుకొని సమస్త భోగాలు నరక ప్రాయమని నమ్మి రాజ్యము నందలి ఆసక్తిని విడిచి తనకు దీటైన పుత్రులకు రాజ్యభారం అప్పగించి కామాది అరిషడ్వర్గాలను జయించినవాడై అరణ్యములకు పోయి తపస్సు చేసి హరిని సంప్రీతుని చేసి విష్ణుపదం పొందాడు.

# ముకుందమాల

- డా|| భువనేశ్వరి మారేపల్లి, 9550241921

ధారావాహికం



## 39 శ్లోకం

క్షీరసాగర తరంగ శీకరా
సార తారకిత చారు మూర్తయే ।
భోగి భోగ శయనీయ శాయినే
మాధవాయ మధు విద్విషే నమః ॥

క్షీరసముద్రము యొక్క అలల తుంపర్ల చేత వ్యాపించ బడిన దివ్యమంగళ విగ్రహము కలిగినట్టియు, అనంతుడి మీద శయనించి ఉండునట్టియు, మధువు అనే రాక్షసుడికి శత్రువైనట్టి శ్రీమహాలక్ష్మి పతికి నమస్కారము చేయుచున్నాను.

"తస్మాత్ ప్రణమ్య ప్రణిధాయ కాయం ప్రసాదయే త్వామహమీశమీడ్యమ్ ।
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుమ్ ॥"

అను భగవద్గీత 11వ అధ్యాయము 44వ శ్లోకము ప్రకారము తన తప్పులు మన్నించబడవలయునని ఈ శ్లోకమున స్వామికి నమస్కరించుచున్నాను. అందుకే ఓ ప్రభూ, నీకు ప్రణమిల్లుతూ సాష్టాంగ ప్రణామం అర్పిస్తూ, నీ కృప వేడుకుంటున్నాను. ఒక తండ్రి కొడుకుని సహించినట్టుగా, ఒక మిత్రుడు తన మిత్రుడిని క్షమించినట్టుగా, ప్రేమించినవారిని ప్రేమికుడు మన్నించినట్టుగా, దయచేసి నా అపరాధములను మన్నింపుము.

ఎవరికైనను అత్తవారింట ఆడంబరములు అధికముగా ఉంటాయి. ఔదార్యము కూడా అధికముగ ఉండును. అందులో మామగారు గొప్పవాడైతే అల్లుడికి మరింత ఆడంబరములు కలుగుతాయి. స్వామికి మామగారిల్లు క్షీరసాగరం. ఆ సముద్రుడు రత్నాకరుడు. రత్నములకు స్థానమైనవాడు.

అలాంటి కులశేఖరులు అత్తగారింట ఉండే స్వామిని వర్ణించి సేవించుచున్నారు. స్వామి క్షీర సాగరమున నివసించుచున్నారు. అలలు కొట్టుచుండగా పాల తుంపరులు మీద పడినవి. అవి మేఘ శ్యాముడగు స్వామి యందు నక్షత్రములవలె ఉన్నాయి. అందుచేత అందముగా ఉన్నాయి.

మంచిగాలి, చల్లని పాల తుంపరలు అత్యంత ఔదార్యము కలిగిన మామగారిల్లు మృదువైన అనంతుడిని పాన్పు కలిగిన స్వామీ లక్ష్మీదేవిని కలిగిఉన్నారు. అంతటి సుఖాశీనతలో ఎవరైన ఉంటే కర్తవ్యములను వదిలేస్తారు. కానీ పరమాత్మ అలాంటి వాడు కాదు. ఇలాంటి సమయమందు కూడా ఆశ్రితులను మరవడు. అలాంటి వాడికి నమస్కరించెదను అని కులశేఖరాళ్వార్లు వివరిస్తున్నారు.

అలా రామ నామ జపంతో తరించి, ప్రజలను తరింప చేసిన వారిలో ఒక మేలిమి రత్నం వంటి వారు నామ సంకీర్తనావతార పురుషుడు 'కుందుర్తి నరసదాసు' గారు.

'కలియుగంలో 5వేల సంవత్సరాలు దాటాక భగవన్నామ సంకీర్తనకు, రూప భక్తి ప్రచారానికి ఎక్కువ అవసర మేర్పడింది. ఉత్తర భారతదేశంలో శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారి, శ్రీ హరేరాం బాబాజీ, శ్రీ సియా రఘునాధ శరణ గార్లను భగవంతుడు తన అంశతో జన్మింప జేసి, వారి ద్వారా నామ సంకీర్తనా రూప భక్తి ప్రచారం చేయించాడు. ఆంధ్రదేశంలో అలాంటి ప్రచారానికి శ్రీ కుందుర్తి నరసదాసు గారిని, శ్రీ రఘువర దాసు గారిని సృష్టించి

ప్రచారం చేయించాడు విశ్వాత్మ. శ్రీ రఘువర దాసు పూర్వాశ్రమం లోనూ, సన్యాసాశ్రమం తీసుకొని శ్రీ అవధూతేంద్ర సరస్వతి పేరుతో ప్రసిద్ధి చెందారు.

"శ్రీ కుందుర్తి నరసదాసు" గారు భగవదంశ సంభూతులు, కారణజన్ములు. పుట్టిన దగ్గర్నుంచి భగవన్నామ సంకీర్తన చేస్తూ, సంకీర్తనా మాధుర్యాన్ని రుచి చూసి, క్రమంగా నామ సంకీర్తనావతార పురుషులుగా మారారు. వీరికి ఆంధ్రా వాల్మీకి వాసుదాసు గారు అనే శ్రీ వావికొలను సుబ్బారావు గారు గురువులై రామమంత్ర ఉపదేశాన్ని పొంది, శ్రీరామ కోటి రాస్తూ, రామనామ సంకీర్తనలో పవిత్ర జీవితం గడుపుతూ ఉండేవారు. వాసుదాసు గారు వీరిని చూసి "లోక కల్యాణం కోసమే నీ మూర్తి అవతరించింది. కనుక రామనామ ప్రభావాన్ని ప్రచారం చేస్తూ తరించు" అని ఆశీర్వదించారు.

నరసదాసు గారు త్రివేణీ సంగమ జపమాహాత్మ్యం విని, అక్కడికి వెళ్లి, మాఘమాసమంతా అక్కడే తపస్సు చేస్తూ రోజుకు 80 వేల రామనామాన్ని జపిస్తూ ఉండగా, ఫలితంగా ఒక మహా పురుషుడు ప్రత్యక్షమై, దాసు గారికి హస్తమస్తక సంయోగంతో "శ్రీరామ త్రయోదశాక్షర మంత్రం" ఉపదేశించి, నామ ప్రచారంతో ప్రజలను తరింపజేయమని ఆశీర్వదించి, అంతర్ధానమయ్యారు. తర్వాత దాసుగారు శ్రీరామ జన్మక్షేత్రం అయోధ్యకు వెళ్లి, అక్కడ ఆ మంత్రాన్ని అక్షర లక్షలుగా పునశ్చరణ చేయగా కనులు మూసుకొని ఉన్న సమయంలో శ్రీరామ సాక్షాత్కారం లభించింది. కళ్ళు తెరువగానే అదృశ్యమై ఎదుట శ్రీశియా రఘునాథ శరణ్ గారు, దాసుగారి యోగ్యతను గుర్తించి, శ్రీరామ పంచాయతన మంత్రాన్ని కూడా ఉపదేశించి "శ్రీరామ శరణ్" అనే దీక్షానామం ఇచ్చి ఆశీర్వదించారు.

కాశీ వెళ్లి శివపంచాక్షరి, బృందావనంలో శ్రీకృష్ణ మంత్రాలను పునశ్చరణ చేసి, ఆ దేవతల అనుగ్రహం పొంది, శ్రీప్రభుదత్త బ్రహ్మచారి గారి ఆశీస్సులు పొంది, ఆంధ్రదేశానికి తిరిగి వచ్చారు నరసదాసుగారు. ఆంధ్రదేశంలో 'రామ' నామ సంకీర్తనలు చేస్తూ చేయిస్తూ, రామనామం స్మరిస్తూ బియ్యాన్ని ఏరి, దానినే అన్నంగా తినేవారు. ఒక కోటి రామకోటి రాసి, కోటిన్నర రామ కోటితో రామ జననం మొదలు పట్టాభిషేకం దాకా చిత్రాలను చిత్రించి, గుంటూరులోని శ్రీరామనామ క్షేత్రంలో ఆవిష్కరింప జేశారు. మొత్తం మీద 8కోట్ల రామనామం రాశారాయన. ఆయన నివసించిన బుద్ధాం అనే గ్రామంలో రామ మందిరాన్ని నిర్మించి, ప్రజలను రామభక్తులుగా మార్చి ఆ గ్రామానికి "నామ ప్రయాగ" అనే కొత్త పేరు పెట్టారు. రామమందిర నిర్మాణానికి తనకున్న యావదాస్తి చేతిలో ఉన్న డబ్బు అంతా ఖర్చు చేశారు నరసదాసుగారు. ఇది కాక చాలా గ్రామాలలో రామమందిర నిర్మాణం చేశారు. చాలా గ్రంథాలు రాశారు. సకాల సంధ్యావందనం, సహస్ర గాయత్రీ జపం, వైశ్వదేవం మొదలైనవి వారికి నిత్య కృత్యం.

శ్రీ శంకరుల అద్వైతాన్ని అధ్యయనం చేసి అందరికీ సుబోధకంగా బోధించారు. నిరాడంబర పవిత్ర జీవనం గడిపారు. ఎందరో నాస్తికులు వారి ప్రభావంతో ఆస్తికులయ్యారు. దాసుగారి జీవిత చరిత్రను వారి శిష్యులు శ్రీ పద్యాల సోదరులు వ్రాయగా, శ్రీగాయత్రీ పీఠాధిపులు శ్రీ శ్రీ విద్యాశంకర భారతీస్వామి వారు ఆశీర్వచనం పలుకగా, సర్వతంత్ర విశారద శ్రీ కుప్పా ఆంజనేయ శాస్త్రిగారు అభినందన వచనాలు రాశారు. ఇది 1986 డిసెంబర్ 26న ముద్రణ పొందింది.

**నరసదాసు గారి బాల్యం విద్యాభ్యాసం:**

గుంటూరు జిల్లా నరసరావు పేట, వినుకొండలకు మధ్యలో కుందుర్తి అనే గ్రామంలో నరసదాసు గారు జన్మించారు. లక్ష్మీ నరసయ్యగారు, వీరి సతీమణి సీతమ్మగారి దంపతులకు 2-5-1905 విశ్వావసు చైత్ర బహుళ త్రయోదశి, రేవతీ నక్షత్రయుక్త మకర లగ్నంలో రాత్రి 10గంటలకు నరసదాసుగారు జన్మించారు.

ఒక రోజున తల్లి నీళ్ళు తేవటానికి బావి దగ్గరకు వెడితే చిన్నారి దాసు ఏడుపు లంకించు కొంటే ఒక భిక్షువు "రామా దయ చూడవే" అనే కీర్తన పాడగా ఏడుపు ఆపేశాడు. ఇంతలో తల్లి వస్తే, పాడటం ఆపేస్తే మళ్ళీ ఏడ్చాడు. పాట పాడితే మానేశాడు ఇలా చాలా సార్లు జరిగింది అప్పుడా భిక్షువు "అమ్మా నీ కొడుకు సంకీర్తన మిత్రుడు. నామ గానంలో లీనమౌతున్నాడు. కొద్దికాలానికి రామభక్త రత్నంగా భాసిస్తాడు" అని చెప్పి దీవించి వెళ్లి పోయాడు. 5వ ఏడు నిండగానే తుర్లపాటి నరసింహం గారితో అక్షరాభ్యాసం చేయించారు.

1910లో చెరుకూరుకు నిమ్మగడ్డ రమణమ్మ గారింటికి నియమ నిష్ఠలున్న స్వాములవారొకరు వచ్చి ఒక జీర్ణ దేవాలయంలో వేదాంత ప్రవచనాలు చెప్పారు. ముందు వరుసలో కూర్చున్న బాల నరసయ్యను "దేవుడు ఎక్కడ ఉన్నాడు?" అని అడిగారు "ఆయన తడుముకోకుండా" దేవుడు గుడిలోనే కాదు. అన్ని చోట్లా ఉన్నాడు" అని చెప్పగా ఆశ్చర్యపోయారు స్వామి. ఆయన పులకించి అతడిని పిల్చి తన ఒడిలో కూర్చోపెట్టుకొని అందరితో "వీడు ప్రహ్లాదుడి లాగా లోకానికి ఆహ్లాదం కలిగిస్తాడు" అని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. జనం అవాక్కై తమ ఊర్లో మరో భక్త రామదాసు జన్మించినందుకు గర్వపడ్డారు.

నరసదాసు గారు మూడవ తరగతి పూర్తి చేసి, ప్రైవేట్ గా ఇంగ్లీష్ చదివి, పొన్నూరు హైస్కూల్ లో 7వ తరగతిలో చేరారు, రోజూ ఇంటి నుంచి పొన్నూరు వెళ్ళిరావటం కొడుకుకు కష్టం అవుతుందని తండ్రి గారు కాపురం పొన్నూరులోనే పెట్టారు.

పొన్నూరులో లక్ష్మీ నరసయ్యగారు చావలి సుబ్బారాయుడు

గారింట్లో అద్దెకు ఉండేవారు. రాయుడు గారింట్లో రాత్రి నిత్య భజన జరిగేది. నరసయ్య గారు ప్రసాదం సమయానికి వెళ్ళేవారు. ప్రసాదం మీద భక్తి కాని, అసలు భక్తి ఉండేది కాదు. క్రమంగా భజనపై ఆసక్తి కలిగి సంకీర్తనలలో తాళం వేస్తూ పాల్గొనేవారు. ఆ తర్వాత భక్తి పెరిగింది. ఆ భజనల్లో పాతూరి రామయ్య శాస్త్రిగారు ప్రవచనం చేసేవారు. సత్కాలక్షేపం మోక్షానికి దారి అని రోజూ చెప్పేవారు. అది నరసయ్య గారి మనసుపై గాఢ ముద్ర వేసింది. అప్పుడు కొల్లూరులో శ్రీ కృష్ణ జయంతి ప్రతి ఏడాది జరిపేవారు. ఒకసారి తండ్రితో తానూ వెళ్ళారు. అక్కడ ములుకుట్ల లక్ష్మీ నారాయణ శాస్త్రిగారు శ్రీ కృష్ణ చరిత్ర అద్భుతంగా వివరించేవారు. బాలకృష్ణుని చిలిపి చేష్టలు నరసయ్య గారి మనసంతా ఆక్రమించాయి. ఆ తన్మయ స్థితిలో నరసయ్యగారు "లాలకు రారా గోపాల కృష్ణా – నీ వేళా చిక్కవు నాకు" అనే కీర్తన శ్రీరాగం, ఆదితాళంలో రాశారు. బాలకృష్ణునిపై తల్లి యశోదకున్న వాత్సల్యమంతా కళ్ళకు కట్టించారు. ఆ కీర్తనను ఇప్పటికీ అక్కడ గానం చేస్తూనే ఉన్నారు. ఆయన బంధువు గుంటూరు వెంకటప్పయ్య గారు "ఆంధ్రుడై పుట్టి ఆంధ్రాన్ని అర్థం చేసుకోకపోతే అంధుడౌతాడు" అని నిత్యం చెప్పే మాటలు మనసుకు పట్టి, పొన్నూరు లైబ్రరీలో వెంకట పార్వతీశ కవుల నవలలు చదివి, ఒక్క ఏడాదిలో తెలుగులో నిష్ణాతులై, అనేక వృత్తాలలో పద్యాలు రాశారు. అందులో వారు రాసిన "గోపాల కృష్ణ శతకం" ప్రసిద్ధి చెందింది. అందులోని పద్యాలు–

**తే.గీ. "శ్రీ రమామణి చిత్త చోర –**
**భక్తజన మానసోద్యాన పారిజాత**
**రాధికాకుచ సరసిజ రాజహంస –**
**వందన మిదే వేణు గోపాలకృష్ణ"**

ఈ శతకమే కాక "నరసదాస కీర్తనలు" అనే మూడు భాగాలు కూడా రాశారు. భక్తి మధురభావ విలసితాలు దాసుగారి రచనలు.

### సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొనటం

గాంధీ పిలుపు అందుకొని సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత టంగుటూరి ప్రకాశం పంతులు గారి ఆధ్వర్యంలో గుంటూరులో శాసనోల్లంఘన జరిగింది. నరసయ్యగారు కూడా పాల్గొని సత్యాగ్రహం చేశారు. జైలుకు కూడా వెళ్ళారు. నరసయ్య గారు జైలు జీవితం ఆనందాన్ని కలిగించలేదు. మనసు భౌతికం నుంచి పారమార్థికానికి చేరి ఆధ్యాత్మిక ప్రయాణం ప్రారంభించారు.

### ఆధ్యాత్మిక సాధన వైరాగ్య ప్రాప్తి

నరసయ్యగారి మనసు, బుద్ధి ఆధ్యాత్మిక లగ్నం అయ్యాయి. ఆయనకు సరైన సమయంలో ఉపనయన సంస్కారం చేశారు తలిదండ్రులు. ఒకరోజు రాత్రి ఆయనకు ముక్తావిద్రుమ



హేమ నీల ధవళ దేహంతో శ్రీసరస్వతీ మాత సాక్షాత్కారం జరిగి "నీ నిష్ఠాగరిష్టలు నాకు నచ్చాయి. నీ జపదీక్ష నన్ను ఆకర్షించింది." "మంత్రాధీనం తు దైవం" అని మర్చిపోకు" అని చెప్పి అంతర్ధానమయింది. మేలుకొని తన జన్మం, మంత్ర జపం సఫలమైందని ఆమెకు కృతజ్ఞతలు చెప్పి ఆమెతో మాట్లాడే అవకాశం కలిగించనందుకు బాధపడ్డారు. భక్తి పెరిగింది కానీ ఆదాయం లేదు. భుక్తి గడవటం కష్టమైంది. ఇల్లు లేదు తినటానికి తిండికూడా లేదు. ఊరిలో మర్యాద మన్నన తగ్గి పోయాయి. భవబంధాలు తెంచుకొని వైరాగ్యం ద్వారా ఆనంద సామ్రాజ్యం అందు కోవాలని కోరిక గట్టి పడింది.

### వివాహం, ఉదర పోషణ

తండ్రిగారు తన కొడుకును ఆదర్శ కుటుంబిగా తీర్చి దిద్దాలనుకొని, నరసయ్య గారి మేనమామ కూతురు శేషాంబతో తన కొడుకుకు వివాహం జరిపించారు. ఆమె సద్గుణ గరిష్ట. ఆ దాంపత్యాన్ని లోకం బాగా మెచ్చింది. సంసార భారమంతా ఈ దంపతులపై పడగా, నరసయ్యగారు మద్రాస్ దగ్గర కమీషన్ వ్యాపారం చేసే షావుకారు దగ్గర గుమస్తాగా చేరారు. దాసుగారు అక్కడ పని చేయలేక గుంటూరు వచ్చేశారు. ఇంతలో తెనాలిలో జ్యోతిషాలయం స్థాపించిన చతుర్భుజ దాసు అనే ఆయన దగ్గర గుమాస్తాగా చేరారు. క్రమంగా అతడి శీలం మంచిది కాదనీ "పంచ 'మ' కారాలపై" ఆయనకు వ్యామోహం ఎక్కువని గ్రహించి, వాడి వద్ద ఉద్యోగం చేయరాదని మానేశారు నరసయ్య

గారు.

జమ్ములపాలెంలో భక్తులను చేరదీసి భజన సంఘం స్థాపించి, నామ సంకీర్తన బోధించి ఆస్తికత వ్యాప్తికి బాగా తోడ్పడ్డారు. ప్రతిరాత్రి 10గంటల నుంచి 12 వరకు సామూహిక భజన చేయించేవారు. అందరి సహకారంతో గ్రంథాలయం స్థాపించి, అక్కడా నిత్య సంకీర్తన జరిగేట్లు చేశారు. పెదకొత్తపల్లి వాసి చదలవాడ వెంకట సుబ్బయ్య గారి దగ్గర తరంగాలు నేర్చారు.

**ఆచార్యానుగ్రహం**

1926లో భగవదవతారమూర్తి అయిన ఆంధ్ర వాల్మీకి వాసుదాసు గారు అనేక ప్రాంతాలలో పర్యటించి భక్తి జ్ఞాన వైరాగ్యాలు బోధిస్తూ జమ్ములపాలెం వచ్చారు. రామాలయంలో రామతత్వాన్ని బోధిస్తూ రామ తత్వానికి మించింది, రామనామానికి, రామ మంత్రానికీ మించిందీ, రాముడికి మించిన పరదైవం లేదని నాలుగు గంటలు ప్రసంగం చేశారు. ఆ ఉపన్యాసానికి దాసుగారిలో ఆర్తి ఆవేశం ఆనందం ఆకర్షణ కలిగి ఆయన మార్గంలో జీవితం గడపాలనుకొన్నారు. రామకోటి రాముని చేరే సూటి మార్గం అని వారు చెప్పింది మనసులో నాటింది. వాల్మీకి వారి దృష్టి నరసయ్య గారిపై పడింది. ఆయన వచ్చి పాద నమస్కారం చేయగా, లేపి కౌగిలించుకొని “కుమారా! నీ చిరునవ్వు ముఖం చూసి నాకు ఆనందం కలిగింది. నీ మనసు తెలుసుకోవాలనే కోరిక కలిగింది. నీ భవిష్యత్తు చాలా ఉజ్వలంగా ఉంటుంది. నీ కీర్తి ప్రతిష్టలు దిగంతాలకు వ్యాపిస్తాయి. లోకాన్ని ఉద్ధరించటానికే నువ్వు పుట్టావ్. రామ తారకమంత్రం ఉపదేశానికి సర్వ విధాలా అర్హుడవు” అని చెప్పి తారకమంత్రం ఉపదేశించి నిశ్చల భక్తితో జపించ మని ఆజ్ఞాపించారు. తన జన్మ ధన్యమైనదని దాసుగారు భావించి వినయంతో వాసుదాసు గారితో “స్వామీ! మీరు చెప్పినట్లు త్రికరణ శుద్ధిగా రామమంత్రాన్ని జపిస్తాను” అనగా ఆశీర్వదించి వాసు దాసు గారు వెళ్ళిపోయారు.

మంత్రం సిద్ధి పొందాలనే కాంక్ష తీవ్రమై నరసదాసు గారు రోజుకు 21,600నామ జపం చేశారు. రోజుకు పదివేల రామకోటి రాశారు. రాత్రీ పగలూ రామధ్యానంతోనే గడిపారు. ఇలా నిరంతర రామ ధ్యానంతో ఒకకోటి పది లక్షల రామకోటి రాసి తాను నేర్చిన చిత్రలేఖనంతో రామాయణమంతా రామనామాలతో చిత్రించారు నరసదాసు గారు. ఇదొక కోటి అయింది. ఈ మొత్తాన్ని శ్రీరామచంద్రునికి అంకిత మిచ్చారు. ఆంధ్ర వాల్మీకి ఆశీస్సులతో దాసుగారు సంస్కృతం లో “గురు పూజా విధానం” రాశారు.

**యోగాభ్యాస మహిమలు**

యోగ సాధనంతో శారీరక, మానసిక ఆరోగ్యం సాధించాలని నరసయ్యగారు భావించి హఠయోగ ప్రక్రియ చదివి, స్వయంగా యోగాభ్యాసం చేశారు. జప ధ్యానాలతో మరింత శక్తి సాధించారు.

ఒకరోజు రాత్రి స్వప్నంలో సీతామాత సర్వాలంకార భూషితగా మెరుపు తీగలాగా దర్శనమివ్వగా తదేక దృష్టితో ఆమెను చూస్తూ ఉండగా ఆమె పసిపాపలాగా మారి ఆయన ఒడిలో కూర్చున్నది. ముద్దులొలికే ఆ చిన్నారి పాపను ఎత్తుకొని ముద్దాడబోగా కల మాయమయింది. మెలకువ వచ్చి భార్యకు అంతా చెప్పారు. ఆ పిల్ల ముచ్చట్లు ఆ దంపతులు ముచ్చటగా చెప్పుకొన్నారు. ఇంతలో భార్య శేషమ్మగారికి ప్రసవ వేదన కలిగింది. అప్పటిదాకా ఆమెకు ప్రసవ చిహ్నాలేవీ లేనేలేవు. ఆశ్చర్యంగా ఆడపిల్ల పుట్టింది. సీతాదేవి అనుగ్రహంతో పుట్టిన ఆ పాపకు “సీతా కల్యాణి” అని పేరు పెట్టుకొన్నారు.

నవవిధ భక్తి రసాలను నరసయ్యగారు ఆస్వాదించారు. సఖ్యభక్తిలో శ్రీరాముడు ఆయనతో ఆటలాడే వాడు. ఒకరోజు రాత్రి రాముడు స్నేహితుడుగా వచ్చి ఆయన ప్రక్క పడుకొన్నారు. భార్య అనుకోని కాలు వేస్తె, రాముడు లేచి “నీమీదున్న స్నేహంతో వచ్చి నీ పక్కన పడుకొంటే, నామీదనే కాలు వేస్తావా! ఇది నీకు న్యాయమా!” అని అలుకతో పలుకగా నరసయ్యగారు తెల్లపోగా, రాముడు “మిత్రమా! నీపాదం నాకు మోదం చేకూర్చింది. నన్నే నమ్మి భజించే వారంటే నాకు పరమ ప్రీతి. సుజనుల చరణ ధూళి నాకు పరమ పవిత్రం. దాన్ని ధరించటానికే నీ దగ్గరకు వచ్చాను” అని రామ చంద్రమూర్తి అదృశ్యమయ్యాడు. అమితాశ్చర్యపడ్డారు నరసయ్యగారు.

రామ భజనకు హనుమ ఉపాసన ముఖ్యం. ఆయన రామునికి నామానికి వారధి. అందుకే నరసయ్య గారు హనుమను అత్యంత భక్తితో అర్చించేవారు. ఒకరోజు రాత్రి 11గంటలకు చేసే భజన పూర్తి కాగానే భార్య శేషమ్మగారు “మనం బాగా బీదవాళ్ళం. ఇల్లు గడవటం కష్టంగా ఉంది. సంపాదన లేకుండా మీరు రామ భజన చేస్తుంటే సంసారం గతేమిటి వయసులో కాక ముసలితనంలో డబ్బు సంపాదించలేరు కదా!” అని భజన గురించి కొంచెం అవహేళనగా మాట్లాడితే ఆయన “అన్నిటికీ రాముడే దిక్కు అని నమ్మి ఉన్నాము మనం. ఆయనే చూసుకొంటాడు. ఆందోళన పడకు” అని ఊరడించారు. ఆమెకు తలకెక్కలేదు “రొక్కం లేకపోతే డొక్క నిండుతుందా, శుష్క వేదాంతంతో కడుపు నిండుతుందా అని వాకిలి తలుపు గడియ పెట్టటానికి గుమ్మం దగ్గరకు వెడితే, ఒక కోతి అమాంతం వచ్చి బలంగా ఆమె వెంట్రుకలు పీకింది. భయంతో అరిచి కింద పడిపోయింది. నరసయ్యగారు దీపంతో వచ్చి లేపి, ఆమె తల మధ్యభాగంలో వెంట్రుకలు కత్తిరించి ఉండటం చూసి “భగవదపచారం చేశావు. క్షమాపణ వేడుకో” అనగా ఆమె “నా తలపోటు తగ్గితే నా బంగారు గొలుసు ఇస్తాను. అప్పాలు పానకం చేసి నైవేద్యం పెడతాను అని

మొక్కుకొన్నది. వెంటనే ఆమె బాధ అంతా తగ్గింది. మర్నాడు ఉదయం పూజా సామాగ్రి ఉన్న చిన్న పెట్టెలో 72 రూపాయలు కనిపించాయి. ఇదంతా ఆంజనేయ మహిమ అని గ్రహించారు ఇద్దరూ. ఆ డబ్బును భగవంతుని పటాలు కొనటానికి ఖర్చు చేశారు. ఆరోజు నుంచి వారి బియ్యపు డబ్బాలో ఎప్పుడూ ఒక శేరు బియ్యం నిలవ ఉండేవి. రోజూ చేసే భోజనానికి భగవంతుడు లోటు రానీయడు అని గ్రహించారు దంపతులు.

నరసయ్యగారికి రోజూ దేవుడికి మృదు మధుర పదార్థాలు నైవేద్యం పెట్టాలని ఉండేది. కాని ఆర్థిక పరిస్థితికి అది గొంతెమ్మ కోరికే. ఒకరోజు ఇదే ధ్యాసతో ఆలోచిస్తూ నిద్రపోయారు. మర్నాడు ఉదయం పూజా సామాగ్రి పెట్టెలో నాలుగు పంచదార లడ్డూలు ఒక కాగితం పొట్లంలో కనిపించాయి. కాగితం మీద "శ్రీరామ నిలయం –అయోధ్య" అని హిందీలో రాయబడి ఉండటం చూసి అమితాశ్చర్యపడ్డారు. వాటిని అందరికి ప్రసాదంగా పంచిపెట్టారు. ఇలా రోజూ ఏదో ఒక మహిమ కనిపించేది. శేషమ్మగారి డబ్బు పోతూ, మళ్ళీ కనిపిస్తూ ఆమెకు నమ్మకం కలిగేది. ఒకసారి నరసయ్యగారు గురువు వాసు దాసు గారికి అలాంటి మహిమలు ఇక తనకు వద్దు అని కోరారు. తన శిష్యుని యోగసిద్ధి ఎంతవరకు వచ్చిందో తెలుసుకోటానికి ఆయన జమ్ములపాలెం వచ్చారు. గురువు గారికి అత్యంత భక్తితో శిష్యుడు స్వాగతం పలికారు. ఆయన అమిత శిష్య వాత్సల్యంతో దగ్గరకు తీసుకొని కౌగలించుకొని "నాయనా! నీ యోగసిద్ధి వినయ విధేయతలు ఆధ్యాత్మిక వివేకం మృదుమధుర భాషణం, నిర్మల మనసు, నీ మనసులోని ధర్మమూ నాకు తెలిశాయి. మహిమలు అధోగతికి సోపానాలు. జాగ్రత్తగా మసలుకో" అని హితవు చెప్పి వెళ్ళారు. ఇక తనకు ఏరకమైన మహిమలు చూపవద్దని ఆర్తిగా దేవుని నరసయ్యగారు ప్రార్థించారు. వాసుదాసు గారు రాసిన "మందరం"ను ముత్యాల వంటి అక్షరాలలో రాసి గురువు గారికి అందించారు నరసయ్యగారు.

కంతేరులో నరసయ్య గారు మూడు రోజులు నవవిధ భక్తి గురించి ప్రసంగించారు. ఆ ఉపన్యాసాల సారాంశం "నవవిధ భక్తులు" పుస్తకంగా ముద్రణ పొందింది. నరసదాసు గారు రామకోటి పూజలు చేసి, రామకోటి ఉత్సవాలను ప్రారంభించారు గుంటూరులో. ఆ తర్వాత "భానువార సంకీర్తనం" పేరుతో ప్రతి ఆదివారం భజన, ఉపన్యాసాలు జరిపించారు. నరసదాసుగారు "భక్త రామదాసు" కథా సంకీర్తనం చేశారు. ఇదే కథా సంకీర్తనకు పునాది అయింది.

**బుద్ధాంలో శ్రీరమాచ్యుత మందిర నిర్మాణం**

ఒకప్పటి బౌద్ధుల ఆవాస భూమి కనుక బుద్ధాం అనే పేరు వచ్చి ఉంటుంది. ఇప్పటికి అక్కడ బౌద్ధ నిర్మాణ అవశేషాలు కనిపిస్తాయి. నరసయ్య గారు బుద్ధాం వచ్చి అక్కడ మేనేజిమెంట్ స్కూల్ లో టీచర్ గా పని చేస్తూ కాపురం పెట్టారు. అక్కడకు వచ్చిన కొద్ది రోజుల్లోనే అక్కడ కలరా తీవ్రంగా వ్యాపించి, ఒకే వారంలో సుమారు 80మంది చనిపోయారు. జనం భయభ్రాంతులయ్యారు అక్కడ కనీసం ఒక్క దేవాలయం కూడా లేదు. కలరా వ్యాధి బారిన పడకుండా జనాలకు ధైర్యం చెప్పటానికి నరసయ్య గారు మాధవకీర్తన సప్తాహం నిర్వహించారు. మొదలుపెట్టిన కొద్దిరోజుల్లోనే వ్యాధితగ్గటం మొదలైంది. ఇది సంకీర్తన ప్రభావం అని జనం విశ్వసించారు. నరసయ్య గారిని "నరసదాసు" గారని గౌరవంగా సంబోధించేవారు. అరిష్టాలను అరికట్టటానికి ఆంజనేయ విగ్రహం స్థాపించి పూజ కూడా జరిపించారు. మంగళ శనివారాలలో తమలపాకు పూజలు, అప్పాల నైవేద్యం చేయించేవారు. దేవాలయం, అర్చన లేని గ్రామంలో ఒక్కపూట కూడా ఉండరాదనే ఆర్యోక్తిని అక్కడి జనాలకు నిత్యం చెప్పేవారు.

అలాగే ఒకసారి రాత్రి సంకీర్తన చేసి నిద్రకు ఉపక్రమించారు. ఆకలిగా ఉండటంతో నిద్ర పట్టలేదు. చిన్న కునుకు తీశారు. అందులోనే ఒక కల వచ్చింది. శ్రీరాముడు కనిపించాడు ఆయన అలసి పోయినట్లు, ఒళ్ళంతా చెమట కారుతున్నట్లు దాసుగారు చూశారు. శ్వాస మహా వేగంగా ఉండటంతో పరిగెత్తుకొని వచ్చినట్లు అనిపించారు. ఏదో చెప్పాలన్న తపనతో "వత్సా! ఆకలితో ఎంత బాధ పడుతున్నావో కదా. వెంటనే రాలేక పోయాను. నా భక్తుల ఆర్తి పోగొట్టటం నా ధర్మం. నీకోసం ఆహారం తెచ్చాను. త్వరగా లేచి తిని కడుపు నింపుకో" అని కుడి చేయిని దాసు గారి ఛాతీపై ఉంచాడు రామయ్య. ఆ స్పర్శకు దాసు గారికి మెలకువ వచ్చి లేచారు. ఇంటి గుమ్మం తెరిచి ఉంది. దీపం వెలుగుతూనే ఉంది. ఆశ్చర్యంతో లోపలికి వెళ్ళారు. అక్కడ ఒకపళ్ళెంలో నాలుగు గోధుమ రొట్టెలు, వాటిపై పెద్ద వెన్నముద్ద కనిపించాయి. దాసుగారి హృదయం ఉప్పొంగిపోయింది. మనసులో దైవధ్యానం చేసివాటిని తినటానికి కూర్చున్నారు. అవి అప్పటి కప్పుడే తయారు చేసినట్లు వేడిగా వెన్నతో ఉండటంతో రాముడే తాను తినే ఆహారాన్ని తెచ్చి పెట్టాడని నిశ్చయించారు. రామ మంత్ర పునశ్చరణ చేయాలనే తలంపు వచ్చి, మంత్రానికి ఎన్ని అక్షరాలు ఉంటె అన్ని లక్షలసార్లు నియమంతో జపించాలని నిర్ణయించు కొన్నారు. దీక్షగా ఒక్క నెలరోజుల్లో అనుకున్నది పూర్తి చేశారు. అహర్నిశలు రామనామ జపమే, మనసంతా రామమందిరమే చేసుకొన్నారు. వారి భక్తి పరాకాష్టకు చేరింది. రాముడిని చూడటానికి తహతహ లాడారు. అలా ఎన్నో సార్లు రామ సాక్షాత్కారం పొందిన మహనీయులు నరసదాసు గారు.

శ్రీరామ శరణ్ గారు "మహా మండలేశ్వర", "భాగవత చరిత వ్యాస్" బిరుదాంకితులు.

శ్రీ రామ శరణ్ గారి రచనలు:– రామ మంత్రానుష్ఠాన క్రమం, నవవిధ భక్తులు, కలి సంతనోపనిషత్, చరితావళి,

భారతీయం అనే ఉత్తమ వేదాంత గ్రంథాన్ని, శ్రీహనుమాన్ పొద్దార్ గారు హిందీలో రాసిన "బ్రహ్మ" అనే గ్రంథాన్ని సరళ తెలుగులో అనువదించారు.

బాపట్ల ఆంజనేయ దేవాలయంలో తులసీ రామాయణం లోని "వందవు నామ రామ రఘువరకో, హేతు కృశాను భాను హిమకరకో_ _ _ _." అనే చౌపాయిని ఒక గంటసేపు ఉపన్యాసంగా చెప్పారు.

1946 నుంచి రామనామంతో ఏరిన బియ్యాన్నే వండు కొని తింటున్నారు. గ్రామస్తులతో కూడా అలాగే చేయిస్తూ మరో రకమైన రామనామ ప్రచారం సాగించారు. రామనామ బియ్యపు అన్నమే తాను తినటానికి కారణాన్ని వివరిస్తూ "నేను కంటితో రాముని, రామభక్తులి రామనామాన్నీ, ప్రపంచాన్నీ సీతారామ మయంగా చూస్తున్నాను. చెవులతో రామచరిత వింటాను. నోటితో రామనామమే పలుకు తాను, దాన్ని గురించే మాట్లాడతాను. ముక్కు శ్వాస మీద రామనామ జపం చేస్తాను. చేతులతో రామనామం రామకథలు రాస్తూ ఉంటాను. కాళ్ళతో రామభక్తుల దగ్గరకు, రామాలయాలకు వెడతాను. మనసులో రామ రూప ధ్యానమే చేస్తాను. ఇక మిగిలిన ఈ పంచ భౌతిక శరీరాన్ని అంటే అన్నమయ కోశాన్ని రామ నామంతో ఏరిన బియ్యాన్నే అన్నంగా వండి రాముడికి నైవేద్యం పెట్టి తింటాను. అప్పుడు నేను ఈ పాంచభౌతిక శరీరంతో సహా శ్రీరాముడినే అవుతాను. నేను రామ సాగరంలో, రామనామంతో పుడతాను. రామనామంతో పెరుగుతాను, రామనామంతో చనిపోతాను" అదీ నరసదాస శ్రీరామ శరణ గారి అనన్య భక్తి. ఇలాంటి వారిని మనం చూసి ఉండం.

శ్రీమన్నారాయణుని కీర్తించి చిట్ట చివరిసారిగా వందన సమర్పణ చేస్తున్నారు కులశేఖరాళ్వారులు. ఇంతటితో ముకుందమాల పూర్తయింది. ఎందుకంటే ఆఖరిది, నలభైవది అయిన శ్లోకం కులశేఖరుని గురించి చెప్పబడిన ముక్తాయింపు మాత్రమే.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

# తిరుమల ఆలయంలో దర్బారు సేవ

**– శ్రీమతి వెలమకన్ని పద్మావతి**

తిరుమల ఆలయంలో స్వామివారికి జరిగే నిత్య సేవలలో "దర్బారు సేవ" ఒకటి. ఈ దర్బారు సేవనే "కొలువు సేవ" అని కూడా అంటారు. ఈ దర్బారు సేవను స్వీకరించే పంచలోహమూర్తిని కొలువు శ్రీనివాసమూర్తి అంటారు. లేఖన శ్రీనివాసమూర్తి, దర్బార్ శ్రీనివాసమూర్తి, బలిబేరం, అనిరుద్ధబేరం అనే వేర్వేరు పేర్లతో కూడా పిలుస్తారు. శ్రీవారి మూలమూర్తికి నకలు పంచలోహ ప్రతిమగా ఈ కొలువు శ్రీనివాసమూర్తిని భావిస్తారు. ఈ మూర్తి ఎత్తు రెండడుగులు మాత్రమే.

ప్రతిరోజూ ఉదయం శ్రీవారి మూలమూర్తికి తోమాల సేవ పూర్తయిన వెంటనే బంగారు వాకిలి లోని స్నపన మండపంలో ఉన్న బంగారు సింహాసనం పైన కొలువు శ్రీనివాసమూర్తిని ఆసీనుణ్ణి చేస్తారు. బంగారు గొడుగు, వింజామరలు పట్టుకుంటారు. అర్ఘ్య పాద్య ఆచమనాది ఉపచారాలు సమర్పించి ధూప దీప హారతులు ఇస్తారు. ఆ తర్వాత ఆస్థాన సిద్ధాంతి వచ్చి, సాష్టాంగ దండ ప్రణామాలు సమర్పించి ఆనాటి తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాది విశేషాలతో బాటు ఆనాటి శ్రీవారి ఉత్సవ విశేషాల, సేవల గురించి కూడా తెలియజేస్తారు. ఆ తరువాత ట్రెజరీ గుమాస్తా వచ్చి, చేతులు జోడించి – స్వామివారికి భక్తుల నుండి ముందు రోజు వచ్చిన ఆదాయాలను, హుండీ రాబడులను, ఉత్సవాల వలన, ప్రసాదం అమ్మకాల వల్ల వచ్చిన ఆదాయాలను అణా పైసలతో లెక్క కట్టి కొలువు శ్రీనివాసమూర్తికి వినిపిస్తాడు. ఆఖరుగా "ప్రభువుల వారు చిత్తగించవలెను" అంటూ భయ భక్తులతో సాష్టాంగ నమస్కారం చేస్తాడు. ఈ కొలువులోనే నిత్యాన్నదానానికి సొమ్ము సమర్పించిన దాతల పేర్లు కూడా కొలువు శ్రీనివాసమూర్తికి చదివి వినిపిస్తారు. తరువాత అర్చక స్వాములకు 16 కిలోల బియ్యం మాత్రాదానంగా కొలువు శ్రీనివాసమూర్తి అనుగ్రహిస్తారు. ఆ తరువాత దక్షిణ తాంబూలాలు కూడా అర్చక స్వాములకు స్వామి అందజేస్తారు. మాత్రాదానం, దక్షిణ తాంబూలాలు స్వీకరించిన అర్చక స్వాములు శ్రీనివాసుని "నిత్య ఐశ్వర్యోభవ" అంటూ ఆశీర్వదిస్తారు. తరువాత వేయించి దంచిన నువ్వుల పిండితో బెల్లాన్ని కలిపిన మధుర పదార్థాన్ని స్వామికి నివేదించి ఘనంగా కర్పూర నీరాజనాలు సమర్పిస్తారు. సార్వభౌమోచిత సత్కారాలతో బంగారు సింహాసనంపై దర్పంగా కూర్చున్న కొలువు శ్రీనివాసమూర్తికి జరిగే ఈ దర్బారు సేవ, సూర్యోదయానికి పూర్వమైతే స్నపన మండపంలోనూ, సూర్యోదయం అయిన తర్వాత అయితే ఘంటా మండపంలోనూ నిర్వహింపబడుతుంది.

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## శ్రీ వామన పురాణాంతర్గతం

### గత సంచిక తరువాయి

సర్వపాపహరా శుద్ధా పద్మినీ లోకవిశ్రుతా ।
సర్వదుఃఖ హరా చాపి సర్వతీర్థ ఫలప్రదా ॥

**- వామనపురాణం, అ.26, శ్లో.25**

అని చెప్పి అగస్త్య మహర్షి ఆత్మధ్యానపరాయణులైన ఆ మునులతో కూడా భగవంతుని ధ్యానిస్తూ ఆ నీటిలో వెంటనే మునిగి స్నానం చేసి దేవదేవునికి మనస్సులోనే నమస్కరించి సనాతనుడు, వాసుదేవుడు, హృషీకేశుడు అయిన శ్రీహరిని అర్చించి మరల ఆ మునులతోపాటు అగస్త్యమహర్షి పూర్వం వలె ఆ పర్వతంపై సంచరించసాగాడు.

### సనత్కుమార దర్శనం

అంతట అగస్త్యమహర్షి ఆ పుష్కరిణికి ఉత్తర దిక్కున వృక్షమూలంలో స్వస్థచిత్తులై నిశ్చలధ్యాన నిమగ్నులై మహాతేజోవంతులై దక్షిణముఖంగా కూర్చుని భగవంతుని ధ్యానిస్తున్న సనత్కుమారుడు మొదలైన (సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు) యోగీంద్రులను సందర్శించాడు. వాళ్ళు పరమభక్తితో కళ్ళు మూసుకుని ధ్యాన నిష్ఠులై ఉన్నారు. యోగవిద్యా పారంగతులైన ఆ మహాయోగీంద్రులను చూచి అగస్త్యమహర్షి వెంటనే వారిని సంతోషంతో సమీపించాడు.

తమ వద్దకు మునులతో పాటు వస్తున్న అగస్త్య మహర్షిని చూసి సనత్కుమారాది యోగీంద్రులు ఎదురేగి ఆయనకు స్వాగతం పలికి ఉచితాసనంపై ఆసీనుణ్ణి చేసి ఆరాధించారు. మునులందరితో పాటు అగస్త్య మహర్షిని గౌరవించారు. యోగీంద్రులు, మహామునులు అయిన సనత్కుమార ప్రముఖులు తనను యథావిధిగా పూజించగా ఆ పూజలందుకొనిన అగస్త్యమహర్షి మృదుమధురమైన వాక్కులతో 'మాకిక్కడ ఒక అద్భుతమైన దృశ్యం కనపడింది. ఒక మహాపురుషుడు దర్శనమిచ్చాడు. ఆయన ఎవరు? ఈ క్షేత్రంలో నివసిస్తున్న దైవమెవరు? మీరందరు ఎవరిని ధ్యానిస్తున్నారు? మీరందరూ ఇక్కడ ఎందుకు సమావేశమయ్యారు? నేనీ విషయాన్ని మీ ద్వారా వినాలనుకుంటున్నాను. కాబట్టి 'ఓ విశుద్ధులైన మునులారా! నాకీ విషయాన్ని తెలియజేయండి అని అడిగాడు.

పవిత్ర హృదయుడైన అగస్త్యమహర్షి ఈ విధంగా అడుగగా సనత్కుమారాది యోగీంద్రులు ఆయనతో యిలా అన్నారు – 'సర్వాంతర్యామి అయినటువంటి విష్ణుభగవానుడు ఈ మహాపర్వతంపై నివసిస్తున్నాడు. మునీంద్రా! అందరికీ ధ్యానింపదగినవాడు, చింతింపదగినవాడు, ఆ

పురుషోత్తముడొక్కడే. ఊహకందనివాడు, సర్వలోకస్రష్ట, శాశ్వతుడు, సర్వజీవ హృదయవాసి అయిన ఆ జగన్నాథుని మేము ధ్యానిస్తున్నాము. ఆ జనార్దనుని కంటె వేరొకరిని చింతించుట లేదు.

మీరు కూడా అచిరకాలంలోనే మహాత్ముడు, పురుషోత్తముడు, పరాత్పరుడు, సనాతన పరబ్రహ్మ, పురాణపురుషుడు, శ్రీమన్నారాయణుడు, సర్వలోక రక్షకుడు, లోకాతీతుడు. సర్వశ్రేష్ఠుడు అయిన శ్రీమహావిష్ణువును దర్శించగలరు. పరమపావనమైన ఈ వేంకటాద్రిలో పూర్వం దేవతలచేత ఆరాధించబడే ఆ భగవంతుని మేం కూడా ఒక్కసారి దర్శించాం.

ఓ మహర్షీ! మహావాక్య విశారద! ఈ దివ్యమైన పర్వతానికి తూర్పు దిక్కున యితరులెవరూ చూడని ఒక మహాద్భుతమైన, ఆశ్చర్యకరమైన దొకటున్నది. దాని గురించి చెబుతాం వినండి. 'దేవేంద్రుడు వజ్రాయుధాన్ని ధరించి దేవతలందరితో కూడి అవ్యక్తరూపం కల భగవంతుని చూడాలనే కోరికతో ఈ పర్వతంపై నివసిస్తున్నాడు. మీరు కూడా ఈ మునీంద్రు లందరితో కూడి అవ్యక్తరూపం కల భగవంతుని చూడాలనే కోరికతో ఈ పర్వతంపై నివసిస్తున్నారు. మీరు కూడా ఈ మునీంద్రులందరితో పాటు శుభప్రదమైన తూర్పు దిక్కుకు వెళ్ళండి. అక్కడ మీరు దేవలోకాధిపతి అయిన ఆ శచీపతిని దర్శిస్తారు' అని చెప్పి ఆ సనత్కుమార ప్రముఖులైన మహాతేజస్సంపన్నులైన యోగీంద్రులు అదృశ్యమయ్యారు. అది చాలా ఆశ్చర్యం కలిగించింది. మహాత్ములైన ఆ యోగీంద్రులందరు ఆ విధంగా అదృశ్యం కాగా అగస్త్యమహర్షి మహర్షులందరితో కలిసి తూర్పు దిక్కున మహాశ్చర్యకరమై ఇంద్రుని ధ్వజంవలె చాలా ఎత్తైనదై పెద్ద పెద్ద కొమ్మలు విస్తరించినదై పూలభారంతో కొంచెం వంగి, తన శాఖల నీడతో ఆ పర్వతాన్నంతా కప్పివేసిన ఒక మహావృక్షం కనిపించింది. దాని మొదట్లో సూర్యసమతేజ స్సంపన్నులైన మహాత్ములైన సప్తమహర్షులు భగవంతుని ధ్యానిస్తూ కూర్చొని ఉన్నారు.

'రాజా! అగస్త్యమహర్షి వారిని చూసి నిర్మలురైన మునులతో పాటు వారి సమీపానికి వెళ్ళాడు. తపఃశ్రేష్ఠుడైన అగస్త్యమహర్షి తమ వద్దకు రావడం చూసి సప్తర్షులు ఆ మహాత్ముని ప్రేమతో సాదరంగా ఆహ్వానించి ఆరాధించారు. అంతట మహాతేజశ్శాలియైన అగస్త్యమహర్షి ఆ సప్తర్షులకు నమస్కరించి వినయంతో మృదుమధురమైన అర్థవంతమైన వాక్కులతో 'ఓ మహర్షులారా! మీరు దివ్యమైన ఈ పర్వతరాజానికి ఎందుకు వచ్చారు? మీరు ఏ మహాదేవుని ధ్యానిస్తున్నారు. ఓ మునిశ్రేష్ఠులారా! నేను యథార్థంగా ఈ విషయాన్ని తెలుసుకోవాలని ఎంతో కుతూహలంతో అడుగుతున్నాను. కాబట్టి నాకీ విషయాన్ని తెలియజేయండి' అని అడిగాడు.

అగస్త్యమహర్షి ఈ విధంగా అడుగగా ఆ ముని పుంగవులు మహాత్ముడైన అగస్త్యమహర్షితో యిలా అన్నారు–

'పూజ్యా! మీరడిగిన విషయాన్ని చెబుతాము. వినండి. మేము జగత్ప్రభువు, జగద్రక్షకుడు, పద్మపత్రవిశాలాక్షుడు, దేవదేవుడు, జనార్దనుడు అయిన శ్రీమన్నారాయణుని దర్శించడానికి ఇక్కడకు వచ్చాం. సర్వవ్యాపకుడైన ఆ పురుషోత్తముడే మనకు ధ్యానింపదగినవాడు. ఆ జగత్ప్రభువు కంటె వేరెవరు ధ్యానింపదగినవారు లేరు. పుట్టుక లేనివాడు, సర్వలోకేశ్వరుడు నీలమేఘశ్యాముడు, కృష్ణుడు, అచ్యుతుడు, ఈశ్వరుడు, పూజ్యుడు, సర్వశ్రేష్ఠుడు, భక్తవరదుడు అయిన ఆ శ్రీహరినే మేము చింతిస్తున్నాము. మీరు కూడా ఆ పద్మనేత్రుని సకల జగన్నాథుని దర్శించగలరు. ఈ సింహాద్రికి తూర్పుదిక్కునకు వెళ్ళండి.

రాజా! సప్తర్షులు ఈ విధంగా చెప్పగా అగస్త్యమహర్షి వారి అనుమతి తీసుకొని జగత్స్రష్టయైన పరమేశ్వరుని మనస్సులో ధ్యానిస్తూ బ్రహ్మదేవుడు చెప్పిన మాటలను స్మరిస్తూ వెంటనే ఆ పర్వతం తూర్పుదిక్కుకు వెళ్ళాడు. మహారాజా! అంతకు ముందెపుడూ చూడనటువంటి ఆ పర్వతపు ఉత్తర భాగాన్ని చూచి అగస్త్యమహర్షి అక్కడ కూడా ఆదిపురుషుడైన భగవంతుని దర్శింపలేక మరల ఆ ప్రభువును దర్శించుటకు తూర్పుదిక్కుకే వచ్చాడు.

## అగస్త్యాది మహర్షులు శేషాద్రి తూర్పు దిక్కున అమృతవస్తువును దర్శించుట

అంతట అగస్త్యమహర్షి మునులందరితోపాటు అనేక వృక్షసమూహాలతో అలంకరింపబడిన ఆ నారాయణగిరికి తూర్పుదిక్కునకు చేరాడు. అక్కడ అంతకు ముందువలె మహాత్ములు, సూర్యునివలె ప్రకాశిస్తున్న వారు భగవంతుని ధ్యానిస్తున్న మునులతోపాటు సంచరించసాగాడు. అలా సంచరిస్తూ ఆయన పర్వత శిఖరాలవలె ఉన్న మహావృక్షాలను చూశాడు. అవి ఫలపుష్పభరితములై వేళ్ళాడుచున్న పెద్ద శాఖలతో చిగురులతో శోభిల్లుతున్నాయి. ఏనుగులు మదజలాన్ని స్రవిస్తూ మంచి దంతాలతో శోభిస్తున్నాయి. సింహాలు గర్జిస్తున్నాయి. అడవి పందులు పరుగెడుతున్నాయి. ఆ మహాపర్వతం పైన వేలకొలది సిద్ధులు, కిన్నరులు, గంధర్వులు, యక్షులు మొదలగు దేవతా సమూహాలన్నీ నివసిస్తున్నాయి. వీరందరినీ చూస్తూ అగస్త్య మహర్షి ఆ పర్వతమంతా కలయతిరిగాడు. ఆ పర్వతం యొక్క తూర్పు దిక్కును అనేకమంది మునులు సేవిస్తున్నారు. పరమ పవిత్రము మహాపుణ్య ప్రదము అయిన ఆ పర్వత ప్రాంతం అనేక మృగసమూహములతో నిండి ఉన్నది. నిత్యము పూలతోను, పండ్లతోను నిండిన అనేక విధాలైన వృక్షాలతో విలసిల్లుతున్నది.

అక్కడ మదపుటేనుగులు సంచరిస్తున్నాయి. ఆ

ప్రాంతమంతా మత్తెక్కిన కోకిలలు ధ్వనులతో ప్రతిధ్వనిస్తున్నది. ఎత్తైన, సుందరమైన శిఖరాలతో శోభిస్తున్నది. శుభప్రదమైన ఆ పర్వత మహాసానువులలో భయంకరమైన మహాసర్పాలున్నాయి. ఎత్తైన ఉసిరి చెట్లు ఉసిరి పండ్లతో శోభిస్తున్నాయి. ఈ విధంగా మహాశ్చర్యకరమైన గొప్ప శిఖరములు గల ఆ మహాపర్వతము యొక్క తూర్పుదిక్కును అగస్త్యమహర్షి మునులతో పాటు దర్శించాడు.

అలా సంచరిస్తూ అగస్త్యమహర్షి అక్కడ ఒక అద్భుత దృశ్యాన్ని చూశాడు. పాతాళ లోకం వలె చూసేవారికి భయం కలిగించేది, అంతకు ముందు మానవులెవరూ చూడనిది అయిన ఒక మహాబిలాన్ని ఆయన చూశాడు. ఆ భైరవదుర్గాన్ని చూసినంతనే మానవులు మూర్ఛిల్లి దానిలో పడిపోతారు. అగస్త్యమహర్షి ఈ మునులందరితో పాటు ఆ బిలాన్ని సమీపించి దాన్ని మరల మరలా పరీక్షగా చూసి ధర్మజ్ఞుడైన ఆ మహర్షి పుంగవుడు వారితో ఇలా అన్నాడు.

మానవులెవరైనా దీనిని చూస్తే కళ్ళు తిరిగి పడిపోతారు. ఈ కొండపైకి వచ్చినవారంతా ఈ బిలాన్ని చూడాలన్న కుతూహలంతో వచ్చి దీంట్లో పడిపోతారు. అందుచేత ఈ బిలం ఇక్కడ ఉండకూడదని నా అభిప్రాయం. ఈ భయంకరమైన బిలం మృత్యుముఖం వలె ఉన్నది' అని అగస్త్యమహర్షి అనగానే ఆ మహర్షి ప్రభావంచేత ఆ బిలం అదృశ్యమైపోతుంది. అది చాలా ఆశ్చర్యం, అద్భుతమనిపించింది. ఆ బిలమావిధంగా మాయమైన తరువాత ఆ మహర్షి మహాపుణ్యప్రదమైన వేంకటాద్రిలో సంచరిస్తూ ఒక పెద్ద పాల (మద్ది) వృక్షాన్ని చూశాడు. ఆ వృక్షం నూరు శాఖలతో విస్తరించి ఉంది. మహోన్నతంగా, మహాద్భుతంగా భూమ్మీద అంతకుముందెన్నడూ చూడని విధంగా ఉన్న ఆ వృక్షం లేత చిగుళ్ళతో శోభిస్తున్నది. అగస్త్యమహర్షి దానిని చూచి ఆశ్చర్యచకితుడై వెంటనే దానిని సమీపించాడు.

మునులందరితో పాటు అక్కడికి వెళ్ళిన అగస్త్యమహర్షి ఆ వృక్ష మూలంలో ఆసీనుడై యున్న శచీపతియైన ఇంద్రుని చూచాడు. అతడు ఆ మద్దిచెట్టు కొమ్మవలె దీర్ఘబాహువులు కలిగి ఉన్నాడు. రత్నకాంతులను విరజిమ్మే కిరీటంతో విరాజిల్లుతున్నాడు. వైడూర్యాలు, రత్నాలు పొదిగిన కుండలాలతో శోభిస్తున్నాడు. చేతిలో వజ్రాయుధాన్ని ధరించి ఉన్నాడు. విశాలమైన నేత్రములు గల ఆ దేవేంద్రుడు అపర నారాయణునివలె ఉన్నాడు. ఆయనను పవిత్రమైన కుండలములు, దివ్యాంబరములు ధరించిన సూర్యుడు, యముడు, వసువులు, అశ్వినీ దేవతలు, కుబేరుడు, వరుణుడు, గంధర్వులు, కిన్నరులు మొదలైన వారంతా దగ్గర ఉండి సేవిస్తూ ఉన్నారు.

రాజా! దైవాంశ సంభూతుడైన అగస్త్య మహాముని మహాతేజశ్శాలియైన ఆ దేవేంద్రుని వద్దకు వెంటనే వెళ్ళి మునులందరితో పాటు ఆ త్రిలోకాధిపతిని ఆరాధించాడు. ఆ దేవతలందరు దేవేంద్రునితో పాటు అగస్త్యమహర్షిని యథావిధిగా పూజించి ఆ మహాత్మునితోపాటు ఆధీనులయ్యారు. అప్పుడు అగస్త్యమహర్షి దేవేంద్రునితో పాటు ఆ దేవతలందరిని ఆశ్చర్యంగా చూస్తూ చిరునవ్వుతో 'ఓ దేవతలారా! మీరందరూ ఇక్కడికి ఎందుకు వచ్చారు? మీరు ఎవరిని గురించి చింతిస్తున్నారు? ధ్యానిస్తున్నారు? ఈ పర్వతంలో మీరు ఏ ఏ ఆశ్చర్యకరమైన విషయాలను సందర్శించారు? ఇదంతా యథార్థంగా నాకు చెప్పండి. నేను మీ ద్వారా దీనిని వినగోరుచున్నాను' అని అడుగగా దేవతలంతా ఆయనతో ఇలాన్నారు –

'అగస్త్యమహర్షీ! మేము పద్మదళనేత్రుడు, నారాయణుడు, హృషీకేశుడు, శంఖచక్రగదాధారుడు, ప్రణతార్తిహరుడు, సర్వవ్యాపకుడు, సనాతనుడు, పరబ్రహ్మ స్వరూపుడు అయిన శ్రీమన్నారాయణుని దర్శింపగోరి ఈ శ్రేష్ఠమైన సింహాద్రికి వచ్చి ఉన్నాము. మేము మహాబలవంతులైన దేవజిత్తు మొదలైన రాక్షసరాజులను జయించాలని దేవదేవుడైన ఆ జనార్దనుని ప్రార్థిస్తున్నాం. జరామరణ రహితుడు, మహాతేజశ్శాలి, జగత్ప్రభువు, సృష్టి స్థితి లయ కారకుడు, దేవదేవుడు అయిన ఆ పురాణపురుషుని ధ్యానిస్తున్నాం'. 'సనాతనుడైన ఆ భగవంతుడే మాకు ధ్యానింపదగినవాడు. ఆయనకంటె ధ్యానించదగినవారు మాకు మరొకరు కనపడలేదు. ఓ మహామునీ! పవిత్రమైన ఈ పర్వతం దక్షిణ దిక్కున మేము ఒక మహాశ్చర్యకరమైన విషయాన్ని దర్శించాము.

మహాశ్చర్యకరమైనవాడు, పినాకపాణి, సర్వభూతాంతరాత్మ. సర్వశక్తి సమన్వితుడు, మహేశ్వరుడు అయిన శంకరుడు ప్రమథ గణములతోను, కిన్నరులు, నాగులు, రాక్షసులతో కూడి ఈ పర్వతంలో సదా నివసిస్తున్నాడు. మీరక్కడికి వెళ్ళి జగత్ప్రభువైన ఆ దేవదేవుని దర్శించండి. అక్కడే దుర్వాసమహర్షిని, నందికేశ్వరుని ఇతర అనుచరగణాన్ని కూడా మీరు చూడగలరు. మీరు ఈ మునీంద్రులతో పాటు వెంటనే ఇక్కడి నుండి బయలుదేరి అక్కడికి వెళ్ళండి. ఆలస్యం చేయవద్దు' అని దేవతలందరు చెప్పగా వారందరిని వీడ్కొని అగస్త్యమహర్షి మునులందరితో పాటు ఆ పర్వతం తూర్పు భాగాన్ని వీడి దక్షిణభాగాన్ని చేరాడు.

అగస్త్యమహాముని ఆ పర్వతం దక్షిణ దిక్కంతా కలయ తిరుగుతూ ఆగ్నేయ దిక్కులో ఒక మహాద్భుతమైన ఆశ్చర్యకరమైన దృశ్యాన్ని చూశాడు. అక్కడ కొందరు పురుషశ్రేష్ఠులను దర్శించాడు. శంఖ చక్ర గద శారఙ్గశక్తి నాగలి ఖడ్గములు తమ తమ స్వరూపాలతో దిక్కులను ప్రకాశింపచేస్తూ అక్కడ కూర్చొని ఉన్నారు. వారు దివ్యాభరణాలను, దివ్యమాలలను దర్శించి సుందర రూపాలతో విరాజిల్లుతున్నారు. తమ శరీరాలకు రక్తచందనాన్ని పూసుకున్నారు. దివ్యమైన పుష్పమాలలతో

శోభిస్తున్న శుభప్రదమైన అందెలు, భుజకీర్తులు, మొలనూళ్ళు మొదలగు ఆభరణాలను ధరించి ఉన్నారు. హఠాత్తుగా దర్శనమిచ్చిన ఆ దివ్యపురుషులను చూచి అగస్త్యమహర్షి సంతోషంతో మునులతో పాటు వారి వద్దకు వెళ్ళి వారికి నమస్కరించాడు. మహాతేజశ్శాలియైన ఆయన వారికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి వారిని స్తుతించి మిక్కిలి ఆశ్చర్యచకితుడై ఆదిదేవుడు, మహాదేవుడు అయిన పరమశివుని దర్శించాలనే కుతూహలంతో మునులతోపాటు మహాశ్చర్యకర మైన ఆ మహాపర్వతమంతా సందర్శిస్తూ దానికి ప్రదక్షిణం చేసి దేవతా సమూహము సేవిస్తున్న తూర్పు దిక్కునకు వెళ్ళి; అటు పిమ్మట దక్షిణ భాగానికి చేరాడు.

## అగస్త్యమహర్షి శంకరుని సేవించుట

ఆ విధంగా అగస్త్యమహర్షి పరమప్రీతితో ఆ పర్వతము యొక్క దక్షిణ దిక్కును దర్శించాడు. అది మేఘంవలె నల్లగా ఉంది. శుభప్రదమైన పొదలతోను, లతలతోను కప్పబడి ఉంది. అనేక వృక్షాలతో నిండి ఉంది. పిల్లులు, కోతులు, కొండముచ్చులు సంచరిస్తున్నాయి. అక్కడి చెట్లు పండ్లతోను పూలతోను నిండి వంగి ఉన్నాయి. సుందరమైన తరుశాఖలతో శోభిల్లుతున్నాయి. కాటుక విరజిమ్మినట్టుగా ఉన్న నల్లని రాళ్ళతో విరాజిల్లుతున్నది. హంసలు, బెగ్గురు పక్షులు, గ్రద్దలు, వడ్రంగి పిట్టలతో శోభిస్తున్నది. మధురమైన ధ్వనులతో కూస్తున్న రమణీయమైన చక్రవాక పక్షులతో విరాజిల్లుత్నుది. అనేక గైరికాది ధాతువులతోను, సెలయేళ్ళతోను నిండి ఉంది. గుహ్యకులు, విద్యాధరులు మొదలైన దేవతాసమూహములు తమ తమ భార్యలతో అక్కడ నివసిస్తున్నారు. అది చూడటానికి బహుసుందరంగా ఉంది. చక్కని సుగంధ పరిమళం వెదజల్లుతూ మలయమారుతం ఆ ప్రదేశమంతా వీస్తున్నది. కిన్నరులు, గంధర్వులు, గానం చేస్తూ ఉన్నారు. వారు తమ గానంతో అఘటనా ఘటనా సమర్థుడైన శ్రీకృష్ణుని (శ్రీనివాసుని) ప్రసన్నం చేసుకుంటున్నారు. ఈ విధంగా మహాత్ముడైన అగస్త్యమహర్షి ఆ మహాపర్వతం దక్షిణదిక్కున దివ్యము, అత్యద్భుతములైన దృశ్యాన్ని చూశారు.

ఇంకా అక్కడ అనేక శాఖలు కలది, పుష్పించినది, చాల ఎత్తుగా ఉన్నది, మహాశ్చర్యకరమైనది, చూడదగినది, మిక్కిలి పరిమళభరితమైనది, లేతచిగురులతో శోభిస్తున్నది, పూర్వులెవరు చూడనిది, మహాద్భుతమైన, దివ్యమైన వృక్షాన్ని చూశాడు. అగస్త్యమహర్షి దానిని చూసి ఆశ్చర్యచకితుడై మునులందరిలతో పాటు అతిశీఘ్రంగా ఆ చెట్టు వద్దకు వెళ్ళాడు. మహాతేజశ్శాలి యైన ఆయన అనేక శాఖలుగల ఆ వృక్షాన్ని సమీపించి మిక్కిలి కుతూహలంతో దానిని పరిశీలనగా చూశాడు.

ఆ వృక్షమూలంలో ఉమాపతియైన పరమశివుడు ఆసీనుడై ఉన్నాడు. అగస్త్యమహర్షి భగవంతుడైన సదాశివుని దర్శించాడు. ఆయన మూడు నేత్రాలు మూడు అగ్నిహోత్రాల వలె ఎఱ్ఱగా ప్రకాశిస్తున్నై. ఆయన ఉత్తరాభిముఖుడై ఉన్నాడు. మహాశ్చర్యకరమైన జటామండలాన్ని (జడలను) ధరించి ఉన్నాడు. ఆ మహాదేవుడు చతుర్భుజుడై, నల్లని కంఠం కలిగి ఉన్నాడు (నీలకంఠుడు). చేతిలో 'పినాక' మనే ధనుస్సును ధరించాడు (పినాకపాణి). ఆయన తన తేజస్సుతో ప్రకాశిస్తూ మధ్యాహ్న సూర్యుని వలె దశదిశలను ప్రకాశింపజేస్తున్నాడు. ఆయన నేత్రాలు కపిలవర్ణం (ఎరుపు రంగు) కలవై విశాలంగా ఉన్నాయి. ఆయన అధరోష్ఠం సుందరంగా ఉంది. వక్షస్థలం విశాలంగా, ఉన్నతంగా ఉంది. ఆయన శరీరం సమున్నతంగా ఉంది. శాంతస్వరూపుడైన ఆ పరమశివునికి సకల లోకవాసులు నమస్కరిస్తున్నారు. బహువిధాలైన మణులతో కూర్చబడి, ప్రకాశిస్తున్న కుండలాలను ధరించాడు.

ఆయన అనుచరులు అనేక రూపాలు ధరించి ఉన్నారు. వారు అనేక వేల బాహువులు కలిగి పరాక్రమవంతులై ఆయనను సేవిస్తున్నారు. నందికేశ్వరుడు, దుర్వాసుడు, బాణాసురుడు, యక్షులు, కిన్నరులు, గంధర్వులు, దేవతలు, హాహా, హూహూ అనే గంధర్వులిరువురు ఆయనను ఆరాధిస్తున్నారు. మహాతేజశ్శాలియైన ఆ మహాదేవుని వారంతా స్తుతిస్తున్నారు. అటువంటి శంకరుని చూచి అగస్త్య మహర్షి ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశాడు. భగవంతుడైన మహేశ్వరునికి ఆ మునులందరు కూడ నమస్కరించారు.

వారంతా ఆయనను ప్రసన్నుడవు కమ్మని మరల మరల ప్రార్థిస్తున్నారు. దేవాధిదేవుడు, మహాదేవుడు, భగవంతుడు అయిన ఆ మహేశ్వరుని స్తుతిస్తున్నారు. అప్పుడగస్త్య మహర్షి మహాతేజస్సుతో విరాజిల్లుతున్నవాడు, వృక్షమూలంలో ఆసీనుడై ఉన్నవాడు. చిత్రవిచిత్రాలైన అనేక రత్నాలతోను, కంకణాలతోను అలంకరించబడినవాడు, బంగారు భుజకీర్తులతో శోభిస్తున్న వాడు, సర్వప్రాణులకు వరములిచ్చేవాడు, సకల దేవతలకు పూజ్యుడు అయిన శంకరుని స్తుతించి 'దేవా! నీ వద్దకు వచ్చిన నన్ను పలుకరించవేమి? 'స్వామీ! నీ వెవరిని గురించి ధ్యానం చేస్తున్నావు? ఇక్కడ నివసించే దేవుడెవరు' అని అడిగాడు. మహాతేజశ్శాలియైన అగస్త్యమహర్షి ఇలా అడుగగా మహాదేవుడైన శంకరుడు మేఘగంభీరధ్వానంతో అగస్త్య మహర్షితో ఇలా అన్నాడు –

"సకలప్రాణులకు ప్రభువు, జగత్కారణుడు, జనార్దనుడు అయిన నారాయణుడే అందరికీ ధ్యానింపదగిన వాడు. ఆయన సర్వభూతాంతరాత్మ. లోకంలో ధ్యానింపదగిన మరొక పురుషుడు లేడు, కనబడడు. జగత్ప్రభువు, సర్వవ్యాపకుడు, జగత్పరిపాలకుడైన శ్రీహరి కంటె మరెవరు ధ్యానింపదగిన వారు

లేరు. ఈ నారాయణ పర్వతంపై సనాతనుడు, జగత్కారణుడు, పురుషోత్తముడునైన భగవంతుడు నివసిస్తున్నాడు.

నారాయణ గిరావస్మిన్ వసత్యేష సనాతనః ।
నారాయణో జగద్యోనిః భగవాన్ పురుషోత్తమః ॥

**- వామనపురాణం, అధ్యాయం 28, శ్లోకం 28**

సర్వేశ్వరుడైన ఆ శ్రీహరియందు నేను మనస్సు లగ్నంచేసి ఉండటం వలన నీ వద్దకు వచ్చినా నిన్ను పలుకరించలేదు. అంతేకాని వేరే కారణమేమీ లేదు. నీవు కూడ విశాలమైన నేత్రములు కలవాడు, జనులకు, ప్రభువులకు కూడా ప్రభువైన వాడు, సర్వజీవులకు శరణు పొందదగినవాడు, సర్వప్రాణులను సంరక్షించువాడు, ఆద్యంత రహితుడు, ప్రకాశిస్తున్న కిరీటము, భుజకీర్తులు, మురుగులతో అలంకరింపబడినవాడు, దివ్యమైన వైజయంతీమాలతో విరాజిల్లెడువాడు, గరుత్మంతుని అధిరోహించినవాడు, విశ్వరూపుడైన శ్రీహరిని దర్శించగలవు.

ఓ పాపరహితుడా! బ్రహ్మదేవుడు, నేను కూడ నీకు ఇదే విషయాన్ని చెప్పాము. నీవు ఆ జగన్నాథుని తప్పక దర్శిస్తావు. ఇందుకు ఏ మాత్రం సందేహం లేదు. అచిరకాలంలోనే భగవంతుడైన పురుషోత్తముడు, విశ్వాంతర్యామి, కేశవుడు నీకు సాక్షాత్కరిస్తాడు. ఓ మహామునీ! నీవు ఈ పర్వతంపై మునుపటి వలె సంచరించు. ఓ బ్రహ్మర్షీ! నీవు విచారించవద్దు. ఆ భగవంతుని యందు మనస్సు లగ్నం చెయ్యి.

పరమేష్ఠియైన పరమశివుడు ఇలా చెప్పగా అగస్త్యమహర్షి ఆయనకు మరల మరల నమస్కరించాడు. పినాకపాణి అయిన ఆ సదాశివుని యందలి భక్తి వలన ఆ మునిశ్రేష్ఠుడు ఆయనను వదలి వెళ్ళలేక పోయాడు. అగస్త్య మహర్షి, ఇతర మునీంద్రులందరు చూస్తూండగనే శంకరుడు తన పరివారంతో అక్కడే అదృశ్యమయ్యాడు. ఆ మునులంతా కూడ పరమేశ్వరుని స్తుతించి, నమస్కరించి అగస్త్యమహర్షితో పాటు వెళ్ళిపోయారు.

ఈ విధంగా అగస్త్య–శంకరుల మధ్య జరిగిన ఈ సంభాషణ అత్యద్భుతమైనది, మహాశ్చర్యకరమైనది. ఈ విషయం ఋషులద్వారా లోకంలో వ్యాప్తి చెందింది. 'ఓ మిథిలాధిపతీ! మహాద్భుతము, సర్వపాపహరము అయిన ఈ పవిత్ర చరిత్రను నీకు చెప్పాను – ఇంకా ఏమి వినగోరుచున్నారో అడుగు' అని వామదేవ మహర్షి అన్నాడు. అప్పుడు జనక మహారాజు 'ఓ మహామునీ! మీరు మహాశ్చర్యకరమైన చరిత్రను చెప్పారు. నేను పరమానందంతో చక్కగా విన్నాను. ఆ తరువాత మహాతేజశ్శాలి అయిన అగస్త్యమహర్షి ఏమి చేశారు? ఆ విషయాన్ని నాకు చెప్పండి. దానిని వినాలని కుతూహలంగా ఉన్నది' అని అడిగాడు.

వామదేవ మహర్షి జనకమహారాజుతో ఇలా అన్నాడు. "మహారాజా! మహాతేజస్సంపన్నుడైన అగస్త్యమహర్షి మహేశ్వరునికి నమస్కరించి, ఆ నారాయణాద్రి దక్షిణ దిక్కును వీడి నైఋతి దిక్కుకు బయలుదేరాడు. అగస్త్యమహర్షి మునులందరితో పాటు దక్షిణ దిక్కును దాటి ఆ నారాయణగిరి నైఋతి దిక్కులోని విశేషాలను దర్శించుటకై, పరాత్పరుడైన శ్రీమహావిష్ణువును దర్శింపగోరి, తీవ్ర తపః ప్రభావ సంపన్నుడై బయలుదేరాడు.

## నైఋతి దిక్కున విష్వక్సేన దర్శనం

అగస్త్యమహర్షి శేషాచలం నైఋతి దిక్కును చేరాడు. అక్కడ మందర పర్వతంవలె ఉన్న బహుశాఖలతో కూడిన ఎత్తైన పెద్ద మర్రిచెట్టును చూశాడు. దాని మొదట్లో మహాశ్చర్యకరంగా కూర్చునియున్న విష్వక్సేనుని దర్శించాడు. దేవతలకు (నిత్యసూరులకు) అధిపతి, మహాతేజశ్శాలి సురాధిపతి అయిన విష్వక్సేనుడు ఒక అద్భుతమైన శిలపై ఆసీనుడై భగవంతుని యందు మనసు లగ్నం చేసి ఆయనను ధ్యానిస్తూ ఉన్నాడు. దేవేంద్రునితో సమానమైన బలపరాక్రమాలు గల అనుచరులు ఆయనను పరివేష్టించియున్నారు. వారితో కూడిన ఆయన అపరమహేంద్రునివలె ఉన్నాడు.

ఆకాశమును మింగుచున్నవారి వలె ఉన్న బలవంతులైన రాక్షసులుఆయన్నుచుట్టుముట్టిఉన్నారు.దుష్టకర్మలుచేసేవందల కొలది భయంకరమైన రాక్షసులు, గంధర్వపతులు, వేలకొలది యక్షులు, అనేక ఆయుధములు ధరించి మహాపరాక్రమవంతుడైన ఆ విష్వక్సేనుని సేవిస్తున్నారు. "విష్ణుమాయచే సృష్టించబడిన వేలకొలది భయంకరమైన మేరుపర్వతం వంటి రూపముకల క్రోధావిష్టములైన మహాభూతాలు ఆయనచుట్టూ ఉన్నాయి. అవి సముద్రాలనన్నింటిని ఒకేసారి తాగేసేటట్టుగా ఉన్నాయి. ఆ పర్వతంలో వీటన్నింటితో పాటు ఈటెలు, చల్లకోలలు ధరించి సుస్వరంతో గానం చేస్తున్న గంధర్వులు, కిన్నర శ్రేష్ఠులు, చక్కగా నాట్యం చేస్తున్న అప్సరసలు, దేవతలు, బ్రహ్మర్షులు, వేలకొలది సిద్ధులు మహాత్ముడైన ఆ విష్వక్సేనుని సేవిస్తున్నారు.

ఈ విధంగా ఆయన అపరనారాయణుని వలె ఉన్నాడు. అగస్త్యమహర్షి ఆయనను చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు. ఆయన శరీరమంతా గగుర్పాటు చెందింది. ఆ బ్రహ్మర్షి విష్వక్సేనుని సమీపించి, ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆ మునులందరు కూడ మహాబలవంతుడైన ఆయనను అనుగ్రహించమని ప్రీతికరమైన మాటలతో ప్రార్థించారు.

వారంతా సుఖముగా ఆసీనుడైయున్న గొప్ప విలుకాడు. అపర నారాయణుని వలె శంఖ చక్ర గదలను ధరించిన వాడు. అభయహస్తమును ప్రదర్శిస్తున్న ఆ విష్వక్సేనునికి నమస్కరించారు. అంతట విష్వక్సేనుడు అగస్త్యాది మహర్షులందరితో ఇలా అన్నాడు.



## భగవద్దర్శనోపాయం

విశ్వరూపమును ధరించిన వాడు, మహాతేజశ్శాలి, నాశరహితుడు, దేవదేవుడు అయిన ఆ శ్రీహరిని మీరీ పర్వతంలోనే దర్శించగలరు. సకల వేదవేద్యుడైన ఆ భగవంతుని అనుచరులము మేము. పూర్వం మేము దేవతా సార్వభౌముడు, మహాతేజశ్శాలి, శంఖ చక్ర ఖడ్గధారి జయశీలి అయిన శ్రీమన్నారాయణుని దర్శించాము. ఓ బ్రాహ్మణోత్తములారా! సర్వవ్యాపి అయిన ఆ పరమాత్మ ఈ నారాయణగిరిలో నివసిస్తున్నాడు. ఈ పర్వతంపై మీరు మునుపటి వలెనే విహరించండి.

ఆ శ్రీమహావిష్ణువు అనుగ్రహం వలన శ్రేష్ఠమైన దివ్యమైన ఈ పర్వతంలోనే పూర్వం మేము అంతకుముందెప్పుడూ చూడని ఆశ్చర్యకరమైన అద్భుత దృశ్యాన్ని దర్శించాము. ఆ పరాత్పరుని, జగత్ప్రభువును దర్శించగోరి ఈ పర్వతంపై తపస్సు చేసే వారికి ఆ పురుషోత్తముడు తన దివ్యదర్శన భాగాన్ని అనుగ్రహిస్తాడు. కావున మీరు కూడ మాతోపాటు ఈ పవిత్రమైన పర్వతరాజంలో మిక్కిలి భక్తితో తీవ్రతపస్సు చేయండి. సకల చరాచర జగత్తుకు ప్రభువైన శ్రీమహావిష్ణువు, పరబ్రహ్మ, గోవిందుడు, కేశవుడు, జగత్తును ధరించేవాడు అయిన ఆ భగవంతునియందు మనస్సు లగ్నంచేసి నిశ్చలచిత్తంతో ధ్యానం చేయండి. అని మహాపరాక్రమశాలియైన విష్వక్సేనుడు వారికి చెప్పి అక్కడే అంతర్ధానం చెందాడు. మునులందరూ చూస్తుండగనే, దేవతలంతా నమస్కరిస్తూండగా, అనుచరులందరితో పాటు అదృశ్యమయ్యాడు.

జనకమహారాజా! ఆ మునులందరూ సంతోషంతో మహాత్ముడైన ఆ విష్వక్సేనునికి నమస్కరించి మరల మునుపటి వలె వృక్షసమూహాలతో అలంకరింపబడిన వేంకటాచలంలో విహరిస్తున్నారు. ఆ పర్వతంపై సంచరిస్తున్న వారు రమ్యములు, మనోహరములైన ఎత్తైన పర్వతశిఖరాలను దర్శించారు. ఆ పర్వతశిఖరాలపై వృక్షాలు పుష్పించి వాటిని అలంకరించి నట్లున్నై – ఆ పూలు అనేక రంగుల్లో ఉన్నాయి. నీలమేఘ వర్ణంలో కొన్ని, తెల్లని మేఘముల వలె కొన్ని ఉన్నాయి. ఆ శిఖరాలు తెల్లగా, నల్లగా ఉన్నాయి. వాటిని దేవతలు, దానవులు, గంధర్వులు, యక్షులు, కింపురుషులు, గుహ్యకులు, విద్యాధరులు మొదలైన సర్వదేవతాగణాలు, ఇతరులు కూడ సేవిస్తున్నారు.

వారావిధంగా ఒక శిఖరమునుండి మరొక శిఖరమునకు వెళ్తూ ఉండగా ఒక సుందరమైన పర్వతశిఖరంపై అద్భుత దృశ్యాన్ని చూశారు. అక్కడ కొందరు నిర్మలచిత్తం గల ముని పుంగవులు కూర్చుని ఉన్నారు. అలాగే మహాపరాక్రమవంతులు, మహాబలవంతులు, కామరూపధరులు (తమ ఇష్టం వచ్చిన రూపం ధరించగలవారు), భయంకర రూపం కలవారు, వాయువేగం కలవారు అయిన వేలకొలది కిన్నరులను, గంధర్వులను, యక్షులను, మహారాక్షసులను, దేవతలను దర్శించారు. వీరిని చూచి వారు, వారిని చూచి వీరు ఉభయులు ఆశ్చర్యచకితులైనారు.

అప్పుడా మునీంద్రులతో అగస్త్యమహర్షి ఇలా అన్నాడు – ఓ మహామునులారా! పూర్వం దేవాసుర సంగ్రామంలో మహేంద్రుడు నిజంగా బలపరాక్రమ సంపన్నులైన వీరి సహాయం వల్లనే రాక్షసులను జయించాడు. ఈ మహాబలశాలురందరు విచిత్రములైన, అద్భుతములైన వస్త్రాలను, అనేక ఆయుధములను ధరించి, అద్భుతమైన రూపంతో దర్శనమిస్తున్నారు. మేము వారిని చూచిన తరువాత సకల ప్రాణులకు ప్రభువు, నిర్వికారుడు, నాశరహితుడు, అనంతుడునైన పరమాత్మకు ఆలయమైన, నిలయమైన ఈ మహాపర్వతాన్ని దర్శిస్తాము అని ఈ విధంగా నిశ్చయించుకొని అగస్త్యమహర్షి మునులందరితో పాటు బలవంతులైన ఆ గంధర్వులను సమీపించాడు. ఓ మిథిలాధీశా! జనకమహారాజా! వారంతా తమ వద్దకు వస్తున్న అగస్త్యమహర్షిని చూచి దేవతలు బ్రహ్మదేవునికి స్వాగతం పలికినట్లు ఎదురేగి ఆ మహాత్మునికి నమస్కరించి ఆయనను సమీపించారు. అప్పుడగస్త్య మహర్షి మృదుమధుర మైన వాక్కులతో వారితో "ఓ గంధర్వులారా! మహాపరాక్రమవంతులైన మీరంతా నా మధురమైనమాటలువినండి.మీరెవ్వరు?ఈపర్వతంపై ఎందుకు విహరిస్తున్నారు? ఓ మహాత్ములారా! ఈ పర్వతంపై మీరేమైనా ఆశ్చర్యకరమైన, అద్భుత విషయాన్ని చూశారా? అటువంటివి చూడ వలసినవి ఏమైనా ఉన్నాయా? ఈ విషయాన్నంతా మీరు యథార్థంగా సంగ్రహంగా నాకు తెలియజేయండి. నేనీ విషయాలను తెలుసుకోవాలనే కుతూహలంతో ఇక్కడకు వచ్చిన మిమ్మల్ని అడుగుతున్నాను" అని బ్రహ్మర్షి, వాక్యవిశారదుడైన అగస్త్యమహర్షి వారిని ప్రశ్నించాడు.

**(సశేషం)**

# తిరుమల సర్వస్వం

ధారావాహికం

– పల్లపోతు వాణిశ్రీ



**గత సంచిక తరువాయి**

## ధార్మిక కార్యక్రమాలు

దాన కార్యక్రమాలతో పాటు, ధార్మిక కార్యక్రమాలు కూడా వెంగమాంబ వైభవోపేతంగా నిర్వహించేది. బాల్యంలో తన ఇష్టదైవమైన నృసింహస్వామి జయంత్యుత్సవాలను తిరుమలలో పది రోజుల పాటు స్వయంగా జరిపించేది. అందువల్లే నేటికీ తిరుమలలో జరిగే నృసింహోత్సవాలలో ఉభయ నాంచారులతో కూడిన మలయప్ప స్వామివారు వెంగమాంబ ఇంటికి విచ్చేసి నివేదనలందుకుంటారు.

## సాహిత్య సేవ

ఆమె దాన–ధార్మిక కార్యకలాపాల్లో పాల్గొంటూనే, అమోఘమైన సాహిత్య సాధన కూడా చేశారు. ఆమె రచించిన గ్రంథం ప్రతులు తయారు చేయడం కోసం, ''అష్ట ఘంటములు'' అనే పేరుతో ఎనిమిది మంది ''వ్రాయసకాండ్ర''ను (అంటే నేటికాలంలో స్క్రైబ్స్ అన్నమాట) నియమించింది. వెంగమాంబ విరచిత గ్రంథ ప్రతులను అప్పటి వెంకటగిరి, శ్రీకాళహస్తి, కార్వేటి నగర సంస్థానధీశులు జ్ఞాన సముపార్జనార్థం తెప్పించుకునేవారు.

## తుంబుర తీర్థానికి ప్రస్థానం

అసమాన ప్రజ్ఞా ధురీణి, బహుముఖ ప్రజ్ఞాశాలిని అయిన ఆమెను దర్శిస్తే జన్మ ధన్యమవుతుందని భావించి తండోపతండాలుగా భక్తులు వెంగమాంబ వద్దకు వచ్చేవారు. ఇలా భక్తజనం క్రిక్కిరిసి పోవడం తన ఆధ్యాత్మిక సాధనకు ఆటంకమవుతోందని, దానికేదైనా మార్గాంతరం సెలవీయమని ఆ శ్రీనివాసుణ్ణి వేడుకుంది. తనలో ఐక్యం చేసుకొమ్మని కూడా ఆ పరంధాముణ్ణి ప్రార్థించింది. ఆ సమయమింకా ఆసన్నమవలేదనీ, ఆమె మరికొన్నాళ్ళు ఇహలోకంలోనే ఉండాలని సూచించిన సప్తగిరీశుడు ఆమె ప్రశాంతంగా తపస్సు నాచరించుకోవడం కోసం ఆలయానికి పన్నెండు మైళ్ళ దూరంలో ఉన్న తుంబురతీర్థం అనే పవిత్రమైన, జన సందోహానికి దూరంగా ఉండే ప్రశాంతమైన ప్రదేశాన్ని సూచించాడు. అక్కడ ఉన్న ఓ పర్వతగుహను చూపుతూ, ''వెంగమాంబా! నీవు పగలంతా నిశ్చింతగా సాధన చేసుకొని, ఈ గుహలోని సొరంగ మార్గం ద్వారా అన్యులకు కానరాకుండా, ఆనందనిలయంలోకి వచ్చి నన్ను ఆరాధించుకో'' అంటూ ఆదేశించాడు. ఆ గుహను సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే, ప్రత్యేక ఉత్సవ సందర్భంగా అనుమతింపబడే తుంబురతీర్థ సమీపంలో నేటికీ మనం చూడవచ్చు. తుంబురతీర్థ ప్రాశస్త్యం గురించి మరోసారి చెప్పుకుందాం.

## మూర్ఛిల్లిన మహంతు

ఆనాటినుండీ వెంగమాంబ, బంగారు వాకిలి మూసిన తరువాత, తుంబురు తీర్థం నుండి బిలమార్గం ద్వారా వెళ్ళి ప్రతిరాత్రీ స్వామిని ఆరాధించేది. వాడిన పూలను సడలింపు చేసి, తాజా పూలతో పూజ చేసి, యథావిధిగా కర్పూరహారతి

సమర్పించేది. ఇలా కొన్ని రోజులు గడిచిన పిదప అర్చకులు ప్రతిరోజూ తాము సమర్పించిన పూవులు ప్రక్కకు నెట్టబడి తాజాపూలు స్వామి పాదాల చెంత ఉండటం గమనించారు. మూసివేసిన ద్వారాలలో నుండి బంగారు వాకిలి లోనికి ప్రవేశించడం మానవమాత్రుల వల్ల కానిపని. ఇదెలా సాధ్యం?

ఈ రహస్యాన్ని ఛేదించటానికి, అప్పటి మహంతు బంగారు వాకిలి మూయకముందే గర్భాలయంలోకి ప్రవేశించి ఆగంతకుని కోసం కాపు కాశాడు. సరిగ్గా అర్ధరాత్రి సమయంలో శ్రీవారి పాదాల ముందు ఒక బిలం ఏర్పడగా, అందులోనుండి దివ్యకాంతులు వెదజల్లుతూ పూజాద్రవ్యాలతో పైకి వచ్చింది వెంగమాంబ.

కళ్ళు మిరుమిట్లు గొలిపే ఆ ప్రకాశాన్ని చూడలేక మహంతు మూర్ఛిల్లాడు. మరునాడు సుప్రభాత సేవానంతరం, తెప్పరిల్లిన మహంతు తాను రాత్రి చూసిన ఉదంతాన్నంతా పూసగుచ్చినట్లు విశదపరిచాడు. వెంగమాంబ తిరుమలలోనే ఉంటూ, ఆనందనిలయానికి రోజూ వచ్చి వెళుతోందని గ్రహించిన భక్తులు ఆమె కోసం వాగూ వంకా, చెట్టూ పుట్టా గాలించడం మొదలుపెట్టారు. కాని ఆమె ఆచూకీ తెలుసుకోవడం అంత సులభం కాలేదు.

## కుష్ఠువ్యాధి నుండి ఉపశమనం పొందిన విప్రుడు

ఇదిలా ఉండగా, తిరుమల క్షేత్రానికి భయంకర కుష్ఠువ్యాధితో బాధపడుతున్న ఓ విప్రుడు వచ్చాడు. ఒడలంతా పుండ్లతో, దుర్వాసన వెలువడడంతో కుటుంబ సభ్యులంతా అతనిని వెలివేశారు. దిక్కుతోచని స్థితిలో ఆ బ్రాహ్మణుడు శ్రీవారిని చివరిసారిగా దర్శించుకొని, వారి సన్నిధిలో ప్రాణాలు వదలాలని అత్యంత ప్రయాసకోర్చి తిరుమల క్షేత్రం చేరుకున్నాడు. కానీ అక్కడ కూడా ఆయన భక్తుల, ఆలయాధికారుల తిరస్కారానికి గురై, ఒకవైపు శరీరబాధ, మరొకవైపు ఆకలి బాధ తట్టుకోలేకపోయాడు. వాడ వాడలా తిరుగుతూ, ఆత్మహత్య చేసుకోవాలనే దృఢ సంకల్పంతో (అదృష్టవశాత్తూ) తుంబురతీర్థం చేరుకున్నాడు. అలవికాని బాధతో బిగ్గరగా రోదిస్తుంటే, అతని ఆక్రందన ఆ నిర్జనారణ్యంలో ప్రతిధ్వనించింది. ఆ ఆర్తనాదంతో ధ్యానభగ్నం కలిగిన వెంగమాంబ గుహలోనుండి బయటకు వచ్చి అతని దీనావస్థను గమనించింది. ఆ దీనుణ్ణి ఆదుకోవలసిందిగా ఆ ఆర్తత్రాణ పరాయణుణ్ణి వేడుకొని, అతనికి తియ్యని ఫలాలను తినటానికి ఇచ్చింది. క్షుద్బాధ తీరిన ఆ విప్రునికి, శేషాచలవాసుని కృపతో అతని బాధ తీరుతుందని అభయమిచ్చింది. అయితే, తన ఉనికిని ఎవరికీ తెలియపరచరాదనీ, నోరు జారితే తల వెయ్యి ప్రక్కలవుతుందని హెచ్చరించి పంపింది. వెంగమాంబ బాధోపశమన వాక్కులకు ఆనందాతిశయంతో కనులు మూసుకున్న ఆ విప్రుడు కళ్ళు తెరిచేటప్పటికల్లా స్వామి పుష్కరిణిలో తేలాడు. నీటిలోనుండి లేచిన అతడు తన శరీరాన్ని తడిమి చూసుకుని ఆశ్చర్యానందాలతో ఉబ్బి తబ్బిబ్బయ్యాడు. పుళ్ళు మటుమాయమయ్యాయి. శారీరక బాధ శాంతించింది. వెంగమాంబను, శ్రీనివాసుణ్ణి పరి పరి విధాల మనసులోనే కీర్తించాడు. అయితే ఆ బ్రాహ్మణుడు ఎక్కువకాలం ఆ రహస్యాన్ని దాచలేకపోయాడు.

## విప్రుని మరణం

ఆ విప్రుడు కుష్ఠువ్యాధిగ్రస్తునిగా ఉన్నప్పుడు చూసిన కొందరు భక్తులు, అతని వ్యాధి అత్యంత శీఘ్రంగా నయమవటంలోని రహస్యాన్ని బహిర్గత పరచమని ఒత్తిడి చేయసాగారు. అతనిని సిద్ధపురుషుడిగా ప్రశంసించసాగారు. వారి పొగడ్తలకు ఉబ్బిపోయిన బ్రాహ్మణుడు తనకు కలిగిన భాగ్యాన్ని అందరికీ చాటిచెప్పాలనే అత్యుత్సాహంతో, వెంగమాంబ ఆనతిని అతిక్రమించి, అసలు విషయం అందరికీ చెప్పేశాడు. మెచ్చుకోలు మాటలకు మానవుడు ఎంతకైనా తెగిస్తాడు మరి.

మహా తపస్విని వెంగమాంబ శాపం ఊరికే పోతుందా? ఒక్క తృటిలో ఆ బాపని తల ముక్కచెక్కలై ప్రాణాలు వదిలాడు.

## సమాధి నొందిన వెంగమాంబ

విప్రుని అనాలోచిత ప్రవర్తనతో వెంగమాంబ ఉనికి బహిర్గతమైపోయింది. భక్తజనులందరూ తుంబురకోన బాట పట్టడంతో, అక్కడ కూడా వెంగమాంబకు ప్రశాంతత కరువైంది. అలాంటి సమయంలో ఒకనాటి రాత్రి, ఆనందనిలయం చేరుకున్న వెంగమాంబ మరలా శ్రీవారితో మొర పెట్టుకుంది. అపరిమిత జన సంచారంతో తుంబురతీర్థం కూడా అలజడిగా ఉందనీ, తనను అక్కడి నుంచి కూడా తప్పించమని అనేక విధాలుగా ఆనందనిలయుణ్ణి వేడుకుంది. ఆమె మొర నాలకించిన శ్రీనివాసుడు వెంగమాంబతో "ఇకమీదట నిన్ను నా నుంచి వేరుగా ఉంచటం భావ్యం కాదు. అందువల్ల నువ్వు తీవ్రమైన సమాధి నిష్ఠలో ప్రవేశించు. ఆ సమాధినుండే ప్రతిరాత్రీ దివ్యతేజో రూపంతో ఆనందనిలయానికి వచ్చి నన్ను సేవించుకో" అని ఆనతిచ్చారు. పరమానందం చెందిన వెంగమాంబ, శ్రీవారి ఆజ్ఞననుసరించి తుంబరుకోనను విడిచి, తిరిగి తిరుమల వీధుల్లో ప్రవేశించి, తనకు అంతిమకాలమాసన్నమైందనీ, శ్రీవేంకటేశ్వరుడు తనను పిలుస్తున్నాడనీ, అందువల్ల సమాధిలో ఉంటూ సిద్ధి పొందుతాననీ అందరికీ తెలియపరిచింది. ఆ ప్రకారమే 1817 సంవత్సరంలో సహస్ర చంద్ర దర్శనం (వెయ్యి పున్నమిలు అంటే – సుమారుగా 83 సంవత్సరాలు

జీవించినవారు సహస్ర చంద్రదర్శనం చేసినట్లు భావిస్తారు) చేసిన ఆ వృద్ధ తపస్విని, ఈశ్వరనామ సంవత్సరం, శ్రావణశుద్ధ నవమి నాడు సమాధిలో ప్రవేశించింది. అనంతరం ఆమె ఆజ్ఞానుసారం, ఆ సమాధిని సుగంధ ద్రవ్యాలతో మూసివేసి, ఆ ప్రదేశంలో తులసీ బృందావనాన్ని ఏర్పాటు చేశారు.

## వెంగమాంబ బృందావనం

వెంగమాంబ బృందావనాన్ని నేటికీ మనం తిరుమలలో దర్శించుకోవచ్చు. ఆదివరాహస్వామి కాటేజీల వెనక ఉన్న చిన్న రోడ్డులో వెంగమాంబ జూనియర్ కాలేజీ ఆవరణలో ఆమె బృందావనం ఉంది. ఆ బృందావనంపై తొలిసారిగా అరణ్యమార్గంలో తిరుమల చేరుకున్నప్పుడు దారిలో ఆమెను రక్షించిన ''సంతకాపు మొగిలిపెంట'' ఆంజనేయస్వామి వారి చిన్న విగ్రహం కూడా ప్రతిష్ఠించబడింది.

## నేటి తరిగొండ గ్రామం

తరిగొండ గ్రామంలోని తి.తి.దే ఆధ్వర్యంలోని దేవాలయంలో ఆమె చిన్నప్పుడు పూజించిన ఆంజనేయస్వామి మరియు నృసింహ మూర్తులను ఇప్పటికీ చూడవచ్చు. స్థానికుల కథనం ప్రకారం, ఆంజనేయుడి విగ్రహం వెనకనున్న ఓ బిలమార్గం ద్వారా ఆమె తిరుమలకు చేరుకుంది. దేవాలయంలో రాతి పలకలతో కప్పబడి ఉన్న ఆ బిల ద్వారాన్ని, దేవాలయానికి సమీపంలో దేవతార్చన నీటికోసం ఆమె ఉపయోగించిన దిగుడుబావిని కూడా నేడు చూడవచ్చు.

## గ్రంథ రచన

ఆమె వ్రాసిన వేంకటాచలమాహాత్మ్యం అనే గ్రంథం పారాయణ చేస్తే, పెళ్ళి కానివారికి సత్వరమే వివాహమవుతుందని ప్రతీతి. తిరుమల చరిత్రకు సంబంధించి, ఇప్పటికీ ఆ గ్రంథమే అత్యంత ప్రామాణికంగా భావింపబడుతోంది. సుమారు రెండువేల పద్యాలతో అలరారే ఈ గ్రంథ ప్రతులను వ్రాయస కాండ్రతో తయారు చేయించుకోవడం కోసం తిరుమల యాత్రికులు రోజుల తరబడి వేచి ఉండేవారంటే, దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు. తరువాత అనేక గ్రంథాలు వెలువడినా, ఆ గ్రంథ ప్రాశస్త్యం అలాగే కొనసాగుతోంది.

ఆ సాహితీ సార్వభౌమురాలి కలం నుండి అష్టాంగరాజయోగం, ముక్తికాంతావిలాసం, గోపికానాటకం, జలక్రీడా విలాసం, వాశిష్ఠరామాయణం, రుక్మిణీ కళ్యాణం, శ్రీకృష్ణమంజరి లాంటి గ్రంథాలు; అనేక నాటకాలు, ద్విపదలు, వేదాంత గ్రంథాలు మరెన్నో వెలువడ్డాయి.

ఆ తెలుగింటి ఆడబడుచు గురించి మనకు తెలిసింది చాలా తక్కువ.

తరతరాలకు తరగని తెలుగువారి పెన్నిధి తరిగొండ వెంగమాంబ, ప్రతి వేంకటేశ్వరుని భక్తునికీ ప్రాతః స్మరణీయురాలు.

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జీవిత చరిత్రకు సంబంధించి తిరుమల లోనూ, తరిగొండ లోనూ నేటికీ సజీవంగా ఉన్న ప్రతి జ్ఞాపికనూ దర్శించుకొనే భాగ్యం కలగటం మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం.

స్వామివారి సపరిచర్యల్లోనూ, దాన-ధర్మ-సాహిత్య సాధనల్లోనూ అగ్రగామిగా వర్ధిల్లిన ఆ ధన్యజీవి జీవిత చరిత్ర సమాప్తం.

## శ్రీవారి ఆలయ వైశిష్ట్యం

**"వేంకటాద్రి సమస్థానం బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశ సమోదేవో న భూతో న భవిష్యతి"**

అనగా ''విశ్వంలో తిరుమలకు సమానమైన పుణ్యక్షేత్రం లేదనీ, గతంలో గానీ, వర్తమానంలో గానీ, భవిష్యత్తులో గానీ శ్రీవేంకటేశ్వరునితో సరి తూగగల దేవుడు లేడని'' అర్థం. అటువంటి దైవం నివసించే ''బంగారు మేడ'' నిర్మాణ వైశిష్ట్యం గురించి మనం తెలుసుకోబోతున్నాం. శ్రీవారి ఆలయానికి మరో పేరే బంగారు మేడ.

## శ్రీవారి ఆలయ నిర్మాణ వైశిష్ట్యం

సప్తగిరులు, అంటే – శేషాచలం, గరుడాచలం, వేంకటాచలం, నారాయణాచలం, వృషభాచలం, నీలాచలం, అంజనాచలం – అనే ఏడు కొండల శిఖరశ్రేణుల మధ్య కొలువైన శ్రీవారి ఆలయం, మూడు ప్రాకారాలు – మూడు ప్రదక్షిణ మార్గాలతో విరాజిల్లుతోంది. అయితే కేవలం వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో మాత్రం తెరచి ఉంచే వైకుంఠద్వారంతో కలుపుకుంటే, నాలుగు ప్రాకారాలు, నాలుగు ప్రదక్షిణ మార్గాలుగా చెప్పుకోవచ్చు.

**ఆ ప్రాకారాలు వరుసగా :**

1. మొదటి ప్రాకారము లేదా మహా ప్రాకారము
2. రెండవ ప్రాకారము లేదా సంపంగి ప్రాకారము
3. మూడవ ప్రాకారము లేదా విమాన ప్రాకారము
4. నాలుగవ ప్రాకారము లేదా వైకుంఠ ప్రాకారము

ప్రతి ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ మార్గాలను అవే పేర్లతో పిలుస్తారు.

ఒకటవ ప్రాకారానికి చుట్టూ, దేవాలయానికి బాహ్యంగా ఉన్న ప్రదక్షిణ మార్గాన్ని మహా ప్రదక్షిణ మార్గం,

మొదటి మరియు రెండవ ప్రాకారాల మధ్యభాగాన్ని సంపంగి



ప్రదక్షిణ మార్గం,

రెండవ మరియూ మూడవ ప్రాకారాల మధ్యభాగాన్ని విమాన ప్రదక్షిణ మార్గం,

మూడవ మరియు నాల్గవ ప్రాకారాల మధ్యభాగాన్ని వైకుంఠ ప్రదక్షిణ మార్గం అని అంటారు.

మొదటి మూడు ప్రదక్షిణ మార్గాలూ మనకు సుపరిచితమే కాని, మహద్భాగ్యంగా చెప్పుకోబడే వైకుంఠ ప్రదక్షిణ మార్గం చూడగలగటం మాత్రం అత్యంత అరుదుగానే జరుగుతుంది. వీటన్నిటి గురించి వీలైనంత వివరంగా తెలుసుకుందాం.

## మహా ప్రదక్షిణ మార్గం

సుమారు ముప్పై అడుగుల ఎత్తు, 1354 అడుగుల చుట్టుకొలతతో, దీర్ఘచతురస్ర ప్రాకారం చుట్టూ ఉండే ప్రదక్షిణ మార్గాన్ని మహా ప్రదక్షిణ మార్గంగా పిలుస్తారు. అంటే, లోతు ఎక్కువగా ఉంటుందన్నమాట. ఈ ప్రదక్షిణ పూర్తి చేస్తే, మనం ఆలయాన్నీ, ఆలయ వెనుకభాగంలో ఉండే ప్రేక్షక గ్యాలరీలను, లడ్డూ కౌంటర్లనూ, ఆదివరాహస్వామి ఆలయాన్ని, స్వామి పుష్కరిణినీ ఓ మారు చుట్టినట్లే. అంటే, ఈ మహాప్రాకారాన్ని చుట్టి ఉండే విశాలమైన తూర్పు–దక్షిణ–పడమర–ఉత్తర మాడవీధుల్లో, సవ్యదిశగా సంచరిస్తామన్నమాట. స్వామివారి ఊరేగింపులన్నీ ఈ మాడవీధుల్లోనే జరుగుతాయి.

ఈ మాడవీధులన్నీ ఒకప్పుడు చాలా ఇరుకుగా ఉండేవి. అయితేకాలంగడుస్తున్నకొద్దీ,వీటినివెడల్పుగా,అధునాతనంగా, శ్రీవారి ఉత్సవ రథాలు నిరాటంకంగా తిరగటానికి వీలుగా తీర్చిదిద్దారు. కానీ ఆ వీధుల్లో ఉండేటటువంటి శిల్పకళ ఉట్టిపడే అనేక మంటపాలు, కట్టడాలు కనుమరుగయ్యాయి. సుమారు 15 సంవత్సరాల క్రితం వరకూ కూడా, ఆలయానికి ఎదురుగా, చాలా సందడిగా ఉండే, "వెయ్యికాళ్ళ మంటపం" మనకు సుపరిచితమే. ఇప్పుడది కాలగర్భంలో కలిసిపోయింది.

ఈ నాల్గు మాడవీధుల కలయికతో ఏర్పడే చతుర్భుజికి ఆగ్నేయమూలలో స్వామివారి మందిరం కొలువై ఉంటుంది. ఈ మహా ప్రదక్షిణ మార్గంలో ఉండే విశేషాల్ని ఇప్పుడు తెలుసుకుందాం.

ఆలయ మొదటి ప్రాకారం లేదా మహాప్రాకారాన్ని అనుసంధానిస్తూ, ఆలయానికి తూర్పుగా మహాద్వారం, దానికి ఎదురుగా ఆలయానికి వెలుపల గొల్ల మంటపం ఉంటాయి. వీటి గురించి తరువాత తెలుసుకుందాం.

తూర్పు మాడవీధిలో, మహాద్వారానికి మరియు గొల్ల మంటపానికి మధ్య నిలబడి, దక్షిణ దిశగా వెళితే, మాడవీధి చివరగా, ప్రాచీనమైన పాత సహస్ర దీపాలంకరణ సేవ మంటపం వస్తుంది. సాధారణ సమయాల్లో ఈ మంటపం మూసివేసి ఉంటుంది. సహస్ర దీపాలంకరణ సేవను ప్రస్తుతం ప్రక్కనే ఉన్న విశాలమైన మంటపంలో చేస్తున్నారు. ఆ పాత మంటపం వెనుక హాథీరాం బాబా మఠం ఉంటుంది.

తూర్పు మాడవీధి చివర నుంచి కుడిప్రక్కకు తిరిగి, దక్షిణ మాడవీధిలో ప్రవేశించి తిన్నగా వెళితే, మొదటగా ఎడం ప్రక్కన "సుపథం" మార్గం కనబడుతుంది. అది దాటగానే, సంపంగి వృక్షాల నీడలో తిరుమలనంబి ఆలయం, దాని తరువాత క్యూ కాంప్లెక్స్ నుండి ఆలయానికి వెళ్ళే ఓవర్ బ్రిడ్జి కనబడతాయి. శ్రీవారి ఆలయ ప్రాకార అందాల్నీ, సమున్నతంగా నిలిచే ఆ కుడ్యం యొక్క రాచఠీవిని దగ్గరనుంచి చూసి తరించాలంటే, అది దక్షిణ మాడవీధిలోని ప్రథమార్థ భాగం నుండి మాత్రమే సాధ్యం. దర్శనానికి క్యూలో వెళుతున్నపుడు, ఓవర్ బ్రిడ్జి నుంచి కనువిందు చేసే ఆలయ కుడ్యభాగం ఇదే.

దక్షిణ మాడవీధిలో తిన్నగా వెళ్ళి కుడిప్రక్కకు తిరిగితే పడమర మాడవీధిలోకి ప్రవేశిస్తాము. వెంటనే మనకు "చిన్న

జీయ్యంగారి మఠం'', ''గోవింద నిలయం'' అనబడే అర్చకుల క్వార్టర్సు కనబడతాయి.

తిన్నగా వెళ్ళి మరలా కుడిప్రక్కకు తిరిగి ఉత్తర మాడవీధిలోకి ప్రవేశించగానే, వరుసగా లక్ష్మీనరసింహస్వామి ఆలయం (ఈయన భోగ నరసింహుడు. యోగ నరసింహుడు విమాన ప్రదక్షిణంలో ఉంటారు), వైఖానస అర్చక నిలయం, స్వామిపుష్కరిణి, ఆదివరాహస్వామి ఆలయం, వ్యాసరాజ ఆహ్నిక మండపం, వాటికి ఎదురుగా వైఖానస ఆగమ శాస్త్రానికి మూలపురుషుడైన విఖనస మహర్షి ఆలయం, ప్రక్కనే రాధాగోపాల ఆలయం, దాన్ని ఆనుకుని చదువులతల్లి సరస్వతికే గురువైన హయగ్రీవుని ఆలయం కనపడతాయి.

అవి దాటి మళ్ళీ కుడిప్రక్కకు తిరిగి తూర్పు మాడవీధిలోకి ప్రవేశించి తిన్నగా వెళితే ఆలయ మహాద్వారం వస్తుంది. అంటే, మనం మహా ప్రదక్షిణ పూర్తి చేసుకుని, బయలుదేరిన చోటుకే తిరిగి చేరుకున్నామన్నమాట. ఈ ప్రదక్షిణ మార్గంలో, ఆదివరాహుని ఆలయం, స్వామి పుష్కరిణి, వ్యాసరాజ మంటపం తప్ప మిగతావన్నీ మనకు ఎడం పక్కనే ఉంటాయి.

తూర్పు మాడవీధిలో స్వామి పుష్కరిణి ఉన్న ప్రాంతం, తూర్పు– దక్షిణ మాడవీధుల కలయికలో ఆలయం ఉన్న ప్రాంతాన్ని మినహాయిస్తే, మాడవీధుల మిగిలిన ప్రాంతమంతా, ఇరువైపులా విశాలమైన ప్రేక్షకుల గ్యాలరీలు ఉంటాయి. బ్రహ్మోత్సవ సమయంలో ఈ గ్యాలరీలన్నీ, స్వామివారి వాహన సేవలను చూడటానికి వేచివుండే లక్షలాది భక్తులతో క్రిక్కిరిసి ఉంటాయి. బ్రహ్మోత్సవాల గురించి మరోసారి తెలుసుకుందాం.

## మహాద్వార గోపురం

మహాప్రాకారాన్ని అనుసంధానిస్తూ ఉన్న ద్వారమే మహాద్వారం. ఇదే ఆలయం యొక్క ప్రవేశ ద్వారం. ఇది తప్ప ఆలయం లోనికి ప్రవేశించటానికి వేరే మార్గం లేదు. దీనికే ''పడి కావలి'', ''సింహద్వారం'', ''ముఖద్వారం'' తమిళంలో ''పెరియ తిరువాశల్'' (పెద్ద వాకిలి) అంటూ అనేక పేర్లున్నాయి. ఈ పెద్ద వాకిలికి 1996వ సంవత్సరంలో ఇత్తడి రేకు తాపడం చేయబడిన కారణంగా, దీన్ని ''ఇత్తడి వాకిలి'' అని కూడా పిలుస్తారు. స్వామివారిని దర్శించే భక్తులు ఒకటవ వైకుంఠం క్యూ లేదా రెండవ వైకుంఠం ద్వారా మాత్రమే వచ్చి ఈ మహాద్వారం గుండా ముందుగా దేవస్థానం వారు ఏర్పాటు చేసిన నిరంతరం ప్రవహించే నీటితో పాద ప్రక్షాళన చేసుకొని ఆలయంలోకి ప్రవేశించాలి. ఈ మార్గానికి అత్యద్భుత శిల్పకళ ఉట్టిపడుతూ, సమాంతరంగా ఉండే రెండు రాతి ద్వారాలు ఉన్నాయి. బయటవైపు ద్వారానికి రెండు పెద్ద చెక్క వాకిళ్ళు (తలుపులు) అమర్చబడి ఉన్నాయి. ఉత్తరం వైపున్న పెద్దవాకిలి నందుండే చిన్న తలుపులో నుంచి, మహాద్వారం మూసివుండే సమయంలో సిబ్బంది రాకపోకలు సాగిస్తారు.

ఈ మహాద్వారం పైన శిల్పకళా చాతుర్యం ఉట్టిపడుతూ, యాభై అడుగుల ఎత్తుతో, ఐదు అంతస్తులతో, శ్వేతవర్ణంతో, సప్త కలశాలతో శోభితమైన రాజగోపురం లేదా మహాద్వార గోపురం విరాజిల్లుతూ ఉంటుంది. ఉత్సవ సమయాల్లో పుష్పాలంకృతమై, విద్యుద్దీపాల కాంతిలో మరింత శోభాయమానంగా ఉంటుంది. 13వ శతాబ్దంలో ప్రారంభమైన ఈ రాజగోపుర నిర్మాణం, తరువాతి కాలంలో అంచెలంచెలుగా పూర్తైనట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది.

## శంఖనిధి – పద్మనిధి

పాదప్రక్షాళన చేసుకోగానే, ఆలయ మహాద్వారానికి ఇరువైపులా దిగువభాగంలో, సుమారు రెండడుగుల పంచలోహ విగ్రహాలు కన్పిస్తాయి. వీరు శ్రీవారి సంపదను రక్షించే దేవతలు. ఆనందనిలయుని అంతులేని ఆస్తుల్ని అమరులే రక్షించాలి గాని, అల్ప మానవుల వల్ల అవుతుందా?

ఇతిహాసాల ప్రకారం ఒకానొకప్పుడు కుబేరుడు ఘోరమైన తపస్సు చేసి బ్రహ్మదేవుడి నుండి శంఖనిధి, పద్మనిధి, పుష్పక విమానాలను వరాలుగా పొందాడు. శ్రీవారికి పద్మావతీ పరిణయ సందర్భంలో తాను అప్పుగా ఇచ్చిన 14 లక్షల బంగారు నాణాల్ని వడ్డీతో సహా తిరిగి తీసుకునే నిమిత్తం, కుబేరుడే ఆ బ్రహ్మదత్త దేవతలను శ్రీవారి సంపదలకు కాపుంచాడని కొందరి విశ్వాసం.

ఇందులో ఎడమవైపు, అంటే దక్షిణ దిక్కులో ఉండే రక్షక దేవతయైన శంఖనిధి రెండు చేతుల్లో రెండు శంఖాలు ఉంటాయి. మందిరంలోకి ప్రవేశించేటప్పుడు ఈ దేవతను స్పృశించి నమస్కరించుకోవచ్చు. కుడివైపున ఉండే దేవత పద్మనిధి రెండు చేతుల్లో రెండు పద్మాలు ఉంటాయి. క్యూ నిబంధన కారణంగా, దేవాలయంలో నుంచి బయటకు వెళ్ళేటప్పుడు మాత్రమే ఈ దేవతను స్పృశించగలం.

ఈ నిధి దేవతల పాదాల వద్ద, ఆరంగుళాల ఎత్తుగల నమస్కార భంగిమలో ఉన్న విజయనగర రాజైన అచ్యుత రాయలు విగ్రహాన్ని చూడవచ్చు. దీన్నిబట్టి ఆ విగ్రహాల్ని ఆ రాజే ప్రతిష్ఠించి ఉండవచ్చని భావిస్తున్నారు. ఆగమ శాస్త్రానుసారం, ఈ నిధి దేవతలను ఆలయానికి మూడవ ప్రాకార ప్రవేశద్వారం వద్ద ఏర్పాటు చేయడం సాంప్రదాయం. **(ఇంకా ఉంది)**


“ గోమాత స్వర్గానికి పాస్ పోర్ట్ – మన పుణ్యానికి పాస్ వర్డ్



# నవవిధ భక్తిమార్గాలు

– డా॥ కూర్మాచలం శంకరస్వామి

## నామస్మరణ భక్తి

తను హృద్భూషల సఖ్యమున్, శ్రవణమున్, కీర్తనమున్, విష్ణోర్నామ స్మరణమున్, వందనార్చనముల్, పాదసేవనముల్, దాస్యము, ఆత్మనివేదనమనే నవవిధ భక్తి మార్గాలలో 'నామస్మరణం' అత్యంత ప్రశస్తమైనది. దీనికి ప్రతీకగా ప్రహ్లాదుణ్ణి పేర్కొన్నది భాగవతం.

దైత్యేంద్రుడైన హిరణ్యకశిపుని నలుగురు పుత్రులలో ప్రహ్లాదుడు పెద్దవాడు. ఇతడు గొప్ప హరిభక్తుడు. అతనికి సర్వభూతదయ తల్లి గర్భము నుండే అలవడింది. పరస్త్రీలను తల్లిలాగా భావించేవాడు. పెద్దలు కనిపిస్తే వినయంగా శిరస్సు వంచి నమస్కరించేవాడు. కష్టాలలో ఉన్నవారిని తన శక్తి మేరకు ఆదుకునేవాడు. అందరినీ సమభావంతో చూచేవాడు. స్నేహితులను సోదరుల కంటే అధికముగా చూచేవాడు. మంచి అందం, విద్యాగంధం పుష్కలంగా ఉన్నవాడు. కావలసినంత సంపద, సౌభాగ్యం ఉన్నవాడు. విషయేంద్రియాలపై గట్టి పట్టు సాధించినవాడు. బలం, వయసు, ప్రతిభ, ప్రాభవం ఉన్నప్పటికీ అందరితో కలిసి మెలిసి ఉండేవాడు. క్రోధాది అరిషడ్వర్గాల, భోగవిలాసాలకు దూరంగా ఉండేవాడు. ఎల్లప్పుడు హరినామస్మరణ తప్ప వేరే ఇతరములు తెలియనివాడు.

**"గుణనిధి యను ప్రహ్లాదు**
**గుణము లనేకములు గలవు గురు కాలమునన్**
**గణుతింప నశక్యంబులు**
**ఫణిపతికి బృహస్పతికిని భాషాపతికిన్"**

ఈ సద్గుణాల రాశి యైన ప్రహ్లాదుని తండ్రి పూర్తి విరుద్ధ స్వభావము కలవాడు. ప్రహ్లాదుడు గుణనిధి అయితే, హిరణ్యకశిపుడు దుర్గుణధనుడు. తన సోదరుడైన హిరణ్యాక్షుణ్ణి ఆ శ్రీహరి మోసంతో సంహరించాడనే కోపంతో దేవతలపై ద్వేషం పెంచుకుని, బ్రహ్మదేవునికై ఘోర తపస్సు చేసి వరాలను పొందాడు. ఆ వర గర్వంతో దేవతలను, యక్ష కిన్నర, నాగ, నభశ్చరులను పీడించేవాడు. మునులను, మునిపత్నులను పరివేధించేవాడు. ఇంద్రాది దేవతలను స్వర్గం నుండి తరిమికొట్టి వారి రాజధానియైన అమరావతిని హస్తగతం చేసుకొని, నేనే దైవాన్ని అని, వేరొకరు ఎవరూ లేరని విర్రవీగుతూ ఉండేవాడు. కాని ప్రహ్లాదుడు అలాకాదు. అనునిత్యము హరినామ స్మరణ



తప్ప అన్యమెఱుగని అగణిత భక్తిసంపన్నుడు. తన హృదయంలో నారాయణుడున్నాడని, అందరినీ మరిచి ఆ శ్రీహరినే స్మరించేవాడు. పడుకున్నా, లేచినా, పాలు త్రాగినా ఏ విధికైనా నారాయణ స్మరణే.

**"పానీయంబులు త్రావుచున్, కుడుచుచున్, భాసించుచున్, హాస లీ**
**లా నిద్రాదులు సేయుచున్, తిరుగుచున్, లక్షించుచున్, సంతత**
**శ్రీనారాయణ పాదపద్మ యుగళీ చింతామృతా స్వాద సం**
**ధానుండై మరచెన్ సురారి సుతుడె తద్విశ్వమున్ భూవరా"**

ఈ విషయాన్ని గమనిస్తున్న ప్రహ్లాదుని తండ్రియైన హిరణ్యకశిపుడు కుమారుని స్థితికి బాగా ఆలోచించి, ఈ బాలుడు నాకు విరోధియైన ఆ శ్రీహరినే బాగా ధ్యానిస్తున్నాడు. అతని మనస్సు మార్చాలని, దానికి తన దానవ విద్యోపదేశం చేయించాలని మనసులో అనుకున్నాడు.

ఒకనాడు కుమారుని రావించి "పుత్రకా విద్య జ్ఞానాన్ని ఇస్తుంది. చదువు లేనివాడు రెండుకాళ్ళ పశువు వంటివాడు.

చదువు లేనివాడు అజ్ఞానితో సమానం. కావున నీవు మన గురుదేవుల దగ్గర చదువుకోవాలి. అప్పుడే నీకు మన జాతి బుద్ధి కుశలత ఏర్పడతుంది.

**"చదువని వాడజ్ఞుండగు**
**చదివిన సద సద్వివేక చతురత గల్గున్**
**చదువగ వలయును జనులను**
**చదివించెద ఆర్యులొద్ద చదువుము తండ్రీ!"**

అని తన గురువైన శుక్రాచార్యుని కుమారులు చండామార్కులను పిలిపించాడు హిరణ్యకశిపుడు. వారితో "మహాత్ములారా! వీడు పసివాడు. నా ప్రతాపములు వీనికి ఏమీ తెలియవు. ఎంతో అజ్ఞానములో కొట్టుకు పోవుచున్నాడు. మీరు ఈ బాలకునికి మన విద్యా సౌగంధ్యాన్ని నేర్పించండి. మీరు మా గురుదేవులు, మాన్యులు, బంధువులు, ఆప్తులు, శ్రేయోభిలాషులు. మీకన్నా మాకు దగ్గరివారు ఎవరూ లేరు. వీనికి చక్కని నీతి శాస్త్రాలను బోధించండి అని హిరణ్యకశిపుడు గురువులను కోరాడు. అప్పుడా ప్రచండ వితర్కులైన చండామార్కులు ఆ బాలుని గురుకులమునకు తోడ్కొని వెళ్ళి తమ తమ దానవ విద్యలను బోధించసాగారు.

ప్రహ్లాదుడు గురువుల పట్ల అత్యంత వినయ విధేయతలను ప్రదర్శిస్తూ వారు చెప్పేది శ్రద్ధగా వినేవాడు. వారితో ఎప్పుడూ వాదోపవాదాలకు దిగకుండా తాను మాత్రం ఆ శ్రీహరి కథలు వింటూ, అతని నామస్మరణ చేస్తూ కాలక్షేపం చేశాడు. ఇలా కొన్ని రోజులు గడిచాక, కుమారుని విద్యాగంధం, నీతిశాస్త్రం ఎంతవరకు వచ్చిందో చూడాలని హిరణ్యకశిపుడు గురుకులం నుండి ప్రహ్లాదుని పిలిపించాడు. అమితానందంతో కుమారుణ్ణి ఆలింగనం చేసుకొని "ఓ కుమారా! పుత్రుల సంభాషణలే తండ్రుల చెవులకు భూషణాలు. సంతోషానికి కారణాలు. దుఃఖాన్ని పోగొట్టేవి అవే. ఇన్ని రోజులు నీవు చదివిన వేదశాస్త్ర నీతిలో నీకు బాగా నచ్చినదేదో వివరించమ"ని తనయుని ముద్దు పెట్టుకున్నాడు హిరణ్యకశిపుడు.

అప్పుడు ప్రహ్లాదుడు తన తండ్రితో వినయంతో ఇలా చెప్పాడు. "ఓ పితృదేవా! దేహాన్ని ధరించేవారందరికీ తమ గృహమనే అభిమాన చీకటి నూతిలో పడక నావారూ నీవారనే భేదభావం లేకుండా ఉండాలి. అందరూ మతి చలించి తిరుగుతున్నారు. ఈ సర్వము ఆ శ్రీహరి యొక్క కటాక్షమని భావించి ప్రశాంతముగా వనములో జీవించుటే ఈ జన్మకు సార్థక్యము" అని బదులిచ్చాడు ప్రహ్లాదుడు.

ప్రహ్లాదుని మాటలకు హిరణ్యకశిపుడు ఒక్కసారి ఆశ్చర్యచకితుడై కుమారుని చేరదీసి "కుమారా! నీవంటి పసిపిల్లలు పెద్దలు ఏది చెబితే అదే పలుకుతారు. చిలుకల లాంటివారు మీరు. నీ ఈ బోధ గావించినవారెవరు? విష్ణువు మనకు ఆజన్మ విరోధి. అతని నామస్మరణం మనము చేయకూడదు. అది మన రాక్షస వంశానికే పెద్ద మచ్చ అని నెమ్మదిగా మందలించాడు. ఆ తరువాత గురువుల వైపు తిరిగి

**"ఎట్టాడిన నట్టాడుదు**
**రిట్టట్లని పలుక నెఱుగ రితరుల శిశువుల్**
**దట్టించి యెవ్వరేనియు**
**బట్టించిరొ బాలకునకు బరపక్షంబుల్"**

**"నాకుం జూడగా జోద్యంబయ్యె గదా! నా తండ్రి ఈ బుద్ధి దా**
**నీకున్ లోపల దోచెనో? పరులు దుర్నీతుల్ పఠింపించిరో**
**ఏకాంతబున భార్గవుల్ పలికిరో ఈ దానవశ్రేణికిన్**
**వైకుంఠుండు కృతాపరాధు డతనిన్ వర్ణింప నీకేటికిన్"**

అని హిరణ్యకశిపుడు పలుకగా ప్రహ్లాదుడిట్లనియే. "కొందరు మూఢులు శ్రీమన్నారాయణుడే సర్వాంతర్యామియని తెలుసుకోలేక నేను, నేను, నాది నాది యనుచు ఈ సంసారం, ఈ ప్రభుత్వమంతా నాదేనని భేదభావంతో ఉంటారు. ఆ బ్రహ్మాదులు మాత్రమే ఆ పురుషోత్తముని దర్శనం చేసుకొన గలుగుతారు" అనగా "ప్రహ్లాదా! నీ విపరీత వాగుడు కట్టిపెట్టు, హరి లేదు, గిరి లేదు" అని ఆగ్రహించాడు హిరణ్యకశిపుడు. దానికి ప్రహ్లాదుడు ప్రశాంత చిత్తంతో ఇలా అన్నాడు. తండ్రీ!


**"మందార మకరంద మాధుర్యమున దేలు**
**మధుపంబు బోవునే మదనములకు**
**నిర్మల మందాకినీ వీచికల దేలు**
**రాయంచ చనునే తరంగిణులకు**
**లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు**
**కోకిల చేరునే కుటజములకు**
**పూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరకం**
**బరుగునే సాంద్ర నీహారములకు**
**అంబుజోదర దివ్యపాదారవింద**
**చింతనామృత పాన విశేష మత్త**
**చిత్తమేరీతి నితరంబు చేరనేర్చు**
**వినుత గుణశీల మాటలు వేయునేల?"**

"ఓ తండ్రీ! వేయి మాటలు ఎందుకు? మందారపుష్పం అందంగా ఆకర్షణీయంగా ఉంటుంది. అటువంటి పువ్వులో ఉండే మాధుర్యాన్ని అనుభవించే తుమ్మెదలు ఉమ్మెత్తపూలవైపు పోతాయా? నిర్మలాతి నిర్మలంగా ఉన్న పరమ పావన గంగా తరంగాలలో తేలియాడుచు అందులో గల తామరతూడులను భక్షించు రాజహంస చిన్న మురికి గుంటలోకి వెళుతుందా? తీయమామిడి గున్న చిగురుటాకులే తిని ఆనందించు సంగీత సరస్వతి కోకిలమ్మ గడ్డిపరకలను తింటుందా? పరిపూర్ణ పూర్ణమి చంద్రునిలో గల అమృత కిరణాలను ఆహారంగా చేసుకునే చకోరం దట్టమైన మంచుగడ్డలవైపు వెళుతుందా?

అలాగే శ్రీమన్నారాయణుని పాద ధ్యానామృత పానంతో విశేషమైన మత్తుగల నా చిత్తం ఇంకొక దానిలో చేరుతుందా?'' అని ప్రహ్లాదుడు పలుకగానే, గురువులైన చండా మార్కులు కోపంతో ఊగిపోతూ ప్రహ్లాదుని చూస్తూ ''ఏరా! నీకు అయిదు సంవత్సరాలు కూడా నిండలేదు. ఇంతవరకు మేము చెప్పిన పాఠాల్లోనివి ఒక్కటీ చెప్పకుండా ఏమి నీ వాగుడు? ఎందుకిలా ఎదురు తిరుగుతున్నావు? ఇంత ఘోరమా? రాక్షస రాజునే ఎదిరించి మాట్లాడుతావా? ఎంతటి అహంకారం? ఎంతటి అవమానం? ఆయన పేరు విన్నంత మాత్రాన ముల్లోకాలు భయభ్రాంతులకు గురౌతాయి. నీవు అతనికి పుత్రుడవు కావు, శత్రువువు. రాక్షస చందనవనంలో పుట్టిన ముళ్ళచెట్టువు నీవు. వీణ్ణి దండిస్తే గాని వీనిలో మార్పు రాదు'' అని గురువులు ప్రహ్లాదుని తీసుకొని పోయారు. ఒక ఏకాంత ప్రదేశంలో అతనికి సామ దాన భేద దండోపాయాలను ప్రయోగించి రాక్షస విద్యను బోధించారు. అయినను ప్రహ్లాదునిలో మార్పు రాలేదు. చివరకు తల్లి చేత అతన్ని అలంకరింపచేసి దానవరాజు దగ్గరకు తీసుకుని వెళుతూ గురువులు ప్రహ్లాదునితో ఇలా అన్నారు. ''నాయనా! మేము చెప్పినవన్నీ మీ తండ్రి గారికి అప్పజెప్పాలి'' అని రాజు ముందు ప్రహ్లాదుని నిలబెట్టారు. కాని ప్రహ్లాదుని మనస్సు నిండా హరి అవతారమే మెదులుతున్నా తండ్రికి నమస్కరించి, సభలో నిలబడ్డాడు ప్రహ్లాదుడు. అతన్ని లేవనెత్తి తన తొడపై కూర్చుండ బెట్టుకొని ఇంతకాలము నీవు నేర్చుకున్నది వివరింపుము అని హిరణ్యకశిపుడు అడగగానే ప్రహ్లాదుడు తన మనస్సు నిండా శ్రీహరిని నింపుకొని ఇలా అన్నాడు.

**''చదివించిరి నను గురువులు**
**చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు నే**
**చదివినవి కలవు పెక్కులు**
**చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ''**

ఆ శ్రీహరిపై భక్తి లేని జన్మ వృథా యని, అతనికి నమస్కారం, అర్చన, దాసత్వం, ఆత్మజ్ఞానంతో కీర్తిస్తూ, సర్వాంతర్యామి నారాయణుని గాఢమైన భక్తితో నమ్మడం సజ్జనులకు, జ్ఞానులకు శ్రేయోమార్గం. శ్రీహరి భక్తి లేనివారికి ఈ పనులన్నీ, కన్నులు లేనివానికి వెన్నెల వెలుగులా, చెవిటికి శంఖధ్వనిలా,



నోరు లేనివానికి గ్రంథం చదవడంలా, నపుంసకునకు సుందరి పొందులా, చేసిన మేలు మరచిపోయే కృతఘ్నునితో బంధుత్వంలా, బూడిదపై అవిస్సులా, పిసినారి ధనములా, పందికి పూసే సుగంధంలా ఉంటాయి. అంతేకాదు తండ్రీ!

**''కమలాక్షు నర్చించు కరములు కరములు**
**శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ**
**సుర రక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు**
**శేషశాయికి మ్రొక్కు శిరము శిరము**
**విష్ణునాకర్ణించు వీనులు వీనులు**
**మధువైరి తవి విన మనము మనము**
**భగవంతు వలగొను పదములు పదములు**
**పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి**
**దేవదేవుని చింతించు దినము! దినము!**
**చక్రహస్తు ప్రకటించు చదువు! చదువు!**
**కుంభినీధవు చెప్పెడు గురువు! గురువు!**
**తండ్రీ! హరి జేరుమనెడు తండ్రి! తండ్రి!**

హరిని పూజించని చేతులు కట్టెతో చేసిన తెడ్డులని, కమలాక్షు చూడని నేత్రాలు శరీరమను గోడకు కొట్టిన రంధ్రాలని, శ్రీపతిని గురించి ఆలోచించని జన్మగాలిబుడగని, విష్ణుభక్తి లేని పండితుడు రెండు కాళ్ళున్న పశువని, అలా భక్తిభావామృతంలో తేలుతూ మునుగుతూ శరీరంపై స్పృహ లేకుండా, ప్రహ్లాదుడు హరిని గూర్చి మాట్లాడుతుంటే హిరణ్యకశిపుని శరీరమంతా మంటలు చెలరేగాయి. మద్యం మత్తులో అతని నేత్రాలు ఎరుపెక్కాయి. తన కుమారుడని చూడకుండా అతనిని శూలాలతో పొడిపించాడు. ఏనుగులు, గుఱ్ఱాలతో తొక్కించాడు. సర్పాలతో కాటు వేయించాడు. అగ్నిలో పడవేశాడు. అయినను ప్రహ్లాదుడు శ్రీహరి కృపతో చావలేదు. మరింత కోపంతో ఊగిపోతూ ''ఏడిరా నీ హరి?'' అనగా ప్రహ్లాదుడు భక్తి పారవశ్యంతో ''సర్వాంతర్యామి ఎందెందు వెదకి చూసినా అందందె గలడు దానవాగ్రిన్ వింటే'' అనగానే హిరణ్యకశిపుడు ఈ స్తంభంలో ఉన్నాడా అని తన గదతో ఒక్కపోటు పొడిచాడు. అంతే! భూమ్యాకాశాలు దద్దరిల్లే శబ్దం చేస్తూ శ్రీహరి నరసింహుని రూపంలో వచ్చి హిరణ్యకశిపుని సంహరించి ప్రహ్లాదుని రక్షించాడు.

త్రికరణశుద్ధిగా తన కథలు విన్నా, తన కీర్తనలను గానం చేసినా, తన పాదాలను శరణు వేడినా, తన రూపానికి నిత్యం వందనార్చనములు చేసినా, తనతో సఖ్యం చేసినా, దాస్యం చేసినా, తనకు తానుగా ఆత్మనివేదనం చేసిన భక్తులను రక్షిస్తానని ప్రహ్లాదుని చరిత్ర ద్వారా నిరూపించాడు శ్రీహరి. అందుకే ''మునిజనవన చైత్రంబులు విష్ణుదేవుని చారిత్రంబుల్'' అని శ్రీహరిని కీర్తించారు దేవతలు. అందువల్ల స్మరణ భక్తికి ఇంతటి విశిష్టత ఏర్పడింది.

# పుష్యమాసం విశిష్టత

– కౌతా నిర్మల

శ్రావణ పౌర్ణమి నుంచి పుష్యమాస పౌర్ణమి వరకు వేదాలు, జప మంత్రాలు నేర్చుకోవటానికి విశేషమైన కాలంగా పరిగణించబడింది. పుష్యమాసం శనిభగవానునికి ప్రీతికరమైన మాసం. శని జన్మ నక్షత్రం పుష్యమి. పుష్యమాసమంతా శని దేవుడిని పూజిస్తే వారిపట్ల శని వక్రదృష్టి తొలగిపోయి, శని అనుగ్రహం భక్తులకు లభిస్తుందని పురాణాలు తెలిపాయి. తమ జాతకంలో ఏలినాటి శని ఉన్నవారు, ఈ మాసంలో ప్రతిరోజూ ఉదయానే స్నానం చేసి, శుచిగా శనీశ్వరుని పూజిస్తే వారి బాధలు, సమస్యలు, కష్టాలు తొలగిపోతాయి. పౌర్ణమి రోజున శనికి నువ్వులనూనెతో అభిషేకం చేసి, ఒక సద్బ్రాహ్మణునికి నువ్వుల నూనెను దానంగా ఇస్తారు. శనికి ఇష్టమైన నువ్వుల నూనెను, బెల్లాన్ని ఆహార పదార్థాల్లో వాడుతారు. నువ్వుల ఉండలను చేసి పంచిపెడతారు.

పుష్యమాసంలో చలి అధికంగా ఉంటుంది కనుక ఆ చలి ప్రభావాన్నుంచి తప్పించుకోవటానికి నువ్వులు, బెల్లాన్ని ఉపయోగిస్తారు. అది చలినుంచి కాపాడి, శరీరంలో వేడిని కలిగిస్తుంది. శనిభగవానుడు ధర్మ పరిపాలకుడు. అధర్మంగా ప్రవర్తించే వారిని బాధకు గురిచేస్తాడు. పుష్యమాసం మొదటి పక్షంలో విష్ణుమూర్తిని పూజిస్తారు భక్తులు. ఆ నెల రోజులు విష్ణు పారాయణం చేస్తారు. పుష్య శుక్ల విదియ నుంచి, పంచమి వరకు శ్రీమహావిష్ణువును తులసిదళాలతో పూజించినట్లయితే శారీరక వర్చస్సు, సౌందర్యం పెంపొందుతాయట. పుష్య సోమవారాల్లో పరమేశ్వరుని మారేడు దళాలతో పూజిస్తారు. ఆదివారం నాడు సూర్యభగవానుని జిల్లేడుపూలతో పూజిస్తారు. తమిళ ప్రాంతంలో శుక్ల పక్ష షష్ఠి నాడు కుమారస్వామిని అర్చిస్తారు. శుక్లపక్షంలో అష్టమి తిథి నాడు పితృదేవతా కార్యాలను నిర్వర్తిస్తారు.

ఈ మాసంలోని శుద్ధ ఏకాదశిని పుత్రదా ఏకాదశి అంటారు. ఈ రోజున ఏకాదశీ వ్రతాన్ని నియమ నిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో ఆచరిస్తే పుత్ర సంతానాన్ని పొందవచ్చని భక్తుల పరిపూర్ణ విశ్వాసం. పుష్యమాసంలో చేసే వస్త్రదానం వల్ల విశేష ఫలితం లభిస్తుందని ఆధ్యాత్మికులు చెబుతారు. అందుకు కారణం చలి బాధనుంచి తప్పించేందుకు వస్త్రదానం, చలినుంచి రక్షణ పొందేందుకు దుప్పటిని దానం చేసి, వారిని చలిబాధ నుంచి కాపాడటం.

పుష్యమాసంలో సంక్రాంతి పండుగ వస్తుంది. ఈ పండుగను మూడు రోజులు జరుపుకుంటారు. మొదటి రోజును భోగి అంటారు. భోగి రోజు తెల్లవారు జామున భోగి మంటలను వేస్తారు. దక్షిణాయనానికీ, ధనుర్మాసానికీ ఆఖరి రోజు భోగి. భోగి రోజున వైష్ణవాలయాల్లో గోదాదేవి, రంగనాథుల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా జరుపుతారు. భోగి రోజున పిల్లలకు భోగిపళ్ళు పోస్తారు. మర్నాడు సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. ఆ రోజును మకర సంక్రాంతిగా పిలుస్తారు. ఆ రోజునుంచి పవిత్రమైన ఉత్తరాయణ కాలం ప్రారంభమవుతుంది. సంక్రమణం నాడు రాత్రి సమయంలో భోజనం చేయకూడదని పురాణాలు తెలిపాయి.

సంక్రాంతి రోజున శివుడిని ఆవునేతితోనూ, నువ్వులతోనూ అభిషేకిస్తేదారిద్ర్యబాధనుంచివిముక్తిపొంది,సకలభోగభాగ్యాలు కలుగుతాయి. సంక్రాంతికి బొమ్మల కొలువు పేర్చి పేరంటం చేస్తారు. సంక్రాంతి పండుగ మర్నాడు కనుమ పండుగను జరుపుతారు. రైతులు ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా జరుపుకునే పండుగ ఇది. కనుమనాడు వ్యవసాయంలో తమకు సహకరించే పశువులకు శుభ్రంగా స్నానం చేయించి, వాటిని చక్కగా అలంకరిస్తారు. ధాన్యరాశులను, పశువులను, భూమిని పూజిస్తారు. పుష్య బహుళ ఏకాదశిని విమలైకాదశి, సఫలైకాదశి, కళ్యాణ ఏకాదశి లాంటి పేర్లతో పిలుస్తారు. ఈ ఏకాదశి రోజున నువ్వులను కలిపిన నీటితో స్నానం చేస్తారు. మంచినీటిలో నువ్వులను కలుపుకుని తాగుతారు. ఆహార పదార్థాల తయారీలో నువ్వులను చేరుస్తారు. ఏకాదశి రోజున తిలదానం చేస్తారు.

ఈ మాసంలోని అమావాస్యను చొల్లంగి అమావాస్య అంటారు. ఈ రోజు పుణ్యనదుల్లో స్నానాలు చేసి దేవాలయాలను సందర్శిస్తారు. పితృతర్పణాలు, పితృకార్యాలు చేసి, పెద్దల పేరుతో అన్నదానాలు చేసి పితృదేవతలకు సంతృప్తిని కలిగిస్తారు. పిల్లలకు వారి అనుగ్రహం కలుగుతుంది. వంశాభివృద్ధి జరుగుతుంది. పుష్యమాసంలోని సుప్రభాత సమయంలో ప్రసరించే సూర్యకాంతి దేహానికి చైతన్యాన్ని కలిగిస్తుంది. పుష్యమి ఒక విశిష్టమైన నక్షత్రంగా పరిగణించబడింది. ఉత్తరాయణ పుణ్యకాలంలో సూర్యభగవానుడు దక్షిణం నుంచి ఉత్తర దిక్కుగా పయనిస్తాడు. సూర్యకిరణాలలోని శక్తి, బుద్ధిని వికసింప చేస్తుంది. బుద్ధిశక్తి పెంపొంది శుభాలు జరిగే మాసం పుష్యమాసం. పుష్యమాసంలో ప్రతి ఇంటి ముందు పెద్ద పెద్ద ముగ్గులు, ఆ ముగ్గుల్లో గొబ్బిళ్ళు కనిపిస్తాయి. పుష్యమాసంలో వచ్చే సంక్రాంతికి గాలిపటాలు, ముగ్గులు, గొబ్బిళ్ళు, హరిదాసులు, గంగిరెద్దులు, బుడబుక్కల జోస్యం, జంగం దేవరలు ఎంతో ప్రసిద్ధి. స్త్రీలకు ముగ్గుల పోటీలు పత్రికలు, అపార్టుమెంట్లు నిర్వహిస్తాయి.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**

(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ-పురుషులకు, భార్యాభర్తల మధ్య గొడవలు ఏర్పడే సూచనలు ఉన్నాయి. భార్య అనారోగ్యం, సంతాన సంబంధిత సమస్యలు కలగవచ్చు. మిత్రులు శత్రువులుగా మారే పరిస్థితులు, అధిక ప్రయాణాలు, ప్రయాణాలలో అపశృతులు సంభవించవచ్చు. ప్రతి విషయంలో అప్రమత్తత అవసరం. మనసును నిలకడగా ఉంచుకొని ముందస్తు ప్రణాళికతో దైవారాధన చేయవలెను. తక్కువగా మాట్లాడటం, ఆవేశాన్ని నియంత్రించడం అత్యవసరం.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ-పురుషులు ప్రత్యేకంగా జాగ్రత్తగా ఉండవలసిన కాలమిది. బంధువులు, మిత్రులతో భేదాభిప్రాయాలు ఏర్పడే అవకాశముంది. గృహశాంతి నిలుపుకోవడం వలన అవరోధాలు తొలగి, శుభవార్తల ద్వారా ఆనందాన్ని పొందగలరు. పిల్లల అనారోగ్య విషయాలలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. శాంతి పూజలు చేయడం మంగళకరం.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ-పురుషులకు ప్రతి విషయంలో వ్యతిరేకత ఎదురైనప్పటికీ, వాటిని మనసులో పెట్టుకోకుండా ధైర్యంగా ముందుకు సాగవలెను. నూతన ఆలోచనలను అలవరుచుకోవడం వలన సమస్యలపై దృష్టి తగ్గి, పురోగతి సాధించగలరు. అన్ని విధాలుగా సంతృప్తిని పొందే అవకాశముంది. గురు చరిత్ర పారాయణ చేయడం శుభప్రదం.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ-పురుషులకు కాలం అనుకూలంగా ఉంటుంది. అధికారులతో, రాజకీయ నాయకులతో వివాదాలకు దూరంగా ఉండవలెను. ఎంత ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పటికీ మనసులో నామస్మరణను నిరంతరం కొనసాగించాలి. మీరు తలచిన కార్యాలు నెరవేరే అవకాశముంది. ధనాదాయం కలుగుతుంది. ఓం నమో నారాయణాయ నామ జపం చేయడం శ్రేయస్కరం. శత్రువులు మిత్రులుగా మారే సూచనలు ఉన్నాయి.

## సింహరాశి

**మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ-పురుషులకు మానసిక ఆందోళనలు కలగవచ్చు. ప్రతి విషయంలో ఆచితూచి వ్యవహరించాలి. తొందరపాటు నిర్ణయాలు సమస్యలకు దారితీయవచ్చు. తక్కువగా మాట్లాడటం మంచిది. వెంటనే స్పందించాల్సిన అవసరం లేని విషయాలలో సమయం ఇవ్వాలి. కాలమే తీర్పు చెపుతుంది. నవగ్రహ ఆరాధన, దాన ధర్మాలు చేయడం మంగళకరం.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ-పురుషులకు వ్యాపార వ్యవహారాలలో లాభాలు పొందే అవకాశముంది. విలువైన వస్తువులు, వాహనాలు, ప్లాట్లు వంటి వాటిని తమ శక్తి కొలది వినియోగించుకోవచ్చు. పెద్దల మన్ననలు, ఆశీస్సులు లభిస్తాయి. ఉత్సాహంగా, చురుకుగా ఉండగలరు. అయితే శత్రు భయం ఉండే సూచనలు ఉన్నాయి. దుర్గా పారాయణ చేయడం శుభఫలితాలను ఇస్తుంది.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ-పురుషులు ఇతరులతో వినయంగా మాట్లాడగలరు. స్త్రీలకు సంబంధించిన విషయాలలో అత్యంత జాగ్రత్త అవసరం. దైవ దర్శనాలు, వాహన ప్రయాణాలు చేయవలసి వస్తాయి. ప్రయాణ సమయంలో అప్రమత్తత తప్పనిసరి. శుభ ముహూర్తాలు అనుకూలించగలవు. గ్రహారాధన చేయడం అత్యంత అవసరమైన కాలమిది.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ-పురుషులకు కాలం అనుకూలంగా ఉంటుంది. ప్రతి విషయంలో ఆదాయ వనరులు లభిస్తాయి. అయితే ఆడంబరాలు, అనవసర వ్యయాల వలన అధిక ఖర్చు ఏర్పడవచ్చు. నీరు ఉందని పారపోస్తే నీరు దొరకనట్లు, ఉన్నదానిని విలువగా వినియోగించాలి. శివారాధన చేయడం వలన అనుకూలత మరింత పెరుగుతుంది.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ-పురుషులు చక్కని అనుభూతులతో కాలం గడుపుతారు. మనోనిగ్రహం వలన ప్రతి విషయంలో సంతృప్తి కలుగుతుంది. ఆర్థికంగా వెసులుబాటు ఉంటుంది. సొంత ఊరులో సందడి, ఆనందకరమైన వాతావరణం ఏర్పడుతుంది. బొమ్మల కొలువులు, సంక్రాంతి సరదాలు, విందులు వినోదములతో సమయాన్ని హర్షాతిరేకంగా గడుపుతారు.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ-పురుషులకు కొంత ఊరట కలుగుతుంది. గత కాలంతో పోలిస్తే కొంత వెసులుబాటు ఏర్పడుతుంది. బంధుమిత్రులతో కలయిక, విందు వినోదాలు ఉంటాయి. అనుకోని ప్రయాణాలు చేయవలసి రావచ్చు. అనారోగ్య సూచనలు ఉన్నందున జాగ్రత్త అవసరం. కొంత ధనాదాయం కలుగుతుంది. సూర్యభగవానుని పూజలు చేయడం, సూర్యదండకం పారాయణ చేయడం శ్రేయస్కరం.

## కుంభరాశి

**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ-పురుషులకు కాలం అనుకూలంగా ఉంటుంది. ఆర్థికంగా వెసులుబాటు ఉంటుంది. విదేశీ సంబంధమైన వ్యాపారాలు చేసేవారికి ప్రత్యేకంగా అనుకూలత లభిస్తుంది. నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇతరుల సహాయ సహకారాలు అందుకుంటారు. అమావాస్య రోజు, కనుమ రోజు పితృదేవతల పూజలు చేయడం మంగళకరం.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ-పురుషులకు అనుకూల ఫలితాలు కలుగుతాయి. ఇంటా బయట తెలియని సంతృప్తి, ఆనందానుభూతి కలుగుతుంది. వస్తు-వాహన యోగం ఉన్నది. గృహ అలంకరణ, సౌందర్యానికి మొగ్గుచూపుతారు. అన్నదమ్ములతో మాటలలో స్వల్ప కలతలు ఏర్పడవచ్చు. సమాధానాన్ని శాంతిగా, సంతృప్తికరంగా ఇవ్వాలి. కనుమ రోజు, అమావాస్య రోజు పితృదేవతలకు తర్పణం ఇవ్వడం, నవగ్రహ ప్రదక్షిణలు చేయడం శుభప్రదం.

# మీ విజ్ఞానం

నిర్వహణ: డా.పి. లలితవాణి

శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక

ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. శ్రీకృష్ణుడు మాసాలలో తాను ఎవరినని చెప్పాడు?
2. విష్ణుచిత్తుని అసలు పేరేమిటి?
3. ఆండాళ్ దేవి గోవింద దాసుని ఏ రూపంలో సమ్మతి తెలిపింది?
4. 90వ కళ్యాణం ఎప్పుడు జరిగింది?
5. నర నారాయణులు ఎవరి పుత్రులు?
6. దధిముఖుడు ఎవరు?
7. "ఆంధ్రభాష కూడా దేవభాషే" అన్నది ఎవరు?
8. కంచి వరదరాజస్వామికి వజ్ర కిరీటాన్ని అమర్చింది ఎవరు?
9. జనక మహారాజు పురోహితుడు ఎవరు?
10. శ్రీవారికి నేటికీ పవళింపు సేవలో హారతినిచ్చేది ఎవరి వంశస్థులు?
11. భగవద్గీతకి ఎన్ని పేర్లున్నాయి?
12. భవిష్యత్ బ్రహ్మ ఎవరు?
13. నాచ్చియార్ కోవిల్ లోని తీర్థమేది?
14. మేధావి మహర్షికి కూతురిగా జన్మించిన లక్ష్మీదేవి పేరేమిటి?
15. విదురునిగా ఎవరు జన్మించారు?

1. ..............................
2. ..............................
3. ..............................
4. ..............................
5. ..............................
6. ..............................
7. ..............................
8. ..............................
9. ..............................
10. ..............................
11. ..............................
12. ..............................
13. ..............................
14. ..............................
15. ..............................

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. రథానికి సంకేతమని అనుకున్నారు, 2. దామోదరుడు, 3. పవళింపు సేవలో, 4. హయగ్రీవ స్వామిని, 5. ఉత్థాన ఏకాదశి, 6. మార్గశిర శుద్ధ షష్ఠి నాడు, 7. మోపిదేవి, 8. ఆదిశంకరాచార్యులు, 9. సింహిక, 10. ఎల్లప్పుడూ శ్రీహరి సన్నిధానంలోనే ఉండాలని, 11. మాలదాసరి, 12. సుదర్శన చక్రం, 13.అగ్నికి (అగ్ని నక్షత్రం), 14. కాళియ మర్దనుడైన శ్రీకృష్ణుని రూపం, 15. లూయీ

పేరు: ______________________

చిరునామా: ______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్: ______________________

ఫోన్: ______________________

## సరైన సమాధానాలు రాసినవారు

చింతలపాటి శివశంకర శాస్త్రి

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

చింతలపాటి శివశంకర శాస్త్రి




RNI No.: APTEL/2008/23122

Postal Registration No: HSE/879/2025-2027

Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month

Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.



If Un Delivered Please Return to:

**SRI VENKATESHAM,**

(Sri Venkateshwara Maha Mantra Peetham)

H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/
1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq